
ఏప్రిల్ - 2024
DECCAN LAND, HYDERABAD
140
APRIL - 2024

₹ 30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక



VOL 12 వ వసంతంలో
140 ISSUES నూట నలభై వ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్

- ఆహారపు గొలుసులో మేమే తోపులం
- కొల్లేటి జాడలు నవల - పర్యావరణ వివేచన
- దక్షిణ జియో హెరిటేజ్ స్థలాలు
- పారిశ్రామిక నాగరికత - పర్యావరణ దృష్టి

VOL 12వ వసంతంలో

140 ISSUES నూట నలభై వ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్










దక్కన్

## పన్నెండు వసంతాల ప్రస్థానం...


తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2024 ఏప్రిల్ సంచికతో 140 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).

**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007




## KHAJURAHO MONUMENT

## ఖజురహో కట్టడాలు

### UNESCO చే 1986లో గుర్తింపు

ఖజురహోలోని దేవాలయాలు చండేలా రాజవంశం పాలనలో నిర్మించబడ్డాయి. అవి మూడు విభిన్న సమూహాలుగా విభజించబడ్డాయి. ఇవి రెండు వేర్వేరు మతాలకు చెందినవి. ఒకటి హిందూ మతం, మరొ కటి జైనమతం. వాస్తుశిల్పం, శిల్పకళల మధ్య సంపూర్ణ సమతుల్యతతో, అన్ని ఆలయ ఉపరితలాలు బాగా చెక్కబడ్డాయి. ఆరాధనలు, వంశం, చిన్నచిన్న దేవతలు, సన్నిహిత జంటలను చెక్కారు. ఇవన్నీ పవిత్ర విశ్వాస వ్యవస్థను ప్రతిబింబిస్తాయి. అత్యంత నిపుణులైన శిల్పులు సాధించిన కూర్పు, వారి నైపుణ్యం ఖజురహో దేవాలయాల రాతి ఉపరితలాలకు అరుదైన చైతన్యాన్ని అందించింది. మానవ భావోద్వేగాల వెచ్చదనానికి సున్నితత్వాన్ని అందించింది.

TRC
TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## భారతీయ ప్రజల ఆత్మ పునర్జన్మ కొర్‌భూసియర్

1947లో భారతదేశ స్వాతంత్ర్యం, దేశవిభజన తర్వాత లాహోర్‌ను కోల్పోవడంతో పంజాబ్ రాజధాని నగరం చండీగఢ్ నిర్మాణం, క్యాపిటల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రేరేపించింది. స్వతంత్రం పొందిన భారతదేశం ప్రజాస్వామ్యాన్ని వేడుక చేసుకోవడానికి, ఆధునికత వైపు దాని కవాతుకు లీ కోర్ భూసియర్ క్యాపిటల్ఒక ప్రతీకగా భావించబడింది. దేశ ప్రతిష్ట యొక్క మాన్యుమెటల్ ప్లేస్‌గా క్యాపిటల్ కాంప్లెక్స్ రూపుదిద్దుకుంది. స్వదేశీ నిర్మాణ పద్ధతులు, యాంత్రిక రహిత వ్యవస్థలను ఉపయోగించారు. మూడు భవనాలు, అంటే హైకోర్టు, శాసనసభ, సెక్రటేరియట్ రూపుదిద్దుకున్నాయి. తొమ్మిది అంతస్తుల సెక్రటేరియట్ అప్పట్లో చండీగఢ్‌లోని ఎత్తైన నిర్మాణం. ఎలివేటర్లు లేకుండానే పైకి వెళ్లడాన్ని సులభతరం చేయడానికి కొట్టొచ్చేలా కనిపించే ర్యాంప్‌ల ఆలోచన అప్పట్లో మార్గదర్శకంగా నిలిచింది. "మానవ స్థాయికి శ్రావ్యమైన కొలత" అనేది చండీగఢ్ లీ కోర్ భూసియర్ వివరిస్తుంది.

**– బి. ఆర్. కృష్ణ**, హైదరాబాద్

❖ ❖ ❖

## బొంతల చెట్లు

రచయిత శ్రీధర్‌రావ్ దేశపాండే చెట్ల గురించి బాగా తెలియజేశారు. యాపచెట్టు, రావి చెట్టు, జువ్వి చెట్టు, ఎలికి చెట్టు, మర్రి చెట్టు, నిమ్మ చెట్టు ఇలా చెట్ల గురించి, మరిన్ని పెరటి చెట్లు దానిమ్మ, కల్యమాకు, సీతాఫలం, నిమ్మ, తెల్ల గన్నేరు, చామ బొంద, కుంకుడు, జామ, మునగ, మైదాకు, గులాబీ, కనకాంబరం, మల్లే, బంతి, చామంతి, బెండ, దొండ, వంకాయ మొక్కల గురించి వారి చిన్ననాటి జ్ఞాపకాలను ముచ్చట్ల రూపంలో తెలిపిన వ్యాసం చదువుతుంటే నాకు మా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి మళ్లీ మా వూరికి వెళ్లి వచ్చినట్లు అనిపించింది.

**– ఎన్. శ్రీనివాసు రావు**, మెదక్

❖ ❖ ❖

## గిజిగాడు

వేకువ జామున కిలకిలారావాలతో మేలుకొలుపు పాడే పిచ్చుక (గిజిగాడు)లను చూస్తే మనసుకు కాసింత హాయి. చూరుకు వేలాడదీసిన వరి కంకులు, జొన్న కంకులు, రాగి కంకులు తింటూ 'కిచ కిచ' మంటూ గోల చేసే చిట్టి పిట్టలు కలిగించే ఉత్సాహం మనసుకు ఎంతో ఆనందానిచ్చేవి. ఇలా మనిషికి దగ్గరగా ఉంటూ మన కుటుంబంలో ఒకరుగా ఉన్న పిచ్చుకలు మానవజాతి చేస్తున్న తప్పిదాలకు బలైపోతున్నాయి. మార్చి 20 పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చులక ప్రత్యేకతలను తెలియజేసిన రచయిత సత్యప్రసన్న గారికి చాలా థాంక్స్.

**– యం. శ్రీదేవి**, కరీంనగర్

❖ ❖ ❖

## బైండ్ల కళాకారులు

తెలంగాణా జానపద కళారూపాల్లో విశిష్టమైన కళారూపం బైండ్ల కళారూపం. ఇక్కడ మనుగడలో ఉన్న కళారూపాల్లో భారతం, రామాయణం కథలను కథాగానం చేసే కళారూపాలే ఎక్కువ. ఇందుకు భిన్నంగా కేవలం శక్తి దేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ వంటి దేవతలను కొలుస్తూ, కథలు చెప్పే కళారూపాల్లో అరుదైన కళారూపం బైండ్ల కళారూపం. వంశపారం పర్యంగా సంక్రమించిన కథాగాన సంస్కృతిని అనుసరిస్తూ వృత్తి గాయకులుగా పేరు గాంచిన బైండ్లవారు ఎల్లమ్మ, మారమ్మ, మైసమ్మ, భవాని, దుర్గా, కాళి మొదలైన పేర్లు కలిగిన శక్తి దేవతలను ఆరాధిస్తూ జీవనం గడుపుతారు. శక్తి దేవతల చరిత్రలను వీరిని గురించి పరిశీలించినట్లయితే వారి ఆకారం, వీరు పూజించే దేవతలను జన వ్యవహారంలో వీరి యొక్క ప్రత్యేక స్థానాన్ని రచయిత గడ్డం వెంకన్న చాలా చక్కగా వర్ణించారు.

**– ఎ. నవ్య**, మహబూబ్‌నగర్

❖ ❖ ❖

## అందమైన పత్రిక దక్కన్‌ల్యాండ్

వివిధ అంశాలతో ప్రతి నెలా క్రమం తప్పకుండా పలకరిస్తున్న దక్కన్‌ల్యాండ్ పత్రిక యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు. ప్రతి నెలా డిజిటల్, ప్రింట్ రూపంలో, వివిధ రంగాల నిపుణులతో, చక్కటి వ్యాసాలతో మమ్మల్ని ఎంతో అలరింప చేస్తుంది.

**– ఎ. నవ్య**, మహబూబ్‌నగర్

ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 12 సంచిక : 8 పేజీలు : 60

ఏప్రిల్ - 2024

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**ఖజురహో కట్టడాలు**

layout & composing @
**CHARITHA IMPRESSIONS**

printed @ **DECCAN PRESS**
ఆజామాబాద్, హైదరాబాద్-500 020



కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


విషయసూచిక

# లోపలి పేజీల్లో...






తెలంగాణ గిరిజనుల సంప్రదాయ వాద్యాలు - వైవిధ్యం



పచ్చల సొబగు


కాటం లక్ష్మీనారాయణ ........ ఆచార్య వెలుదండ నిత్యానందరావు ........ 6
రాజ్యాంగ పరిరక్షణ నేటి నిజమైన దేశభక్తి........ (ఎడిటోరియల్) వేదకుమార్. యం ........ 7
పచ్చల సొబగు ........ చకిలం వేణుగోపాల్‌రావు ........ 9
చరిత్రకు సజీవ సాక్ష్యాలు .. వారసత్వ ప్రదేశాలు! ........ సత్యప్రసన్న ........ 12
అంబేద్కర్ అడుగుజాడల్లో ........ ఎసికె. శ్రీహరి ........ 13
మృత్యువుతో ముఖాముఖిం ........ పరవస్తు లోకేశ్వర్ ........ 15
ఆ గుడి నేడో రేపో నేల రాలబోతుంది!! ........ ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ........ 18
భారత్ అమ్ముల పొదిలో దివ్యాస్త్రం - ఎంఐఆర్‌వీ టెక్నాలజీ!! ........ పుట్టా పెద్దఓబులేసు ........ 19
పారిశ్రామిక నాగరికత - పర్యావరణ దృష్టి ........ డా॥ ఆర్.సీతారామారావు ........ 23
దక్షిణ భారతంలోని జియో హెరిటేజ్ స్థలాలు ........ కమతం మహేందర్‌రెడ్డి ........ 25
క్యాన్సర్ భూతం ........ గుముడాల చక్రవర్తి గౌడ్ ........ 27
లక్కగాజులకు 'జీఐ' నగిషీ ........ కె. సచిన్ ........ 28
ఖజురహో కట్టడాలు ........ జాన్విజ్ శర్మ ........ 29
రామగిరి కథ ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 31
కొల్లేటి జాడలు నవల - పర్యావరణ వివేచన ........ డా॥ జె. నీరజ ........ 35
సింగరేణి : భారీ జలాశయాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ........ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ........ 39
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా - గ్రామ నామాలు ........ డా॥ మండల స్వామి ........ 41
తిండి పోతులం! ఆహారపు గొలుసులో మేమే తోపులం!! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 43
తెలంగాణ గిరిజనుల సంప్రదాయ వాద్యాలు-వైవిధ్యం ........ డా॥ బాసని సురేష్ ........ 47
పర్యావరణ పరిరక్షణ ........ కట్టా ప్రభాకర్ ........ 52
మాడభూషి రంగాచార్య స్మారక కథల పోటీ బహుమతులు ........ పైడిమర్రి గిరిజ ........ 53
బాలచెలిమి గ్రంథాలయం ........ ప్రవీణ్ కుమార్ శర్మ ........ 54
మంచి పుస్తకం @ 20 ........ వలేటి గోపీచంద్ ........ 55
నానమ్మ చెప్పిన కథ ........ కొట్ల శిరీష ........ 58



**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# కాటం లక్ష్మీనారాయణ

శ్రీ కాటం లక్ష్మీనారాయణగారు కాలంచేసి అప్పుడే ఏళ్లు గడిచిపోయాయి. గుండ్రటి ముఖం. ఎత్తైన మనిషి, ఖద్దరు తప్ప మరొకటి ఏనాడు దాల్చని నియమవ్రతుడు. ఇందిరాగాంధీతో సహా ఎంతటి వారినైనా సరే ఢీకొట్టగల సాహసి. మంత్రులు, అధికారులు అందరూ సన్నిహితులే అయినా ఏనాడు పదవుల కోసం, ప్రాపకాల కోసం వాడుకోని నిస్వార్థ శీలి. ఎన్నేళ్లు జీవించారు అనేకాదు. ఎన్ని మంచిపనులు చేశారన్నదే జీవితానికి ప్రాతిపదిక అయితే 86 ఏళ్ల నిండు జీవితాన్ని కాటం లక్ష్మీనారాయణ అనుభవించారు. 86కు మించిన మైలురాళ్ల నధిగమించిన మంచిపనులు సమాజానికి ఉపయోగకరమైన, స్ఫూర్తివంతమైన పనులు చేశారని చెప్పవచ్చు. జీవిత సార్థక్యానికి ఇంతకంటే కావలసింది ఏముంది?

స్వాతంత్ర్యోద్యమ కాలంలో సాహసోపేతంగా ఉద్యమాలు నిర్వహించారు. జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్యానంతరం ఏ చిన్నపాటి పదవుల కోసమైనా పాకులాడకుండా ఎన్నెన్నో పెద్ద పెద్ద సభలు నిర్వహించి స్ఫూర్తిని నిలిపారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రను భావితరాలకు అందించాలనే ఆరాటపడ్డారు. సంపుటాల రూపంలో ముద్రింపజేశారు. స్వాతంత్ర్యోద్యమ వీరులు చివరి దశలో కష్టపడకుండా పింఛను సౌకర్యాన్ని కల్పించడంలో చురుకైన పాత్ర పోషించారు. ఒక్కమాటలో చెప్పాలంటే తాము చేపట్టిన ఏ పనినైనా అంతుచూసే దాకా వదిలిపెట్టని దృఢవ్రతులు కాటం లక్ష్మీనారాయణ.



1924 సెప్టెంబర్ 19న రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు జన్మించిన లక్ష్మీనారాయణ అనువంశికమైన యాదవుల ధైర్య సాహసాలు, నిర్భయశీలం అలవడ్డాయి. కాటమరాజును వంశ మూలకర్తగా భావించేవారిలో ఆ నిర్భయశీలం ఉండటంలో ఆశ్చర్యపోవలసినది ఏమీలేదు. తాతగారు కాటం నారాయణ స్థానిక జమిందారుల ఆకృత్యాలను, సామాజిక దురాచారాన్ని ఎదిరించి బహుజనులను ఐక్యపరచి సహాయ నిరాకరణ చేయించినధీరుడు. తాతగారి పేరు పెట్టుకున్నందుకు కాబోలు ఈ మనవడికి కూడా తాతగారి లక్షణాలన్నీ అక్షరాల అబ్బాయి.

1942 అక్టోబర్ 12న బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో సత్యాగ్రహం చేయడానికి సమాయత్తమయ్యారు. బూర్గులవారు “మహాజనులారా...” అని కంఠమెత్తగానే పోలీసులు లాఠీ ఝుళిపించారు. సభలోని వారంతా భయంతో చెల్లాచెదురయ్యారు. 19 ఏళ్ల కాటం లక్ష్మీనారాయణ స్థిరంగా నిలబడి నినాదాలు చేశారు. బూర్గుల వారితో పాటే లక్ష్మీనారాయణను అరెస్టు చేశారు. ఆనాటి నుంచి లక్ష్మీనారాయణ బూర్గుల రామకృష్ణారావును గురువుగా భావించారు. ఈ గురుశిష్యుల అనుబంధం చివరిదాకా కొనసాగింది. ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించినందుకు గాను లక్ష్మీనారాయణకు ఏడేళ్ల జైలుశిక్ష వేసి చంచలగూడ జైలుకు పంపించారు. ఆ జైల్లో స్థానిక నాయకులెందరో ఉన్నారు. వారి అనుభవాల సారాన్ని లక్ష్మీనారాయణ గ్రహించారు. తమను తాను మలుచుకున్నారు. ప్రతికూలమైన పరిస్థితుల్లో సైతం బెంబేలు పడిపోయి.. నీరుగారిపోకుండా వాటిని తమకు అనుకూలంగా మలుచుకోగలిగే స్థిరచిత్తం, సంయమన శీలం లక్ష్మీనారాయణకు ఆ జైలు జీవితం నేర్పింది. జైలు నుంచి తిరిగి వచ్చాక ‘లా’ పూర్తిచేసి బూర్గుల వారివద్దనే జూనియర్ లాయర్‌గా చేరారు. బూర్గుల వారి కార్యక్రమాలన్నింటిలోనూ చేదోడువాదోడుగా లక్ష్మీనారాయణ నిలిచారు. ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో క్రియాశీలక పాత్ర వహించారు.

రాజకీయ ఉద్యమాల్లోనే కాక దళిత జనోద్ధరణం, ఖాదీ ప్రచారం, హిందీ వ్యాప్తి లాంటి సమకాలీనమైన సంస్కరణ కార్యకలాపాలకు స్పందించారు. నిజాం ప్రభుత్వ ఆజ్ఞను ఉల్లంఘించి హిందీ పాఠశాలను స్థాపించారు. పోలీసులు దాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించారు. లక్ష్మీనారాయణ తదనంతర కాలంలో హిందీ ప్రతిష్టాన్ సంస్థకు మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరించడానికి హిందీ మాతృ భాష గానీ, దక్షిణ భారత హిందీ రచయితల సమ్మేళనాలు బెంగుళూరు, చెన్నై, త్రివేండ్రం, గోవా లాంటి నగరాల్లో ఘనంగా నిర్వహించడానికి బీజాలు పడింది ఇక్కడే. ప్రముఖ గాంధేయవాది స్వర్గీయ రామకృష్ణదూత్ 1946లో ఆజన్మాంతం ఖద్దరునే ధరిస్తామని 120 మంది యువకుల చేత చేయించిన ప్రతిజ్ఞలో లక్ష్మీనారాయణ గారున్నారు. ఆనాటి నుంచి ఖద్దరు ధరించారు.

ఆచార్య ఎన్.జి.రంగా ప్రేరణతో 1945లో లక్ష్మీనారాయణ హైదరాబాద్ యువజన కాంగ్రెస్‌ను స్థాపించి భాయి రామ్మూర్తి నాయుడిని అధ్యక్షునిగా చేసి తాను ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. దీన్ని బ్రిటిష్, ఆంధ్ర పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఉర్దు పత్రికలు మాత్రం యువకుల్ని చదువు కోనీయకుండా రాజకీయాల్లోకి దించుతున్నారంటూ ఆడిపోసుకుంటే.. ఆంధ్ర పత్రికలు, తెలుగు పత్రికలు ఘనంగా ప్రశంసించాయి. బూర్గుల లాంటి పెద్దలు వెలిగిస్తున్న చైతన్య జ్యోతి మసకబారిపోకుండా, వారు సత్యాగ్రహాలు

(తరువాయి 8వ పేజీలో)

# రాజ్యాంగ పరిరక్షణ నేటి నిజమైన దేశభక్తి



దేశాన్ని ప్రేమించడమంటే దేశంలోని మనుషుల్ని ప్రేమించడం. మనుషుల్ని ప్రేమించడమంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎలాంటి వివక్షతలు, అసమానతలు లేని ప్రజాస్వామిక, మానవీయ స్పృహతో పరిఢవిల్లే మానవ సమాజాన్ని నిర్మించుకోవడం. దానికవసరమైన భావనల, పాలనావిధానాల, హక్కుల, బాధ్యతల సమోన్నత చట్టరూపమే రాజ్యాంగం.

భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక గణతంత్రంగా నిర్మించుకునే దీపదారి మన రాజ్యాంగం.

వివిధ రాష్ట్రాలు, జాతులు, ప్రాంతాలు, కులాలు, భిన్న సంస్కృతులు, భాషలు, భౌగోళిక స్థితులు కలిగిన వైవిధ్యపూరితమైన మనదేశ ప్రజలందరి మధ్య ఐక్యతను సాధించి భిన్నత్వంలో ఏకత్వం సాధ్యమని నిరూపించి ఫెడరల్ వ్యవస్థకు ప్రాణం పోసింది మన రాజ్యాంగం.

ఈ దేశంలో పౌరులందరూ సమానమే. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదు. అందరికీ సమాన హక్కులూ, బాధ్యతలూ అన్నదే రాజ్యాంగ సారాంశం. రాజ్యాంగం ఏ తారతమ్యాలు లేకుండా ప్రజలందరికీ విద్యాహక్కు, వైద్య సదుపాయాల హక్కు, ఆరోగ్యకరంగా, ఆత్మాభిమానంతో జీవించే హక్కు, తమ ఆలోచనలను, విశ్వాసాలను భయం లేకుండా చెప్పగలిగే భావ ప్రకటనా హక్కు, తమ జీవిత విధానాన్ని యిష్టపూర్వకంగా నిర్దేశించుకునే స్వేచ్ఛ యిచ్చింది.

రాజ్యాంగం లేకముందు కొన్ని సమూహాలకి ఎలాంటి హక్కులు లేవు. సంపన్నులు, విద్యావంతులకు మాత్రమే ఓటు హక్కు వుండేది. విద్య, వైద్య, రాజకీయ, ఉపాధి అవకాశాలు అన్ని సమూహాలకు సమానంగా లేవు. రాజ్యాంగం ఆ సమూహాలన్నిటినీ మనుషులుగా గుర్తించింది. వయోజనులైన అందరికీ ఓటుహక్కును యిచ్చింది. తరతరాలు ఎలాంటి అవకాశాలు పొందలేక పోతున్న ఆ సమూహాలకోసం ప్రత్యేక సదుపాయాలు, రిజర్వేషన్లు కల్పించింది. దీనితో ఆ సమూహాలు తమ హక్కుల్ని వినియోగించుకున్నారు. విద్యావంతులయ్యారు. ఉన్నత పదవుల్లో, ఉద్యోగాల్లో వున్నారు. సామాజికంగా, రాజకీయంగా ఎదిగి చట్ట సభల్లో గణనీయంగా వున్నారు. ఇలా ఈనాడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆదివాసీ సమూహాలు, స్త్రీ సమాజం సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాలలో బలమైన శక్తిగా ఆవిర్భవించారు. ఇది దేశంలో ఒక మౌలికమైనమార్పు. ఈ రాజ్యాంగం లేకపోతే ఈ సమూహాలకు ఈ అభివృద్ధి సాధ్యమయ్యేది కాదు. అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి దీనికి దోహదం చేసాయి.

ఈ సమూహాలే కాక సమాజంలోని అన్ని వర్గాల ప్రజల హక్కులు, ప్రయోజనాలు రాజ్యాంగం నెరవేర్చింది. రాజ్యాంగ రచనకు, ఆచరణకు వివిధ వైపుల నుంచి ఆటంకాలు, అవరోధాలు ఎదురవుతున్న సందర్భంలో మనమున్నాం. భారతీయ సామాజిక వ్యవస్థను సమూలంగా మార్చి అసమానతలు లేని, వివక్షతలు లేని, అందరికీ సమానహక్కులు కలిగిన నూతన సమాజ నిర్మాణానికి శాంతియుత, సహేతుక మార్గాన్ని చూపుతున్న మన రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయడమే ఇవ్వాల్టి నిజమైన దేశభక్తి.

ఏప్రిల్ 14 రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ పుట్టినరోజు. వారికి జేజేలు.



(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

నిర్వహించి జైలుకు పోయినప్పుడు స్తబ్దత ఏర్పడకుండా కాటం లక్ష్మీనారాయణ యువజన కాంగ్రెస్ కృషిచేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. నిజాం రాజ్యానికి మాత్రం విముక్తి లభించలేదు. బూర్గుల వారు, కాటం వారు ప్రపంచ నాయకుల దృష్టికి దీనిని తీసుకువచ్చి వారి సహకారాన్ని, సానుభూతిని పొందాలనుకున్నారు. 1947 ఆగస్టు 15 ఇరువురు మద్రాసు (చెన్నై), రష్యా, అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ నేతల నుంచి నైతిక సహకారాన్ని అభ్యర్థిస్తూ టెలిగ్రాములు ఇచ్చారు. ఇది తెలుసుకున్న నిజాం ప్రభుత్వం హైదరాబాద్‌లో కాలుపెట్టిన మరుక్షణం గురుశిష్యులిద్దరిని అరెస్టు చేసింది.

జైల్లో ఉన్నప్పుడు బూర్గుల కె.వి.రంగారెడ్డి, కాశీనాథుని వైద్య లాంటి నాయకులతో ఏదోరకంగా రాజీపడాలని నిజాం ప్రభుత్వం ఓ ఎత్తుగడ వేసింది. 22 వేలమంది చావుబతుకులకు తెగించి జైళ్లలో ఉంటే రాజీ ప్రతిపాదనలా? ఇది ఉద్యమ స్ఫూర్తికే కళంకం అని యువ ప్రతినిధి అయిన కాటం లక్ష్మీనారాయణ లేఖలు రాయడంతో ఆ ప్రతిపాదనకు గండి పడింది. కాటం లక్ష్మీనారాయణ జైల్లో ఉన్నంతకాలం వారి కుటుంబ పోషణ కోసం కె.వి.రంగారెడ్డి నెలకు 15 రూపాయలు ఇచ్చేవారట. కె.వి.రంగారెడ్డి గారికి లక్ష్మీనారాయణ అంటే అంత అభిమానం. కాస్త వయసులో పెద్దవారైన మర్రి చెన్నారెడ్డి గారితోనూ లక్ష్మీనారాయణకు అంతే సాన్నిహిత్యం ఉండేది. మర్రి చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణ ఒకే సైకిల్ ఎక్కి హైదరాబాద్‌లో చక్కర్లు కొట్టేవారట.

1947 మే నెల 11న పెళ్లి చేసుకున్న లక్ష్మీనారాయణ నాలుగు నెలలకే మళ్లీ అరెస్టయ్యారు. ఇలా పోలీసుల యాక్షన్ జరిగేదాకా అంటే 1948 సెప్టెంబర్ దాకా జైలుకు వెళ్లడం తిరిగి రావడం, మళ్లీ జైలుకు వెళ్లడం మళ్లీ తిరిగి రావడం అన్నది లక్ష్మీనారాయణ జీవితంలో చాలా మామూలు విషయమైపోయింది. ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం మంత్రి పదవుల కోసం పాకులాడకుండా ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక రంగాల్లో రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం 1949 డిసెంబర్‌లో 'జనతా' పేరుతో ఉర్దూలో వారపత్రికను ప్రారంభించారు. 1945-46లలో మందుముల రామచంద్రారావు స్థాపించిన 'రయ్యత్' పత్రికలో పనిచేసిన అనుభవం లక్ష్మీనారాయణకు ఈ సందర్భంలో ఉపకరించింది. రజాకారుల చేతిలో హతుడైన షోయబ్ 1952లో రాష్ట్ర కర్షక సంఘం స్థాపించారు. ఎస్.బి. చౌహాన్ లాంటి మేటి నాయకులు ఈ సంఘం కార్యవర్గ సభ్యులుగా ఉండేవారు.

తెలుగు భూమి అనే మరో పత్రికను 1969లో ప్రారంభించారు. 1969 నాటి ప్రత్యేక తెలంగాణ నాటి ఉద్యమ సమయంలో చాలామంది రచయితలు, నాయకుల లాగానే సమైక్యవాదిగా నిలిచారు. ప్రభాకర్ జీ లాంటి సర్వోదయ మండలి ఆచార్యుల ఆశీస్సులతో సర్వోదయ సాహిత్య ప్రచారాన్ని, భూదానోద్యమ కార్యక్రమాలను వ్యాపింపజేశారు. ఇప్పటికీ సర్వోదయ మండలి భూదానోద్యమ సంస్థలు తమ కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అకాడమి లాగా హిందీ అకాడమీ ఉండాలని చెప్పి ప్రభుత్వం చేత ఏర్పాటు చేయించి దానికి ఉపాధ్యక్షులయ్యారు. హిందీ పుస్తక ప్రచురణలకు ఆర్థిక సాయం, రచయితలకు శిక్షణ శిబిరాలు నిర్వహింపచేశారు.

దేశ స్వాతంత్ర్యోద్యమంలో అన్నివిధాల త్యాగాలు చేసిన దేశభక్తులకు వరం లాంటిది స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పథకం. ఈ పథకాన్ని హైదరాబాద్ వారికీ వర్తింపజేయాలని కేంద్రప్రభుత్వంతో లక్ష్మీనారాయణ గారు చర్చలు జరిపారు. మొదట కేంద్రప్రభుత్వం అంగీకరించలేదు. మరుసటి రోజు లక్ష్మీనారాయణ తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుని సత్యాగ్రహం అనే అట్టను మెడకు తగిలించుకుని ప్రధాని నివాసం ముందు నిరాహారదీక్ష చేశారు. ఢిల్లీ పత్రికలు దీన్ని ప్రముఖంగా ప్రచురించాయి. ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ లక్ష్మీనారాయణను పిలిపించుకుని ఏమిటి సంగతి అని వివరాలు అడిగారు.

సంస్థానాల్లోని స్వాతంత్ర్య సమరయోధులను మీరు గుర్తించకపోవడం కన్నా మాకు అవమానం ఏమున్నది? బ్రిటిష్ ఆంధ్ర నాయకులు ఒక బ్రిటిష్ వారిమీదనే పోరాడారు. కానీ సంస్థానాల వారు అటు సంస్థానాధిపతులకు వ్యతిరేకంగానూ, ఇటు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగానూ పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం వచ్చినట్టు కాదా! హైదరాబాద్ విముక్తి జరిగిన సెప్టెంబర్ 17ను స్వాతంత్ర్య దినంగా జరుపుకోమంటారా? ఒక్క హైదరాబాద్ సంస్థాన ప్రజలే కాదు... అసలు సంస్థానాల ప్రజలు భారతీయులు అవునా.. కాదా... ప్రకటించండి అని సూటిగా, ధైర్యంగా కాటం లక్ష్మీనారాయణ ఇందిరాగాంధీని ప్రశ్నించారు. దీంతో 22 వేలమంది స్థానిక స్వాతంత్ర సమరయోధులకు పెన్షన్ సౌకర్యం లభించింది.

లక్ష్మీనారాయణ గారు చేసిన మహత్తర కృషి హైదరాబాద్ స్వాతంత్ర్య చరిత్రను ప్రామాణిక పద్ధతిలో గ్రంథస్తం చేయించే కృషి చేపట్టారు. ఆ ప్రామాణికలో వచ్చిందే వెల్దుర్తి మాణిక్యాల రావు గారి 844 పేజీల హైదరాబాద్ స్వాతంత్ర్య సమర చరిత్ర. ఇది ఇప్పటికీ ప్రామాణిక గ్రంథం. చాలా పెద్దఎత్తున సభలను ఒక్కచేతి మీదుగా నిర్వహించడం లక్ష్మీనారాయణ గారి గొప్పతనాల్లో ఒకటి. హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్రను హైదరాబాద్‌లో అప్పటి రాష్ట్రపతి జైల్‌సింగ్ చేత ఆవిష్కరింపజేశారు. లక్ష్మీనారాయణ గారి కుమారులు ప్రముఖ లాయర్ కాటం రమేష్ రాసిన ఆంధ్రదేశ స్వాతంత్ర్య చరిత్రను 1992 భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆవిష్కరింపజేశారు.

పి.వి.నరసింహారావు, టి.అంజయ్య, కాసు బ్రహ్మానంద రెడ్డి, భవనం వెంకట్రావు నలుగురు ముఖ్యమంత్రులతో ఒక పెద్ద సభ నిర్వహించారు. కాటం లక్ష్మీనారాయణ నిర్వహించిన సభల్లో ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధిపతులు, స్వాతంత్ర్య సమర యోధులు, దలైలామా లాంటి వారు ఎందరో పాల్గొనేవారు.

తన కోసం వీసమాత్రమైనా అడగకపోవడం, సర్వజన శ్రేయస్సు కోసం, విలువల కోసం ఎంతటి వారినైనా నిర్మొహమాటంగా విమర్శించ దానికి వెనుకంజ వేయక పోవడం లక్ష్మీనారాయణగారి వ్యక్తిత్వంలోని ప్రధాన గుణం. 86ఏళ్ల పరిపూర్ణ జీవితం గడిపి 25 ఫిబ్రవరి, 2010న అస్తమించారు. అలాంటి వారిని స్మరించుకోవడం స్ఫూర్తిదాయకం.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

– ఆచార్య వెలుదండ నిత్యానందరావు

# పచ్చల (Emeralds) సొబగు

బెరిల్ ఖనిజ కుటుంబానికి చెందిన మహారత్నం మరకతం. జలనీలం, పచ్చని బెరిల్ (green Beryl), వైఢూర్యం మొదలయినవి ఒకే ఖనిజ రూపాలు.

**పచ్చల ప్రస్తావన:** మరకతం, పచ్చ అనేది రాచరికంతో ముడిపడి ఉన్న ప్రసిద్ధ రత్నం. ఇది విధేయతకు, ప్రేమకు చిహ్నం. మరకతం కులీనులు మరియు ప్రభువులచే ఎక్కువగా ఆదరించబడ్డది. ఈ రత్నం చరిత్ర ప్రారంభదశ నుండి మానవ సమాజానికి చిరపరిచితం. రాణి క్లియోపాత్ర పచ్చలపట్ల ఆసక్తికి పేరుగాంచింది. రోమన్లు దీనిని వీనస్ దేవతతో అనుబంధించారు. అప్పటి క్లియోపాత్రా నుండి ఇప్పటి ఎలిజబెత్ టేలర్ దాక అందరిని అలరించిన ఈ బెరిల్ కుటుంబం రత్నం ప్రస్తావన మన సాహిత్యంలో కూడా కనిపిస్తుంది.

మహాజనపదాల కాలంలో ఉత్తర భారతం, దక్షిణాదితో సంబంధంలోకి వచ్చిన నాటి నుండి, మౌర్యుల కాలం నాటి బౌద్ధస్థూపాలలో బెరిల్-వైఢూర్యం దొరికింది. బుద్ధుని కాలంలో బెరిల్ రత్నం వాడుక ఉన్నట్టు తెలుస్తుంది.



బెరిల్ ప్రస్తావన అర్ధశాస్త్రంలో ఉంది. బృహద్సంహితలో వజ్రాలు మరియు ఇంద్రనీలాల తర్వాత మూడవ స్థానంలో పచ్చ పేర్కొనబడ్డది. భట్టాలపాలుడు "... ఇత్యాది ఉత్కృష్టాని చత్వరీ వజ్ర, ముక్త, పద్మరాగ, మరకతాఖ్యాని" అన్నాడు. అంటే వజ్రం, ముత్యం, మాణిక్యం మరియు మరకతం అనే ఈ నాలుగు రత్నాలు ఉత్తమమైనవి. నరహరి తన 'రజనిఘంటువు'లో లోహితక, వజ్ర, మౌక్తికా, మరకట, నీల మహోపలః పంచ.. అనగా మాణిక్యం, వజ్రం, ముత్యం, మరకతం మరియు నీలమణి అనే ఐదు గొప్ప విలువైన రాళ్లు అని.

ఆయుర్వేద గ్రంథం 'రసజలనిధి'లో మరకత ప్రస్తావన ఉన్నది. గరుడ పురాణంలో, అగస్త్యసంహితలో కూడా దీని ప్రస్తావన ఉన్నది. మహాభారతంలో కూడా మరకత ప్రస్తావన ఉన్నది. వాల్మీకి రామాయణంలో కూడా పుష్పకవిమాన వర్ణనలో మరకతం ప్రస్తావించబడింది. శివపురాణం, స్కాంధపురాణాలలో మరకత లింగాల ప్రస్తావన ఉంది. వేదాలు, పురాణాలలో అనేక చోట్ల నవరత్నాల ప్రస్తావన ఉంటుంది. మరకతం నవరత్నాలలో ఒకటి. ఐతే మరకతంగా ప్రసిద్ధి చెందిన ఈ రత్నం నిజానికి వైడూర్యం (Beryl) మాత్రమే. నిజమైన మరకతం లేదా జాతిపచ్చ ఆ కాలంలో ఈజిప్టు నుండి మాత్రమే వచ్చేది. ఎమరాల్డ్ గనులు భారత దేశంలో చాలాకాలం తరువాత కనుగొనబడ్డాయి.

క్రీస్తుశకం ప్రారంభంలో ఇండో-రోమన్ వాణిజ్యం కారణంగా బెరిల్ ప్రజాదరణ పొందింది. ప్లినీ తన నేచురలిస్ హిస్టోరియాలో బెరిల్ భారతదేశంలో కాకుండా మరెక్కడా కనుగొనబడ లేదని వ్రాశాడు. దీని స్ఫటికాల యొక్క షట్కోణ రూపాన్ని కళాకారులు మలిచారని అప్పట్లో అతను భావించాడు. అది సహజ రూపం అని అతనికి అప్పటికి తెలియదు. మహా భారతంలో పొడుగు షట్కోణాకారం బెరిల్ స్ఫటికాలు గడ్డిమొనలతో పోల్చబడింది. కాళిదాసు రత్నసలాకాను (బెరిల్ యొక్క పొడవైన గడ్డి ఆకుపచ్చ స్ఫటికాలు) కుమారసంభవంలో ప్రస్తావించాడు.

వెల్లూరు చుట్టుపక్కల కనిపించే ఆకుపచ్చ బెరిల్, ఆక్వామారిన్ తరచుగా పాండ్య చేర మరియు చోళ రాజ్యాల మధ్య వివాదానికి దారితీసింది. పున్నాట, పోదనూరు గనుల మైసూర్ వద్ద ఉన్నవి చేరరాజ్యం చేత నియంత్రించబడ్డాయి. వెల్లూరులోని గనులు, వాణియంబాడి గనులు చోళులచే నియంత్రించబడ్డాయి. ఈ బెరిల్ / aquamarine మొత్తం కోయంబత్తూరులో ప్రాసెస్ చేయబడి ముజిరిస్ ద్వారా రోమ్‌కు ఎగుమతి చేయబడింది. నిజమైన బెరిల్ రత్నాలతోపాటు 'అనుకరణబెరిల్ రత్నం (ఆకుపచ్చ గాజు)' వంటిది కూడా అప్పుడప్పుడు ఎగుమతి చేయబడింది.

వార్మింగ్టన్ రచనలు దక్షిణ భారతదేశం నుండి ఎగుమతి చేయబడిన ఆకుపచ్చ ఆక్వామెరైన్‌లపై రోమన్ల ఆసక్తిని సూచిస్తున్నాయి. బెరిల్ రోమన్ లను ఎంతగా ఆకర్షించింది అంటే అక్కడ బెరిల్లస్ అనే పేరు బాగా ప్రాచుర్యం పొందింది.

**వైఢూర్యం, మరకతం వ్యుత్పత్తి:**

అష్టాధ్యాయిని (4.3.84)లో పాణిని (500 BC)లో ఈ మణి విదూరనగరం నుండి వచ్చిందని, అందుకే దీన్ని వైఢూర్యం అన్నారు. నిజానికి ఈ ఖనిజం వాలవాయపర్వతం నుండి వచ్చింది. విదూర నగరం రత్నాలు సానపట్టే కేంద్రం మాత్రమే. ఈ నగరం మరియు రత్నం పేరు మధ్య ఉన్న సంబంధం విషయంలో ఏకాభిప్రాయం లేదు. కొంత మంది దీన్ని కేవలం కల్పనగా పరిగణించారు. కాని, బుద్ధభట్టుడు తన రత్నపరీక్షలో పాణిని అభిప్రాయాలను సమర్థించాడు. పాణిని 'వాలవాయ', బుద్ధభట్టుని 'వాలికా' పర్వతాలు ఒకే విధంగా ఉన్నాయి. అప్పటి కొంగ మరియు చోళరాజ్యాల సరిహద్దులు ఇప్పుడు కోయం బత్తూర్ సమీపంలోని సేలంలో భాగం అని తెలుస్తున్నది. ఇక్కడ నుండి పురాతన కాలంలో రోమన్లకు బెరిల్ సరఫరా చేయబడింది. ఆల్ఫ్రెడ్ మాస్టర్ వేలూరియాను బెరిల్‌కు సమానమైనది అని సూచించారు.

ద్రావిడ భాషలలో వెల్ అనగా తెలుపు మరియు ఉర్ పట్టణం. సంస్కృతంలో విదూర అంటే సుదూర ప్రదేశం.

తమిళనాడులోని వెల్లూరు మరియు కర్ణాటకలోని బేలూర్ వంటి ఒకటి కన్నా ఎక్కువ వెలూర్లు ఉండే అవకాశం ఉంది, ఇవన్నీ బెరిల్ రత్నం యొక్క ప్రాసెసింగ్ కేంద్రాలుగా వుండవచ్చును.

A.k బిస్వాస్ గారి అభిప్రాయం ప్రకారం వేలూరియ మొదట క్వార్ట్జ్ స్ఫటికాలపరంగా వాడారు, అది కాలక్రమంలో నీలం మరియు ఆకుపచ్చమణి బెరిల్‌కు కూడ పొడిగించబడింది. క్రమంగా అది

సంస్కృతంలో వైఢూర్యం గాను కొంత మార్పుతో గ్రీకు, అరబిక్, పర్షియన్ భాషలలోకి ప్రవేశించింది. బెరిల్లస్ అనే లాటిన్ పదం బెరిల్ అనే ఆంగ్ల పదానికి దారితీసింది. జర్మన్ పదం Brille అంటే కంటిఅద్దాలు. నీరోచక్రవర్తి పచ్చని బెరిల్‌తో చేసిన అద్దాలు ధరించేవాడు అంటారు. మూలకాల యొక్క ఎటువంటి చేరికలు లేదా జాడలు లేని బెరిల్ రంగులేనిది దానిని ఘోషనైట్ అంటారు. కళ్లద్దాల లెన్స్‌కు ఘోషనైట్ను పూర్వం ఉపయోగించేవారు. పచ్చల యొక్క ఆహ్లాదకరమైన పచ్చని రంగు కళ్లకు హాయిని కలిగిస్తుంది. ప్రస్తుతం వైఢూర్యం అనే పదాన్ని తరచుగా క్రిసోబెరిల్‌కు ఉపయోగిస్తున్నారు. ఇది సాంకేతికంగా సరైనది కాదు, వాణిజ్య పరమైన అలవాటు మాత్రమే.

బుద్ధభట్టుడు పిల్లి కన్నువలె ఉండే 'స్ఫులింగాని బాహా' అనే వైఢూర్యం గురించి వివరించాడు. A.k.Biswas అభిప్రాయం ప్రకారం cats eye బెరిల్‌లో సాధారణంగా ఉండదు. క్రిసోబెరిల్ లో కనిపిస్తుంది. దానిని వైఢూర్యం అని పొరపాటుగా బుద్ధభట్టుడు పేర్కొని ఉండవచ్చు. భారతదేశంలోని ప్రాచీన పండితుల అభిప్రాయం ప్రకారం వైఢూర్యం అంటే తెలుపు మరియు, ఆకుపచ్చ, కొన్నిసార్లు నీలం రంగులో ఉండే బెరిల్ మాత్రమే తప్ప వేరే ఏదీ కాదు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో వైఢూర్యం రంగు నీలకమలం, శిరీష పుష్పం లేదా నీటిరంగు, ఆకుపచ్చవెదురు మరియు చిలుకలరెక్కల రంగు అని వివరించాడు. ఇది మార్జలాక్ష లేదా క్రిసోబెరిల్ లక్షణాలకు స్పష్టంగా భిన్నంగా ఉంది. బుద్ధభట్టుడు వేరొక సందర్భంలో బెరిల్ రంగు నెమలి కంఠం వలే లేదా ఆకుపచ్చ వెదురు వంటిది అన్నాడు.



అగస్త్య రత్నపరీక్ష మరియు గరుడపురాణంలో బెరిల్ రంగు గ్లోవార్మ్ పృష్టభాగం రంగుతో పోల్చబడింది. ముదురు ఆకుపచ్చ మరకతం రామాయణంలో గాని కౌటిల్యుని అర్థశాస్త్రంలో గాని ప్రస్తావించబడలేదు. మహాభారతంలో ఉన్నది తరువాత ప్రక్షిప్తం కావచ్చు.

ప్రారంభ దశలో పచ్చకి భారతదేశంలో ఉన్న పేరు 'మసరక' ఇది మిస్ర్ లేదా ఈజిప్ట్ నుండి వచ్చినదనే అర్థాన్ని సూచిస్తుంది. గ్రీకులు దీనిని స్మరాగ్డస్ అని పిలిచారు. మరు అంటే ఎడారి మరియు కత అంటే తీరం, ఈ రాయి ఈజిప్టులోని క్లియోపాత్రా గనుల నుండి వచ్చిందని "మరకత" పదం సూచిస్తుంది. బుద్ధభట్టుడు (క్రీ.శ. 5వ శతాబ్దం) తన రత్నపరీక్షలో మరకతాలు వరవర పర్వతం నుండి మరియు సముద్ర తీరం దాటి, తీరానికి సమీపంలో ఉన్న గనుల నుండి వచ్చాయని పేర్కొన్నాడు. ఈజిప్టు పచ్చల గనులు రెండు గ్రూపులుగా ఉన్నాయి ఒకదానిని జెబెల్ సాకేత్ అంటారు, మరొకటి సబ్రా లేదా జబ్రా. ఈ జాబ్రా పర్వతమే వరవరగా భారతీయ ప్రాచీన గ్రంథాలు పేర్కొన్నాయి. వరవర అంటే ఈశాన్య ఆఫ్రికా ప్రాంతము అని అర్థం. అగస్త్యమతం మరియు రత్నసంగ్రహములలో కూడా ఇలాంటి భౌగోళిక వివరణలే ఉన్నాయి.

ఒక పురాణకథ ప్రకారం రత్నాలు చనిపోయిన బలి రాక్షసుడి యొక్క వివిధ శరీరభాగాల నుండి వచ్చాయి. (ఎముకల నుండి వజ్రం, కళ్ళ నుండి నీలమణి మరియు పిత్తం నుండి పచ్చ, ఇలా వివిధభాగాల్లో నుండి వివిధరత్నాలు ఏర్పడ్డాయి.) వధించబడిన రాక్షసుని పిత్తాన్ని గరుడుడు తన ముక్కున కరుచుకుని వరవర పర్వతం ప్రాంతంలో పడేశాడట. గరుడం, హరిణ్మణి మొదలైన పదాలు పచ్చకి అలా ఆపాదించబడ్డాయి. తెలుగులో కూడా మంచి నాణ్యత గల పచ్చలను గరుడపచ్చ అంటారు. పన్నా అనే పదానికి పాము అని, అలాగే పడిపోయినది అని కూడా అర్థం. ఇలా మరకతం, పచ్చ, పన్న మొదలైన పేర్లు వచ్చాయి.

ఇంకా మరకతానికి అనేక పర్యాయపదాలు ఉన్నాయి. అందులో కొన్ని "గరుత్మతం, అస్మగర్భం, హరిణ్మణి, రాజనీలం, గరుడాంకితం, సౌపర్ణం, రౌహినేయం, గరుడోద్గీర్ణం, గరుడోత్తీర్ణం, గరుడం, అస్మగర్భజం, గరలరిః, వాపబోలం లేదా వప్రవాళం, బుధరత్నం" మొదలైనవి. మరకతం యొక్క గ్రీకు, రోమన్, లాటిన్, అరబిక్ పేర్లు సంస్కృత నామానికి ఇంచు మించు, ఫొనెటిక్‌గా సమానంగా ఉంటాయి.

**బెరిల్ ఎగుమతి, దిగుమతులు:**

బిస్వాస్ అభిప్రాయం ప్రకారం ముదురు ఆకుపచ్చ మరకతం గ్రీకు, రోమన్ వాణిజ్యకాలంలో మాత్రమే ఈజిప్ట్ నుండి మనకు దిగుమతి చేయబడింది. భారతదేశం నుండి పశ్చిమానికి ఎగుమతి అయిన ఆకుపచ్చబెరిల్ ను ఓరియంటల్ పచ్చలు (oriantal Emeralds) అని ప్లినీ పేర్కొన్నాడు. పైన పేర్కొన్న వివరాల ఆధారంగా భారతీయ బెరిల్ రోమ్ మరియు గ్రీస్‌లకు ఓరియంటల్ ఎమరాల్డ్ ఆక్వా మారిన్ మరియు బెరిల్‌గా ఎగుమతి చేయబడింది. దీనిని స్థానికంగా వైఢూర్యం, జలనీలం, నీలవైఢూర్యం అనేవారు. నిజమైన పచ్చ-ఎమరల్డ్ మొదట ఈజిప్ట్ నుండి అలెగ్జాండర్ దండయాత్ర సమయంలో తక్కువ పరిమాణంలో మొదటిసారి భారతదేశానికి వచ్చింది. ఇండో రోమన్ వాణిజ్యం సమయంలో ఇవి పెద్ద మొత్తంలో దేశంలోకి వచ్చాయి. మన దేశానికి పచ్చల దిగుమతులు ప్రధానంగా హాంకాంగ్, జాంబియా మరియు రష్యా తదితర దేశాల నుండి జరుగు తున్నాయి. అప్పట్లో పచ్చలు పోర్చుగీస్ వారి ద్వారా దిగుమతి అయ్యేవి అంటారు.

**మరకతం నిర్మితి:**

చాలా రత్నాలు ఎక్కువ కాఠిన్యం కలిగి ఉండి, వివిధ రంగులలో ఉంటాయి. కాఠిన్యం అణునిర్మాణంలో కాన్ఫిగరేషన్ వల్ల వస్తుంది. అణునిర్మాణంలో క్రోమియం, వెనెడియం, ఇనుము మొదలైన మూలకాల చేరిక, వాటి అమరిక కారణంగా వివిధ రంగులు ఏర్పడవచ్చు.

బెరిల్ కుటుంబానికి చెందిన ఖనిజ విషయానికొస్తే, రసాయని కంగా దీని ఫార్ములా Be2Al2 (SiO3)6. ఆక్సిజన్ పరమాణువులు టెట్రాహెడ్రల్ నిర్మాణంలో సిలికాన్ పరమాణు వులతో చుట్టుముట్టబడి ఉంటాయి. ఎటువంటి మలినాలులేని సాధారణ బెరిల్ ఏ రంగు లేకుండా ఉంటుంది. దీనినే ఘోషనైట్ అంటారు. అల్యూమినియంలోకి క్రోమియం రీప్లేస్‌మెంట్ యొక్క చేరిక ఉన్నప్పుడు (0.2pc). ఇది ముదురు ఆకు పచ్చని మరకతం (పచ్చ) అనబడుతుంది. ఆక్వామారిన్ (జలనీలం/ నీలవైఢూర్యం) కూడా ఇనుము లేశమాత్రంగా ఉన్న సముద్ర నీలంరంగులో ఉన్న బెరిల్.

లాటిస్ నిర్మాణంలో ఇనుము అల్యూమినియం స్థానంలో చేరినప్పుడు దీని రంగు లోతైన నీలంగా ఉంటుంది. లాటిస్ నిర్మాణంలో



ఇనుము (Fe3) స్థానం బట్టి Golden Beryl or Yellow Beryl (హీలియోడార్) అనే పేరుల తో వ్యవరించబడుతోంది. జాలక (lattice space) ప్రదేశంలో ఇనుము మరియు వెనాడియం యొక్క ఇంటర్‌స్టీషియల్ స్పేస్ లో కలయికతో బెరిల్ గడ్డి ఆకుపచ్చ (grass green) బెరిల్‌గా మారుతుంది. అణు నిర్మాణంలోని మూలకాల వైవిధ్యం కారణంగా ఈ బెరిల్, పచ్చ/మరకతం (Emerald), ఆకుపచ్చ బెరిల్ (Green Beryl), మోర్గానైట్, బిక్స్ బైట్ (Red Beryl) హెలియోడార్, ఘోషనైట్ మరియు ఆక్వామెరైన్ (జల నీలం/ నీల వైఢూర్యం)గా వ్యవరించబడుతోంది.

మొత్తం మీద పైన పేర్కొన్న ఖనిజాలు మరియు వాటి వైవిధ్యాలు సమిష్టిగా బెరిల్ కుటుంబం లోనివే. వైఢూర్యం అనే పేరు క్రమంగా బెరిల్‌గా మారింది. ఈ రత్నం స్ఫటికాలు పెద్దవిగా షట్కోణాకారంలో ఉంటాయి. మొహ్స్ స్కేల్‌పై బెరిల్ 7.5 నుండి 8 వరకు కఠినత్వం కలిగి ఉంటాయి. కానీ పెళుసుగా ఉంటాయి.



**మరకతం లభ్యత:** IBM నివేదిక ప్రకారం మనదేశంలో పచ్చల మొత్తం నిల్వ 55.87 టన్నులు. జార్ఖండ్‌లోనే ఈ నిలువలు ఉన్నాయి. ఇవి అంచనాల ఆధారంగా లెక్కింపు వేసినవి. వీటి గ్రేడ్లను ఇంకా వర్గీకరించలేదు. రాజస్థాన్ నుండి అజ్మీర్ రాజసమంద్ బెల్ట్‌లో పచ్చలు కనుగొన్నారు. ఇవి చాలావరకు అక్కడక్కడ, వివిధరకాలుగా ఉన్నాయి. ఒరిస్సాలో ఇవి బీరా–మోహరాజ్ పూర్బెల్ట్, బోలంగీర్ జిల్లానుండి కనుగొనబడ్డాయి. ఛత్తీస్‌గఢ్‌లో పచ్చలు డియోభోగ్, రాయ్‌పూర్ జిల్లాలో ఉన్నట్లు అంచనా. తమిళ నాడులోని కోయంబత్తూరు జిల్లాలో కూడా ఇవి (ఆక్వామెరిన్) ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ధృవీకరించని నివేదిక ప్రకారం తిరువూరు ప్రాంతంలో, ఖమ్మంజిల్లాలో, చిత్తూరుజిల్లాలో అక్కడక్కడ ఆక్వామెరిన్లు ఉన్నాయి.

కొలంబియన్ పచ్చలు నాణ్యమైనవిగా పరిగణించబడతాయి. పాకిస్తాన్ లోని స్వాత్ లోయలో దొరికే పచ్చలు మరియు ఆఫ్ఘనిస్తాన్ లోని పంచషీర్ పచ్చకి మంచి పేరు ఉంది. ఇథియోపియన్ పచ్చలు కూడా చాలా మంది ఇష్టపడుతారు. బ్రెజిల్, జింబాబ్వే, రష్యా మరియు మడగాస్కర్‌ల నుండి కూడా మంచి పరిమాణంలో పచ్చలను ఉత్పత్తి జరుగుతూంది. తక్కువ పరిమాణంలో భారతదేశంతో సహా అనేక దేశాలు ఉత్పత్తి చేస్తున్నాయి.

నీలం ఆకుపచ్చ కలర్‌లో ఉండి పూర్తి పారదర్శకంగా ఉండే నిర్మలమైన పచ్చలు వజ్రాల కన్న విలువైనవి. మార్కెట్లో ఎక్కువగా జాంబియన్ పచ్చలు కనిపిస్తాయి. అంతగా నాణ్యత లేని పచ్చలు ఇప్పుడు ఎక్కువ మార్కెట్‌లో కనిపిస్తున్నాయి దీనికి తోడు కృత్రిమ పచ్చలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. పచ్చలు సాధారణంగా ఎక్కువగా మలినాలు కలిగి ఉంటాయి, వీటిని 'ఫారెస్ట్ పచ్చలు (forest emeralds)'గా విక్రయిస్తారు. నూనె చికిత్స ఈ రత్నాలకు చాలా సాధారణం. ఆయిల్ ఫ్రీ పచ్చలు ఎక్కువ ధర పలుకుతాయి.

**చరిత్రలో మరకతం:** హజ్రత్ అమీర్ ఖుస్రో అల్లావుద్దీన్ ఖిల్జీ యొక్క సేనాని మల్లిక్ నాయబ్‌తో ఉండి దక్కన్ దండయాత్ర (1310–1312 క్రీ.శ.)లో వశపరుచుకున్న అపార సంపద గురించి ఇలా వివరించాడు. 'ఏనుగులు మోసుకెళ్లే పెట్టెల నిండా విలువైన రత్నాలు ఉన్నాయి, ఆ రత్నాల శ్రేష్ఠత చూపరులను పిచ్చెక్కించింది. సూర్యకాంతిలో మెరుస్తున్న పచ్చల కాంతి, సూర్యుడే పచ్చల కాంతిని ప్రతిబింబిస్తున్నాడేమో అనిపించింది. నిర్మలమైన నీటివంటి స్వచ్ఛతతో, పచ్చలు స్వర్గం యొక్క పచ్చిక బయళ్లను మసక బారేటట్లు చేయగల సొగసును కలిగి ఉన్నాయి.'

నెమలి సింహాసనం 30 నుండి 60 క్యారెట్ల 110 పచ్చలతో పొదిగి ఉండేది. 108కెంపులు, నీలాలు మరెన్నో వజ్రాలు ఇతర రత్నాలతో అలంకరించబడి ఉండేదని టావెర్నియర్ పేర్కొన్నాడు. మొఘల్ ఖజానాలో అత్యుత్తమమైన అతిపెద్ద పచ్చలు ఉండేవి.

భద్రాచలం దేవస్థానంలో కూడా పదివేల వరహాలు ఖర్చుతో కంచర్ల గోపన్న చేయించిన పచ్చల పతకం ఉంది. నల్లగొండ శివారులలో ఉన్న పానగల్‌లోని శివాలయం పేరు 'పచ్చల సోమేశ్వరాలయం'. భువనగిరిలో కూడా పచ్చలసోమేశ్వరాలయం ఉన్నది.

**ఆయుర్వేదంలో మరకతం:**

మరకతాన్ని ఆయుర్వేదంలో సకలరోగ నివారిణిగా వాడుతారు. మరకతాన్ని నేలవంకాయరసంలో ఒకరోజు, కొండ పిండివేళ్ళ రసంలో ఒకరోజు నానబెట్టి, ఆరబెట్టి, పూతవేసి పుటంవేస్తే మరకతభస్మం అవుతుంది. ఇది ఆయుర్వేద వైద్యంలో వాడబడుతుంది.

–చకిలం వేణుగోపాలరావు,
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com
– శ్రీరామోజు హరగోపాల్, m : 99494 98698
e: akshara25@gmail.com


# చరిత్రకు సజీవ సాక్ష్యాలు.. వారసత్వ ప్రదేశాలు!

## ఏప్రిల్ 18న 'ప్రపంచ వారసత్వ దినోత్సవం'

మన చుట్టూ ఉన్న చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 18న 'ప్రపంచ వారసత్వ దినోత్సవం' World Heritage Day గా పాటిస్తున్నారు.

భారతదేశం అపారమైన చారిత్రక వైభవాన్ని, ఘనమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని కలిగివుంది. ఈ దేశం ఎన్నో అద్భుతమైన కట్టడాలు, అపురూపమైన కళాఖండాలకు నిలయంగా ఉంది. ఇది నిజంగా మానవసృష్టేనా అనిపించేలా.. ఊహకందని రీతిలో పురాతన కాలంలోనే నిర్మించిన ఎన్నో ఆశ్చర్య కరమైన స్మారక చిహ్నాలు నేటికి జీవకళ ఉట్టిపడేలా దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ మనకు వారసత్వంగా లభించిన సంపదలు. వీటిని పరిరక్షించు కోవడం మనందరి బాధ్యత.

ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం. అంతర్జాతీయ స్మారక చిహ్నాలు, ప్రదేశాల దినోత్సవం అని కూడా పిలుస్తారు. తమ దేశానికి చెందిన వెలకట్టలేని వారసత్వ సంపద పరిరక్షణకోసం కట్టుబడి ఉండటంతో పాటు యునెస్కోలో భాగమైన ప్రపంచంలోని సభ్యదేశాలు ఒకరికొకరు వివిధ అంశాలలో పరస్పరం సహకరించు కోవాలన్న ప్రధానలక్ష్యంతో ప్రతి ఏటా ఏప్రిల్ 18న 'ప్రపంచ వారసత్వ దినోత్సవం (World Heritage Day) పాటిస్తున్నారు. మన సాంస్కృతిక వైవిధ్యాన్ని మనమే కాపాడుకోవాలని ఈ రోజు గుర్తుచేస్తుంది.



భారతదేశంలోనిప్పటికే 42 UNESCO గుర్తించిన చారిత్రక కట్టడాలు ఉన్నాయి, అబ్బు రపరిచే కళారూపాలు ఉన్నాయి. అయితే దేశవ్యాప్తంగా కేవలం 40 చారిత్రక కట్టడాలు, ప్రదేశాలు మాత్రమే ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా యునెస్కో (UNESCO- United Nations Educational, Scientific and Cultural Organization) గుర్తింపు పొందాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రసిద్ధ రామప్ప దేవాలయం కూడా చోటు దక్కించుకోవడం విశేషం.

అలాగే హైదరాబాద్‌లోని గోల్కొండ-కుతుబ్ షాహీ టూంబ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి లేపాక్షి కూడా యునెస్కో Tentatime listలో ఉన్నాయి. వీటికి అధికారిక గుర్తింపు లభించాల్సి ఉంది.

**భారత్‌లోని 5 గొప్ప కట్టడాలు- వారసత్వ ప్రదేశాలు**

దేశంలో ఎన్నో గొప్ప చారిత్రక కట్టడాలు, వారసత్వ ప్రదేశాలు ఉన్నాయి, వాటిలో కొన్ని..

**రామప్ప దేవాలయం:** వరంగల్ నగరానికి సుమారు 66 కిలోమీటర్ల దూరంలో పాలంపేట అనే ఊరిలో రుద్రేశ్వర దేవాలయం ఉంది. దీనినే రామప్ప దేవాలయం అని కూడా పిలుస్తారు. కాకతీయ రాజవంశ పాలకుడైన గణపతిదేవుని కాలంలో 1213 సంవత్సరంలో రేచర్ల రుద్రారెడ్డి ఈ ఆలయ సముదాయాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. ఎలాంటి పునాదులు లేకుండానే పూర్తిగా ఇసుక రాయిని ఉపయోగించి చేపట్టిన ఈ ఆలయ నిర్మాణం ఆనాటి ఇంజనీరింగ్ అద్భుతాలకు నిదర్శనం. కాలానికి అతీతంగా ఈ ఆలయం నేటికి చెక్కుచెదర కుండా సజీవకళతో ఉండటం నిజంగా ఓ ఆశ్చర్యం.

**అజంతా గుహలు:** మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఉన్న అజంతా గుహలు అద్భుతమైమ బౌద్ధ మత కళాఖండాలతో గొప్ప గుర్తింపును పొందాయి. 2వ శతాబ్దం BCE నుంచి 480 CE వరకు పురాతన కాలాలకు చెందిన 30 రాక్-కట్ బౌద్ధ గుహ స్మారక చిహ్నాలు ఇక్కడ ఉన్నాయి.

**తాజ్ మహల్:** ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో యమునా నదీ తీరాన వెలిసిన తాజ్ మహల్ ఓ అద్భుతమైన కట్టడం. ప్రేమకు చిహ్నంగా ఈ కట్టడం ప్రాచుర్యం పొందింది. మొఘల్ చక్రవర్తి షాజహాన్ మరణించిన తన మూడవ భార్య బేగం ముంతాజ్ మహల్ స్మారకార్థం దీనిని నిర్మించాడు. ప్రపంచం లోని ఏడు వింతలలో ఒకటిగా కూడా గుర్తింపు పొందిన ఈ కట్టడం 1983లో UNESCO గుర్తింపు కూడా పొందింది.

**కోణార్క్ సూర్య దేవాలయం:** ఒడిషా రాష్ట్రంలోని కోణార్క్ సూర్య దేవాలయం 13వ శతాబ్దానికి చెందినదిగా చెప్తారు. 24 రథ చక్రాల మీద, సప్త అశ్వాలతో సూర్య భగవానుడు కదిలివస్తున్నట్లుగా ప్రతీకాత్మక రాతి శిల్పాలతో అందగా అలంకరించి నిర్మిం చారు. బంగాళాఖాతం తూర్పు తీరంలో మహానది డెల్టాలో వెలిసిన ఈ క్షేత్రం విశేషంగా ఆకట్టు కుంటుంది.

**హంపి:** తూర్పు-మధ్య కర్ణాటకలో ఉన్న హంపి క్షేత్రం ప్రకృతి ఒడిలో రాతి కట్టడాలతో కను విందు చేసే ఒక అపూరూప దృశ్యం. 14వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యపు రాజధానిగా విలసిల్లిన హంపి ఆనాటి అద్భుత కట్టడాలకు సజీవ సాక్ష్యంగా ఉంది. తుంగభద్ర నదీ తీరాన అనేక దేవాలయాలు, పచ్చని పొలాలతో హంపి నగరం నాటి వైభవాన్ని కళ్లముందు ప్రత్యక్షం చేస్తుంది.

- సత్యప్రసన్న
m : 9793 05 9793
e: desk.deccan@gmail.com

# అంబేద్కర్ అడుగుజాడల్లో...

## ఏప్రిల్ 14న డా॥ భీమ్‌రావ్ రామ్‌జీ (బిఆర్) అంబేద్కర్ జయంతి

డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్.. భారత రాజ్యాంగ నిర్మాత. సామాజికంగా దేశ పురోగతికి మార్గదర్శనం చేసిన మహనీయుడు. ఇప్పటికీ ఆయన రచించిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి. ఆయన సూచించిన మార్గాలే పాలకులకు మార్గదర్శకాలు. ఆయన ఆలోచనల నుంచి జాలువారిన నిర్ణయాలు, ప్రతిపాదనలు సమాజ ప్రగతికి సోపానాలుగా నిలిచాయి. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఆయన గొప్పదనాన్ని నెమరేసుకుందాం. ఆయన ఆశయాలను విశ్లేషించుకుందాం.



భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న 'మౌ' (ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో ఉన్న) పట్టణంలో, సైనిక కంటోన్మెంట్‌లో జన్మించారు. అంబేద్కర్ భారతీయ న్యాయ నిపుణుడు, ఆర్థికవేత్త, సంఘ సంస్కర్త, రాజకీయ నాయకుడు, రాజ్యాంగ సభ చర్చల నుండి భారత రాజ్యాంగాన్ని రూపొందించే కమిటీకి నాయకత్వం వహించారు. మొదటి మంత్రి వర్గంలో న్యాయ మరియు న్యాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 1956లో వీరు బౌద్ధమతంలోకి మారారు. హిందూ మతాన్ని త్యజించిన తర్వాత దళిత బౌద్ధ ఉద్యమాన్ని ప్రేరేపించారు.

బాంబే విశ్వవిద్యాలయంలోని ఎల్ఫిన్‌స్టోన్ కళాశాల నుండి పట్టభద్రుడయ్యాక, అంబేద్కర్ కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించారు, వరుసగా 1927, 1923లో డాక్టరేట్‌లు అందుకున్నారు. అంబేద్కర్ లండన్‌లోని గ్రేస్ ఇన్‌లో న్యాయశాస్త్రంలో శిక్షణ కూడా పొందాడు. వీరు జీవిత ప్రారంభంలో ఆర్థికవేత్త, ప్రొఫెసర్, న్యాయవాదిగా పనిచేశారు. వీరు రాజకీయ కార్యకలాపాల ద్వారా గుర్తించబడ్డారు. 1990లో అంబేద్కర్‌కు మరణానంతరం భారతదేశ ప్రభుత్వ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రదానం చేయబడింది.

సాధారణంగా అంబేద్కర్ అంటే కేవలం దళితులకే దేవుడని, అణగారిన వర్గాలకు మాత్రమే నాయకుడని సమాజంలో ఓ ముద్ర వేశారు. కానీ, అన్ని వర్గాలకూ అంబేద్కర్ నాయకుడు. నైపుణ్యం, తెలివి, చురుకుదనం, కష్టపడే తత్వం ఉన్న అన్ని వర్గాల్లోని, అన్ని కులాల్లోని, అన్ని మతాల్లోని వారు వృద్ధి చెందేందుకు అవసరమైన బాటలు వేశారు డాక్టర్ అంబేద్కర్.

సామాజిక అసమానతలు, అంటరానితనం అత్యంత భయంకరంగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న కాలంలో బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మించారు. ఆ కాలంలో సామాజిక దురాచారాలను, దుర్మార్గాలను స్వయంగా అనుభవించారు. చదువుకునేందుకు అర్హుడు కాని కుటుంబంలో జన్మించాడన్న అవహేళనలు భరించారు. మెహర్ కులానికి చెందిన అంబేద్కర్‌ను అప్పట్లో తరగతి గది బయటే కూర్చోబెట్టేవారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఆయన అప్పటి నుంచే హేళనలు, అవమానాలపై తిరగబడ్డారు. ఈ తరహా వివక్ష లన్నింటినీ ఎదుర్కొంటూ మెట్రిక్యులేషన్ అత్యధిక మార్కులతో పాసయ్యారు. ప్రతీ విషయాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. తన అనుభవాలనే నిచ్చెనలుగా వేసుకొని, తన ఆలోచనలనే అవకాశాలుగా మలచుకొని ఉన్నత స్థితికి ఎదిగారు. ఎవరూ ఊహించని స్థాయికి చేరుకున్నారు. 'ప్రజాస్వామ్యంలో సమానత్వం' అనే కలను నెరవేర్చారు.



చిన్నప్పుడు తనను చిన్నచూపు చూసిన వాళ్లపట్ల ఆయన ద్వేషం పెంచుకోలేదు. తనపట్ల విద్వేషం చూపించిన వాళ్లకు వ్యతిరేకంగా వ్యవహరించలేదు. తన సామాజిక వర్గాన్ని హేళన చేసిన వాళ్ల గురించి ప్రతికూలంగా అస్సలు ఆలోచించలేదు. అందుకే అంబేద్కర్‌ను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే ఆయన రాసిన రచనలు చదవాలి. ఆయన జీవితాన్ని అవగతం చేసుకోవాలి. ఆయన స్వయంగా రాసిన రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి. అప్పుడే అంబేద్కర్ అసలు ఆలోచన ఏంటో, ఆయన స్వప్నం ఏంటో అర్థమవుతుంది.



డాక్టర్ అంబేద్కర్ భారత దేశపు మూలస్తంభపు పునాది ఏంటో తన అధ్యయనం ద్వారా కనిపెట్టారు. ఆ అధ్యయనంలో తన జీవితాన్ని కూడా అంకితం చేశారు. అంబేద్కర్.. తన ఆశయం కోసం, భారతదేశ భవిష్యత్తు కోసం ఎంతగానో శ్రమించారు. బాంబే యూనివర్సిటీలో బీఏ చదివిన అంబేద్కర్.. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లారు. కొలంబియా యూనివర్సిటీలో ఎంఎ పూర్తి చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో ఎమ్మెస్సీ కంప్లీట్ చేశారు. ఆ తర్వాత మళ్లీ కొలంబియా విశ్వవిద్యాలయంలోనే పీహెచ్‌డీ పూర్తిచేశారు. అయినా, అంబేద్కర్ చదువును అంతటితో ఆపలేదు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డీఎస్సీ చదివారు. అంబేద్కర్ విజ్ఞానాన్ని గుర్తించిన కొలంబియా యూనివర్సిటీ ఎల్ఎల్‌డి గౌరవ పట్టా ప్రదానం చేసింది. అలాగే, ఉస్మానియా యూనివర్సిటీ కూడా డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవ పట్టా అందజేసింది. గ్రేస్ ఇన్ లండన్ యూనివర్సిటీలో బారిష్టర్ ఎట్ లా చదివారు భీంరావ్. విదేశాల్లో ఎకనమిక్స్‌లో డాక్టరేట్ పొందిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ అన్ని రంగాలకు వర్తించే ఒక తాత్విక శక్తిగా ప్రజాస్వామ్యాన్ని మలచుకున్నారు. విద్యాభ్యాసం తర్వాత ఆర్థికవేత్తగా, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకునిగా, న్యాయవాదిగా విభిన్న పాత్రలు పోషించారు. ఆ తర్వాత జాతీయోద్యమంలోకి ఎంటరయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత సమానత్వం, సమన్యాయం లక్ష్యాల కోసం పరితపించారు. రాజ్యాంగ రచనా కమిటీకి నేతృత్వం వహించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగంగా (Constituion Of India) పేరొందిన భారత రాజ్యాంగం తయారీలో ఆయన కీలక పాత్ర పోషించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెలకొల్పడంలోనూ డాక్టర్ అంబేద్కర్ పాత్ర ఉంది. చివరి రోజుల్లో అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారు. బుద్ధుని బోధనలకు ఆకర్షితులై బౌద్ధుడయ్యారు. కుల, మత, జాతి రహిత ఆధునిక భారతావనికి కోసం అంబేద్కర్ ఎనలేని కృషి చేశారు. దేశపౌరులందరూ ఆయన జీవిత చరిత్రను చదవాల్సిన అవసరం ఉంది. ఆయన రచనలను అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఫలితంగా భారతదేశ ప్రగతిలో మనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు మార్గం లభిస్తుంది.


ప్రత్యేక తెలంగాణలో గత ప్రభుత్వం కొత్త సెక్రటేరియట్‌కి అంబేద్కర్ పేరు పెట్టారు. అలాగే గత ప్రభుత్వం సెక్రటేరియట్ పక్కనే ట్యాంక్‌బండ్ వద్ద హైదరాబాద్‌లో 125 అడుగల విగ్రహ స్థాపనకు 2016లో శంఖుస్థాపన చేసి, 132వ జయంతి సందర్భంగా 2023 ఏప్రిల్ 14న అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ప్రతిస్థాపన చేశారు. ఇక్కడ అంబేద్కర్ మ్యూజియం ఉంది.

– ఎసికె. శ్రీహరి,
m : 9849930145
e : ackvs08@gmail.com

# "మృత్యువుతో ముఖాముఖం"

(గత సంచిక తరువాయి)

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావుగారి అంత్యక్రియలు పంజాగుట్ట స్మశానంలో జరిగాయి. ఆ వీరుడి అంతిమ యాత్రలో అశేష విషాద జన సముద్రాలు అలలు అలలుగా కదిలి స్మశానం దాకా విస్తరించాయి. చితి మంటలు చెలరేగుతున్నపుడు పడమటి ఆకాశంలో సింధూరవర్ణంలో కుంగుతున్న సూర్యుడు కాస్తా వంగి ఆ వీరుడి నుదుటిని ముద్దాడుతున్నట్లు నాకు భ్రమ కలిగింది. మావోయిస్టు నాయకుడు "ఆజాద్" ఎలియాస్ చెరుకూరి రాజ్‌కుమార్ ఎన్‌కౌంటర్ అయ్యాక ఆయన అంత్యక్రియలు కూడా అదే స్మశానంలో జరుగుతుంటే ఆ రుద్రభూమిలో నేనూ, ఆర్టిస్టు మోహనూ నిలబడి మధ్య ఆసియా చరిత్రను, మోహిత్‌సేన్ స్వీయ చరిత్ర "A travelor and the Road" గురించి హాయిగా గంటసేపు మాట్లాడుకున్నాం. ఆ వీరుడి మరణం మాకు విషాదాన్ని కలిగించలేదు. ఎందుకంటే రావిశాస్త్రి భాషలో వీరులు ఎక్కువ కాలం జీవించరు. పోరాటాలలో త్వరగానే మరణిస్తారు. ఏ వీరుడైనా ఎక్కువ కాలం జీవించాడంటే వాడు దొంగ వీరుడైనా అయ్యిండాలి లేదా అవకాశావాద వీరుడైనా అయ్యిండాలి. ఒకప్పటి వీరులు ప్రస్తుతం తెలంగాణ వచ్చినంక అవకాశావాదంతో ఎట్లా రంగులు మారుస్తున్నారో ఎట్లా పిల్లి మొగ్గలు వేస్తున్నారో మనం చూస్తూనే ఉన్నాం కదా!



చలం తన చావు గురించి చాలా చిత్రమైన అభిప్రాయం చెప్పాడు. ***"నేను చనిపోయాక నా శవం ముందు నిలబడి ఎవరూ ఏడవద్దు. ఎవరైనా ఏడ్చారో జాగ్రత్త పాడెమీద నుండి లేచి చితక తంతాను"*** అన్నాడు.

అమితాబచన్ తండ్రి హరివంశ్ రాయ్ బచన్ "మధుశాల" కావ్యకర్త తన స్వీయచరిత్రలో ఇలా అన్నాడు. ***"నేను ప్రతిరోజు రాత్రి పన్నెండు గంటలకు పడుకుని మళ్లీ ఉదయం మూడు గంటలకే నిద్రలేచి త్రివేణీ సంగమంలో స్నానానికి వెళ్తాను. నేను మధ్యాహ్నం కూడా నిద్ర పోను ఎందుకంటె ఆరాం హారాం హై. నేను చనిపోగానే త్వరగా దహనం చేయకండి. నా శవాన్ని రెండు మూడు రోజులు అట్లే పెట్టండి. నేను కంటి నిండా నిద్రపోవాలి".***

"చావు కూడా పెళ్లిలాంటిదే" అన్న సామెత తెలంగాణాలో ఇప్పటికీ సార్థకంగానే ఉన్నది. దళితులు, బహుజన సముదాయాల అంత్యక్రియలు దీనికి నిదర్శనం. మేళతాళాలతో మనిషిని సగౌరవంగా సాగనంపుతారు. అది కూడా పెళ్లిలాంటి హడావుడే. నిరక్షరాసులైన గ్రామీణ తల్లుల అక్కల చెల్లెళ్ల శోకం సుదీర్ఘంగా పోయిన వారి గురించి వైన వైనాలుగా వర్ణిస్తూ, జ్ఞాపకం చేసుకుంటూ బహు కవితాత్మక శోకంగా ఉంటుంది. అది మామూలు శోకంగా కాక రసాత్మక శ్లోకంగా మారుతుంది.

పంజాబీలకు మరణం చాలా తేలికైన విషయం. దేశభక్తులు, వీరులు చనిపోతే ఎవరూ కంటతడి పెట్టరు. అదొక అపచారంగా భావిస్తారు. వారి ఆత్మలను అగౌరవ పరిచినట్లు బాధపడతారు. ***"దేశ్ కెలియె ఇస్ రాహ్‌మె మర్నా సౌ జన్మోంకా సమాన్ హై"*** అని గర్వపడతారు.

మిలీనియంకు ఒకటిరెండు రోజుల ముందు ఎర్రం రెడ్డి సంతోష్‌రెడ్డి, నల్లా ఆదిరెడ్డి, నరేష్‌ల ఎన్‌కౌంటర్ జరిగింది. నేను కడివెండికి వెళ్లి సంతోష్‌రెడ్డి అంత్యక్రియలలో పాల్గొన్నాను. దొడ్డికొమరయ్య అమరుడైన నేల అది. త్యాగాల పరంపర, వారసత్వం అక్కడ ఆ నేలమీద నేటికీ కొనసాగుతూనే ఉంది. దేశం నలుమూలల్నుండి వచ్చిన వేలాది మంది జనం "జైబోలో జైబోలో సంతోషన్నకు జైబోలో" అంటూ ఆ వీరుడిని పాటల పల్లకీలో ఊరేగిస్తూ ఆకాశం అవతలివైపుకు సాగనంపారు. ఆ దృశ్యాలని చూస్తుంటే నాకు **"కె మర్ కె భీ కిసీ కో యాద్ ఆయింగే – జీనా ఇసీ కా నామ్ హై"** పాట జ్ఞాపకం వచ్చింది.

"మరణానంతర జీవితం" అని ఒక మాట ఉంది. అంటే లైఫ్ ఆఫ్టర్ డెత్ అన్న మాట. బాడీ డొనేషన్ ఈ కోవకే చెందుతుంది. కాళోజీ సోదరులు, కొండపల్లి కోటేశ్వరమ్మగారు ఇంకా అనేక మంది తమ శరీరాలను మెడికల్ కాలేజీలకు దానంగా ఇచ్చారు. ఎంత గొప్ప ఉదాత్త భావన. చనిపోయినా సమాజానికి ఉపయోగపడటం అంటే ఇదే కదా!

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ అమెరికాలో చికిత్స పొందుతున్న సినీనటి సోనాలిబింద్రే ఒక మాట అన్నది. **"నాకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. అందుకే క్యాన్సర్‌తో పోరాడుతున్నా. అయినా జీవితం అంటే ఏమిటి? చివరి క్షణం వరకూ నేర్చుకోవటమే కదా?"** ఈ మాటలు నాకు అబ్బురమనిపించి జయలలిత జ్ఞాపకం వచ్చింది. ఆమె చెన్నై అపోలో ఆసుపత్రిలో అంపశయ్యపై పడుకుని ఉన్నా జ్ఞానతృష్ణతో 'ది ప్రైవేట్ లైఫ్ ఆఫ్ మావో' పుస్తకాన్ని ఒక

డాక్టర్‌తో ప్రతిరోజు చదివించుకుని వినేదట. ఆ వార్త చదివిన నేను ఆమె తప్పులన్నీ ఆ క్షణంలో క్షమించివేశాను. ఈ సందర్భంలో నాకు మళ్లీ సోక్రటీసు, భగత్‌సింగు జ్ఞాపకం వస్తున్నారు. తెల్లారితే సోక్రటీసుకు గరళపానంతో మరణశిక్ష. ఆయనకు వీధిలో ఏక్‌తారా సంగీతం వినబడి ఆ కళాకారుణ్ణి తనున్న గదికి రప్పించి ఎంతో ఇష్టంగా ఆ వాయిద్యాన్ని నేర్చుకున్నాడట. దానికి ఆయన శిష్యులు ఆశ్చర్యపడుతుంటే **"జీవితమంటే చివరి క్షణం వరకు నేర్చుకోవటమే కదా"** అన్నాడు.

భగత్‌సింగ్ కూడా అంతే తెల్లారితే ఉరికంబానికి ఉయ్యాలలూగవలసిన వాడు ఆ రాత్రంతా లెనిన్ పుస్తకాన్ని చదువుతూ కూచున్నాడట. నిజమైన చదువు, జ్ఞానతృష్ణ అంటే అది. ఇంటి ముందు గోడపైన ఎం.ఎ. పి.హెచ్‌డి బోర్డులు తగిలించుకుని మురిసిపోవటం కాదు. జాక్ లండన్ ఒక మాట అంటాడు. **"జీవితం అంటే బ్రతుకును ఈడుస్తూ బ్రతకటం కాదు. జీవితాన్ని సంపూర్ణంగా చివరి క్షణం వరకూ జీవించటం"** (Life is to Live not to exists).

ఇదంతా సరేగాని "బొందల గడ్డ" గురించి మరికొంత సేపు మజేదార్ ముచ్చట్లు మాట్లాడుకుందాం. ఎక్కడికి వెళ్లినా ఏ దేశమేగినా సమాధులను సందర్శించటం నాకిష్టమైన వ్యాపకం. ఆ మాటకొస్తే కుష్వత్ సింగ్ కూడా అంతే. తీరిక దొరికినపుడల్లా ఢిల్లీ యమునా తీరంలోని "నిగం భోద్ ఘాట్"కు వెళ్లి గంటల తరబడి కూచునేవాడు. **"నేనొక సాయంకాలం ఒకానొక స్మశానానికి వెళ్లాను. ఆ వాతావరణం చాలా ప్రశాంతంగా, అందంగా అనిపించి, అక్కడే ఆగిపోవాలని, ఆ రాత్రి ఆ నీరవ నిశ్శబ్ద నిశిరాత్రి వేళ రాయి-రాయీ కరిగే గాంధారి వేళలో ఎవరైనా ఒక స్త్రీతో అక్కడ ఆ రుద్రభూమిలో రమించాలని నాకు వింత కోరిక లిప్తకాలంపాటు జనించింది."** మర్యాదస్తులకు ఈ మాట రుచించదు గాన ఇంతటితో ఈ ప్రస్తావన ముగిస్తాను.

న్యూజిలాండుకు వెళ్లినప్పుడు నేనూ, నా శ్రీమతి అక్కడి సమాధులను సందర్శించి ఆ పవిత్రతకు, ప్రశాంత వాతావరణానికి పులకించి కడుంగడు సంతసించాం. రెండు, మూడు వందల ఏళ్ల క్రితం సమాధులు, శుభ్రంగా, అందంగా చెక్కుచెదరకుండా, కావ్యాత్మకమైన స్మృతి గీతాలతో, వాక్యాలతో పురాతన వైభవాలతో చాలా అందంగా ఉన్నాయి. మా ఆనందం పరవళ్లుపొంగి **"అర్జెంటుగా చనిపోయి ఇక్కడే సమాధులు కట్టించుకుంటే ఎంత బాగుంటుందో"** అని కాసేపు కలలు కన్నాం.

ఆస్ట్రేలియా సిడ్నీ పట్టణం పారామెట్టా ప్రాంతంలో ఒక సిమెట్రీని సందర్శించాను. మూడువందల ఏళ్ల నాటి సమాధులను, ఎపిటాఫ్‌ల సమాచారంతో సహా వీరు భద్రంగా రక్షించు కుంటున్నారు. **చైనాలోని కాష్గర్‌లో 12వ శతాబ్దం కాలం నాటి ఇద్దరు ముస్లిం కవుల సమాధులు భద్రంగా, కళాత్మకంగా ఉండటం చూసాను.** మనదేశంలో సమాధులను కళాత్మకంగా నిర్మించుకునే సంస్కృతి ముస్లిం పరిపాలకులతో ప్రారంభ మయ్యింది. మరి మనం మన పోతన, శ్రీనాధుడు, వేమన సమాధుల్ని ఎందుకు కాపాడుకోలేక పోయాం? అది మన సాంస్కృతిక దారిద్ర్యం కాదా? చైనాలోని బీజింగ్ తియాన్మెన్ స్క్వేర్‌లో చైర్మన్ మావో ముసోలియం అందులో ఆయన పార్థివదేహాన్ని సందర్శించాను. మరి మనం ఆ గౌరవాన్ని గాంధీ, నెహ్రూలకు ఎందుకు కల్పించలేకపోయాం? వెనీస్‌కు వెళ్లినప్పుడు మార్కోపోలో సమాధి కోసం వెదికాను కాని సమయం చాలక ఆ ప్రయత్నం ఫలించలేదు. **డార్జిలింగుకు వెళ్లినపుడు అక్కడి ముర్దాహట్టీ స్మశాన వాటికలో పండిత్ రాహుల్ సాంకృత్యాయన్ సమాధిని సందర్శించి నా నివాళి అర్పించాను. ఆయన రచనల వలనే నేను లోక సంచారిగా మారాను.**

లక్నోలో రెసిడెన్సీ బంగళా లోపల వున్న ఇంగ్లీషువారి సమాధులు నాకు చాలా నచ్చాయి. విశాలమైన ఆకుపచ్చని పచ్చిక మైదానాల మధ్య ఎర్రరాతి ఇటుకలతో 1857 తిరుగుబాటు కాలంలో మరణించిన ఆంగ్లేయుల సమాధులవి. రెండు మూడు సంవత్సరాల బాలబాలికల సమాధులు కూడా ఉన్నాయి. ప్రతి సమాధిపై ఒక "ఎపిటాఫ్" చాలా కళాత్మకంగా ఉంది. అక్కడి పరిశుభ్రత మళ్లీ నాకు ఎక్కడా కానరాలేదు. **ఆ సమాధులన్నీ కాలం చెక్కిలి మీద ఘనీభవించిన కన్నీటి చుక్కలే!**

మనం జీవితమంతా శుచి, శుభ్రతా, మడి, ఆచారం, అంటూ సొంటూ అని మహా పవిత్రంగా కడిగిన ముత్యాల్లా బ్రతుకుతాం కాని చివరి మజిలీ చేరుకునే సరికి అక్కడ ఆ "పితృవనం"లో (స్మశానానికి మరో పేరు) పందులు పశువులు దొర్లుతుంటాయి. మనుషుల మలమూత్ర వాసనలు. మురికి నీళ్ల కాలువలే మరణించిన మనుషులకు వీడ్కోలు పలికేది, ఆఖరి అల్విదాలు చెప్పేది ఆ అసహ్య వాతావరణంలోనే! ఇక్కడ మనుషులకు బ్రతికున్నప్పుడే ఏ విలువా, గౌరవం లేదు. ఇక మరణించిన తర్వాత కూడానా? పట్టుబట్టల పీతాంబరాలు ధరించే హిందూమత పండితులు, పీఠాధిపతులు హిందూ స్మశానాలు ఇంత ఘోరంగా, అధ్వాన్నంగా ఎందుకు ఉన్నాయో ఆలోచించరా? తల్లావజుల పతంజలి శాస్త్రి ఈ అంశంపై "వైతరిణికీవల" అను మంచి కథ రాశారు.

పన్నెండవ శతాబ్దపు ప్రముఖ పర్షియన్ కవి ఖాజా హాఫీజ్ షిరాజ్. ఆయన ఇరాన్‌లోని షిరాజ్ అన్న పట్టణంలో జన్మించాడు. అందుకే తన పేరు చివర షిరాజ్ అన్న పేరు పెట్టుకున్నాడు. అరబ్బీ, పారసీ, ఉర్దూ కవులందరూ తమ "తఖల్లూస్" (కలం పేరు)లో తమ జన్మభూమిని పేర్కొనే సత్సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఉదాహరణకు హస్రత్ జైపురీ, సాహిర్ లుథియాన్వీ, ఫిరాక్ గోరఖ్‌పూరీ, షకీల్ బదాయూనీ, జోష్ మలిహాబాదీ, కైఫీ ఆజ్మీ వగైరా. ఈ సంప్రదాయం మన హిందీ తెలుగు కవులకు లేదు. జననీ జన్మభూమి అని పొడుగు పొడుగు పాటలు మాత్రం దీర్ఘాలు తీస్తూ పాడుతారు. హాఫీజ్ షిరాజ్ సమాధిపై శిలాఫలకంలో ఇలా రాసి ఉంది.

*"ధూళి నుండి జన్మించాను.*
*చివరికి ధూళిలో ధూళిగా మారాను".*

మట్టి నుండి పుట్టిన మనం చివరాఖరికి మట్టిలోకి చేరుకుంటాం అన్నది మన తెలుగుమాట. నేలతల్లి ఒడిలో వాలి పెను విశ్రాంతిలోకి వెళ్లిపోవటమే ద్రవిడ సంప్రదాయం. ఇది హరప్పా, సింధూ నాగరికతల నుండి కొనసాగుతుంది. రాకాసి గుండ్లు (కైరన్లు) దీనికి మంచి ఉదాహరణ. ద్రవిడ సంప్రదాయమే కాదు శైవ మతం కూడా "ఖననం" పద్ధతినే పాటిస్తుంది. దళిత బహుజనులందరూ ద్రవిడులే కావున నేల తల్లి ఒడిలోకి చేరుకోవటమే వారికి ఇష్టం. దీనికి భిన్నంగా "దహనం" పద్ధతిని మధ్యాసియా నుండి వచ్చిన విదేశీయులు, దండయాత్రికులైన ఆర్యులు ప్రవేశపెట్టారు. "అగ్నిదేవుడు" వారికి ఆరాధ్యుడు కావున దహనం సంప్రదాయం చాలా ఆలస్యంగా ప్రవేశపెట్ట బడింది. హిందూమతం, బ్రాహ్మణిజంలోని కర్మకాండలకు ఇది దగ్గరగా ఉంటుంది.

బౌద్ధంలో హీనయానం శాఖ ఒకటుంది. మరణానంతరం కూడా ఈ లోకానికి ఉపయోగపడాలనే సదుద్దేశ్యం వీరిది. టిబెట్, మంగోలియా, గోబీ ఎడారులలో నివసించే ఈ శాఖవారు మృతదేహాలను ఒక ఎత్తైన స్థలంలోకి తీసుకెళ్లి కత్తులు, గొడ్డళ్లతో శవాలను ఖండఖండాలుగా నరికి రాబందులకు వేస్తారు. పార్సీలు మాత్రం ఒక గుట్ట మీద ఒక బావి తవ్వి దానిపై ఒక ఇనుప జల్లెడలాంటిది అమర్చి శవాలను దానిపై పడుకోబెడతారు. కాకులు, రాబందులకు ఆ శవం ఆహారంగా మారుతుంది. మిగిలిన ఎముకలన్నీ ఆ ఇనుప జల్లెడపై నుండి బావిలోకి జారిపోతాయి. ఇతర ప్రాణులపట్ల ప్రేమ వల్ల వారు ఈ పనిచేస్తారు. మన హైద్రాబాద్ నగరంలోని పార్సీగుట్ట దీనికి సంబంధించినదే.

కొన్ని వందల సంవత్సరాల క్రితం జపాన్‌లోని ఒక గ్రామ ప్రజలు 60 సంవత్సరాలు దాటిన తమ తల్లి తండ్రులను వీపున కట్టుకుని మోసుకుంటూ ఎన్నో రోజులు నడిచి చాలా కష్టంగా "నారాయమ" అనే ఒక పర్వతాన్ని ఎక్కి ఆ శిఖరాగ్రంపై వారిని ఒంటరిగా వదిలి వెనక్కి వచ్చేవారు.

ఆకలిదప్పులతో ఆ ముసలివారు ప్రాణాలు వదలగానే ఆశతో ఎదురు చూస్తున్న రాబందులకు ఆహారంగా మారేవారు. కరువు పరిస్థితులలో వారు అట్లా చేసారు. The ballad of Narayama అన్న జపాన్‌సీన్మా కథ అదే.

ప్రస్తుతం అన్నీ ఉన్నా ముసలి తల్లితండ్రుల్ని వృద్ధాశ్రమాలకు పంపటం ఆ "నారాయమా" కంటె అన్యాయం కాదా?

ఆర్యులు ప్రవేశపెట్టిన "దహనం" పద్ధతి పుణ్యమా అని పెద్దఎత్తున దేశంలో పర్యావరణ ప్రమాదం ముంచుకొస్తుంది. అరణ్యాలు అంతరించటమే గాక జీవనదుల జలాలన్నీ కలుషితమవుతున్నాయి. దేశంలో ప్రతి ఏటా యాభై లక్షల మంది చనిపోతున్నారు. ఇందులో మెజారిటీ మృత దేహాలను దహనం చేస్తున్నారు. ఒక్కో మృత దేహ దహనానికి నాలుగు లేదా ఐదు క్వింటాళ్ల కట్టెలు అవసరం. ఈ లెక్కన ప్రతి సంవత్సరం ఐదారు కోట్ల చెట్లు నాశనమవుతున్నాయి. అరణ్యాలు, వనసంపద నశించటమే గాక ఈ కట్టెల కాలుష్యం వలన నగరాలలో వాతావరణం కలుషితమవుతుంది. రెండు కోట్ల జనాభా కల్గిన ఢిల్లీలో అరవైకి పైగా స్మశాన వాటికలున్నాయి. ఒక నిగం బోధ్ ఘాట్‌లోనే ప్రతిరోజు 50 లేదా 60 మృతదేహాలు దహనం చేయబడుతున్నాయి. ఢిల్లీ నగరమే కాక పక్కనున్న యమునా నది కూడా కాలుష్యానికి గురి అవుతుంది. కాశీలో ఏకంగా శవాలనే గంగలోకి వదిలేస్తారు. బొందితోనే కైలాసం చేరుకోవటానికి. కరోనా కాలంలో గంగా, యమునా నదిలో శవాలు కుప్పలు కుప్పలుగా తేలి ప్రవహించాయి.

దీనికి భిన్నంగా "హరిత స్మశాన వాటికల" ప్రచారం నగరాలలో ప్రవేశపెట్ట బడుతుంది. అవి మూడు నాలుగు పద్ధతులు. అందులో విద్యుత్ దహన వాటిక ఒక పద్ధతి. ఒకప్పుడు బన్సీలాల్ పేట, అంబర్‌పేట స్మశాన వాటికల్లో వీటిని ప్రవేశపెట్టారు. కాని స్పందన లేక అవన్నీ తుప్పుపట్టి చెడిపోయాయి.

మనం జీవిత కాలంలో రెండు చెట్లని పెంచుకున్నా, మరణించిన తర్వాత మరో నాలుగు చెట్లను నాశనం చేయవద్దని శాస్త్రజ్ఞులు ఘోషిస్తున్నారు.

***"మౌత్ కో సామ్నే రఖ్ లేకే జీనా"*** అని మా బాపు చెపుతూ ఉండేవాడు. దాని వలన ఈ క్రింది ***"ఎరుక"*** కలుగుతుంది.

***"సజన్ రే జూట్ మత్ బోలో***
***ఖుదా కే పాస్ జానా హై***
***న హాథీ హై న ఘోడా హై***
***వహాఁ పైదల్ హీ జానా హై"***
(తీస్రీ ఖసం సీన్మా పాట)

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

**కొన్ని వందల సంవత్సరాల క్రితం జపాన్‌లోని ఒక గ్రామ ప్రజలు 60 సంవత్సరాలు దాటిన తమ తల్లి తండ్రులను వీపున కట్టుకుని మోసుకుంటూ ఎన్నో రోజులు నడిచి చాలా కష్టంగా "నారాయమ" అనే ఒక పర్వతాన్ని ఎక్కి ఆ శిఖరాగ్రంపై వారిని ఒంటరిగా వదిలి వెనక్కి వచ్చేవారు. ఆకలిదప్పులతో ఆ ముసలివారు ప్రాణాలు వదలగానే ఆశతో ఎదురి చూస్తున్న రాబందులకు ఆహారంగా మారేవారు.**

### కొత్త శీర్షిక

మన దక్కన్‌ల్యాండ్ మాస పత్రికలో రచయిత పరవస్తు లోకేశ్వర్ రచించిన **'శాలిబండ కథలు'** కొత్త శీర్షికతో ధారావాహిక మే సంచిక నుంచి రాబోతున్నది.




# ఒక్కొక్క రాయీ కూలుతుంది! ఆ గుడి నేడో రేపో నేల రాలబోతుంది!!

అవును ఆ గుడి రాళ్లు ఒక్కొక్కటిగా కూలుతున్నాయి. పట్టించుకునేవారు లేక మూకుమ్మడిగా కూడబలుక్కొని మొత్తం నేల రాలబోతున్నాయి. వారసత్వ ప్రేమికులు ముక్కున వేలేసుకునేట్లు ఒకప్పటి చరిత్ర చెరిగి పోవటానికి కారణ మౌతున్నాయి. ఆ ఆలయం లోపల శివుడుండేవాడు. ఆయన భద్రత కోసం ద్వార శాఖలపై నిరంతర నిఘాతో పాలకులు కూడా ఉండేవారు. నిత్య కళ్యాణం పచ్చతోరణంలా వెలుగొందటానికి దాతల ద్వారా కానుకల రూపంలో కాసుల వర్షం కురిపించిన పై గడపపై ఉన్న గజలక్ష్మి మౌనముద్ర దాల్చింది. అభిషేక జలంతో పులకించిన శివలింగం గర్భాలయం నుంచి మాయమైంది. ముల్లోకాల్లో ఎక్కడి కెళ్లాలన్నా, సర్వసన్నద్ధంగా ఉండే నంది వాహనం అంతర్ధానమైంది. ఎక్కడోకాదు, హైదరాబాదు–కర్నూలు జాతీయ రహదారిపై జడ్చర్ల, కొత్తకోటకు మధ్యలో గల మూసాపేట దగ్గరున్న సం(లెం)కలమద్ది రామస్వామి గుట్టపై చిక్కి శిథిలమౌతున్న ఒకప్పటి శివాలయం. పైన జమదగ్ని రామాలయం. కొంచం కిందగా కుడివైపున తామరలు పూయించిన చక్కటి కోనేరు. కుడివైపున భక్తులకు స్వాగతం పలుకుతన్న శిలాతోరణమే సహజగోపురం. అలవోకగా ఆలయాల్ని చూచి రావటానికి చక్కటి మెట్ల వరుస.

ఎప్పుడో కళ్యాణి చాళుక్యుల కాలంలో రూపుదిద్దుకొని అంగరంగవైభవాలతో వెలుగొందిన ఆధ్యాత్మిక నిలయం. పండుగలూ, పబ్బాలూ, శివరాత్రి ఉత్సవాలకు హాలాహాలాన్ని దిగమింగిన శివుని భక్తుల కోలాహలంతో కళకళలాడిన ఆ శివాలయం, శిథిలాలను పదిలపరిచే నిజమైన ధర్మకర్తలకోసం ఎదురు చూస్తుంది.


కొంచెంపైనున్న బండలపై ఆదిమ మానవుని ఆనవాళ్లున్నాయి. కొత్తరాతియుగపు ఎద్దు, మనుషుల రాతి బొమ్మలున్నాయి. కోనేటి చుట్టూ శాతవాహన స్థావరం అడుగుజాడలున్నాయి. చాళుక్య, రాష్ట్రకూటుల కాలపు రాతిని తొలచిమలచిన గణేశ, మహిషాసుర మర్ధిని విగ్రహాలున్నాయి. పక్క పక్కనే ఉన్న మల్లికార్జున లింగం, చెన్నకేశవ విగ్రహాలు సామరస్యానికి ప్రతీకలుగా ఉన్నాయి. సరస్వతి, సూర్యభగవాన్, సప్తమాతల విగ్రహాలు కళ్యాణీ చాళుక్య శిల్పుల మునివేళ్ల నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. ఆ వూరిపేరు లెంకల మద్ది అని బల్లగుద్ది మరీ చెబుతున్న కళ్యాణీ చాళుక్యుల శాసనముంది.

లెంకలంటే చక్రవర్తులు, రాజులు, రాణులకు అంగరక్షకులుగా ప్రాణాలు సైతం లెక్క చేయక, మొక్కవోని అంకితభావంతో సేవలందించిన వీరులని అర్థం. మద్ది అంటే ఇప్పటికీ బుద్ది జీవులు కూర్చొని ముచ్చట్లు చెప్పుకునే చెట్లు కోకొల్లలుగా ఉన్నాయి. అందుకే ఈ ఊరు లెంకలమద్ది అయిందని, రానురాను సంకలమద్ది అయిందని కళ్యాణ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యుని (క్రీ.శ. 1075–1126) శాసనం కోడై కూస్తూనే ఉంది. ఈ ఆలయం మునుపటి వైభవాన్ని సంతరించుకొంటే చూడాలని ఆ శాసనం ఆశ పడుతూనే ఉంది. ఆలయ అభివృద్ధి కమిటి అందుకు సిద్ధమౌతుందని తెలిసి ముసిముసి నవ్వులు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తుంది.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# భారత్ అమ్ముల పొదిలో దివ్యాస్త్రం @ ఎంఐఆర్‌వీ టెక్నాలజీ..!!

మహా భారతంలో అర్జునుడు రెండు చేతులతో బాణాలు ప్రయోగించి శత్రు సైన్యంపై అరవీర భయంకరంగా విరుచుకు పడేవారని, అందుకే అతనిని **సవ్యసాచి** అని పిలుస్తారని మనం పుస్తకాలలో చదివే ఉంటాం. అంటే అర్జునుడు ఏకకాలంలో రెండు లక్ష్యాలపై బాణాలతో దాడిచేసేవారన్నమాట. దీనిని నేర్పరితనంతో కూడిన యుద్ధకళగా, ఆనాటి పరిస్థితులకు అది ఎంతో గొప్ప విషయంగా మనం భావిస్తున్నాం. అది వాస్తం కూడా! అయితే ఏక కాలంలో, శత్రువు ఏం జరుగుతుందో గుర్తించే లోపే బహుళ లక్ష్యాలపై క్షిపణులతో విరుచుకుపడి, ప్రత్యర్థి సైన్యాన్ని తుత్తునియలు చేస్తే ఎలా ఉంటుంది? నమ్మశక్యంగా లేదు కదూ, అసలు అది ఎలా సాధ్యం అన్న ప్రశ్న మన మదిలో ఉదయిస్తోంది కదా! అలాంటి అసాధ్యాన్ని అగ్ని-5 క్షిపణి ద్వారా ఎంఐఆర్‌వీ (మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్) అన్న సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఏక కాలంలో బహుళ లక్ష్యాలపై వార్ హెడ్లను ప్రయోగించే పరీక్షను విజయవంతంగా నిర్వహించి, సుసాధ్యం చేసింది **మన రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ).** "ఎప్పుడొచ్చా మనద్ని కాదన్నయ్యా, బుల్లెట్ దిగిందా లేదా" అన్న తెలుగు సినిమాలోని డైలాగ్ లాగా, కేవలం అమెరికా, రష్యా, చైనా లాంటి అగ్రదేశాలకే సొంతం అనుకుంటున్న ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనదేశం సైతం ఒడిసి పట్టడం భారత రక్షణ రంగ చరిత్రలోనే ఒక చిరస్మరణీయ ఘట్టంగా విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో అగ్ని-5 క్షిపణి గురించి, ఎంఐఆర్‌వీ సాంకేతిక పరిజ్ఞానం గురించీ, మనమూ తెలుసుకుందామా!!




## అగ్ని క్షిపణులు

ఎంఐఆర్‌వీ సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకునే ముందు మనం అగ్ని క్షిపణుల గురించి తెలుసుకోవాలి. క్షిపణులలో బాలిస్టిక్ మరియు క్రూయిజ్ క్షిపణులు అని రెండు రకాలు ఉంటాయి. బాలిస్టిక్ క్షిపణులు వాతావరణం నుండి వెలుపలికి, మళ్ళీ వాతావరణంలోకి పునఃప్రవేశించి నిర్దేశించిన లక్ష్యాలపై దాడులు చేస్తాయి. బాలిస్టిక్ క్షిపణులు వాతావరణం నుండి వెలుపలికి వెళ్ళినప్పుడు ఆక్సిజన్ లేకుండా ప్రయాణించాల్సి వస్తుంది. కాబట్టి, బాలిస్టిక్ క్షిపణులలో ఒక ఆక్సిజన్ ట్యాంకు కూడా ఉంటుంది. కానీ క్రూయిజ్ క్షిపణులు వాతావరణంలోనే ప్రయాణిస్తాయి. నిర్దేశించిన లక్ష్యం కదులుతూ ఉన్నప్పటికీ క్రూయిజ్ క్షిపణులు కూడా నిర్దేశించిన లక్ష్యం యొక్క కదలికలకు అనుగుణంగా తమ కదలికలను మార్చుకుంటూ, వాటిని వెంటాడి, వేటాడి దాడులు చేస్తాయి. వీటినే **గైడెడ్ క్షిపణులు** అని కూడా అంటారు. క్రూయిజ్ క్షిపణులు తక్కువ దూరం ప్రయాణిస్తాయి. బాలిస్టిక్ క్షిపణులు ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. వేరే ఖండంలో ఉన్న లక్ష్యాలపై కూడా ఈ క్షిపణులతో దాడులు చేయవచ్చు. అలాంటి క్షిపణులను ఖండాంతర్గత క్షిపణులు (ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్స్) అంటారు. అగ్ని క్షిపణులు బాలిస్టిక్ క్షిపణుల రకానికి చెందినవి.

అణ్వాయుధ సామర్థ్యం గల బాలిస్టిక్ క్షిపణుల శ్రేణిని అభివృద్ధి చేసేందుకు భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) 1983లో అగ్ని క్షిపణుల కార్యక్రమాన్ని ప్రారంభించింది.

అగ్నిక్షిపణుల సిరీస్‌లో అగ్ని-1 మొదటి క్షిపణి. ఇది 700 కి.మీ. పరిధి గల స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. దీనిని మొదటిసారి 1989లో పరీక్షించారు. 2007లో సైన్యంలో ప్రవేశపెట్టారు.

తరువాత వచ్చిన అగ్ని సిరీస్‌లోని క్షిపణులన్నీ వాటి పరిధి మరియు పేలోడ్‌లు మోసుకెళ్లగలిగే సామర్థ్యపరంగా గణనీయంగా అభివృద్ధి చేయబడ్డాయి. అగ్ని-2 క్షిపణి పరిధి 2000-2500 కి.మీ. దీనిని 1999లో తొలిసారి పరీక్షించారు. 3500 కి.మీ.

పరిధి కలిగిన అగ్ని-3 క్షిపణిని 2006లోనూ, 4000 కి.మీ. పరిధి కలిగిన అగ్ని-4ను 2011లోనూ తొలిసారి పరీక్షించారు.

అగ్ని-5, 2012వ సం॥లోనూ తొలిసారి విజయవంతంగా పరీక్షించబడింది. దీని పరిధి 5000 కి.మీ. ఇది ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం) రకానికి చెందినది.

### ఎంఐఆర్‌వీ టెక్నాలజీ అంటే...!!

సాధారణంగా ఏదైనా ఒక లక్ష్యంపై దాడి చేయాలంటే సాంప్రదాయ క్షిపణులకు వార్‌హెడ్‌ను అమర్చి వాటిపైకి ప్రయోగిస్తారు. అలా.... ఎన్ని లక్ష్యాలపై దాడులు చేయాలంటే, అన్నిసార్లు క్షిపణులకు వార్‌హెడ్‌లను అమర్చి మనం ప్రయోగించాల్సి ఉంటుంది. అలా కాకుండా ఒకే క్షిపణికి బహుళ వార్ హెడ్లను అమర్చి, అవన్నీ ఏక కాంలో విభిన్న లక్ష్యాలపై దాడులు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఐఆర్‌వీ టెక్నాలజీ అంటారు. **ఎంఐఆర్‌వీ అంటే (మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికల్) స్వతంత్రంగా బహుళ లక్ష్యాలను ఛేదించే పునఃప్రవేశ వాహనం అని అర్థం.** ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఒక అగ్ని-5 క్షిపణిని **మిషన్ దివ్యాస్త్ర** అన్న పేరుతో మార్చి 11న 2024 డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది.




*2012లో అగ్ని-5 క్షిపణిని తొలిసారి విజయవంతంగా పరీక్షించిన సందర్భంగా విజయదరహాసం చేస్తు శాస్త్రవేత్తలు*

ఛేదించాల్సిన లక్ష్యం ఒక వార్‌హెడ్‌తో నాశనం కాకపోతే, ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అన్ని వార్‌హెడ్లను, ఒకే లక్ష్యం పైకి ఒకదాని తరువాత మరొకటి తాకేలా కూడా చేయవచ్చు. తద్వారా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో నాశనం చేయవచ్చు. అదేవిధంగా అణువార్ హెడ్లను శత్రువు తేరుకునే అవకాశం లేకుండా ఏక కాలంలో ప్రయోగించడం వల్ల వారికి కోలుకోలేని స్థాయిలో నష్టం కలిగించవచ్చు. తద్వారా వారు మనతో కాళ్ళ బేరానికి వచ్చే అవకాశం ఉంది.

### కొత్తదేం కాదు...!!

ఎంఐఆర్‌వీ టెక్నాలజీ ఇప్పుడే కొత్తగా వెలుగులో కొచ్చినదేం కాదు. దీనిని 1960వ దశకంలోనే అమెరికా పరీక్షించి మైన్యూట్ మ్యాన్-3 క్షిపణి వ్యవస్థలో దీన్ని వాడింది. 1970లో సైన్యంలోకి చేర్చింది. తదుపరి అప్పటి సోవియట్ యూనియన్ కూడా ఈ సంకేతికతను సొంతం చేసుకొంది. తరువాతి సం॥రాలలో ఫ్రాన్స్, యూకే, చైనా కూడా ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నాయి. నిరుడు "అబాబీల్" అనే మధ్య శ్రేణి ప్రయోగం ద్వారా తానూ ఎంఐఆర్‌వీ సాంకేతికతను పరీక్షించినట్లు పాకిస్తాన్ చెబుతున్నా, దానిపై భిన్నాభిప్రాయాలున్నాయి.

### ఎంఐఆర్‌వీ సాంకేతికత ఎలా పనిచేస్తుంది

ఎంఐఆర్‌వీ సాంకేతికత దశలవారీగా పనిచేస్తుంది. ఇందులో 4 దశలుంటాయి.

**1. ప్రయోగ దశ (Launch) :**

ఎంఐఆర్‌వీ సాంకేతిక పరిజ్ఞానం అమర్చిన క్షిపణి ఇతర బాలిస్టిక్ క్షిపణుల మాదిరిగానే ప్రయోగించిన వెంటనే అంతరిక్షంలోకి ప్రవేశించి బాలిస్టిక్ పథాన్ని అనుసరిస్తూ ప్రయాణిస్తుంది.

**2. పోస్ట్ బూస్ట్ దశ (Post Boost Phase) :**

బూస్ట్ దశ తరువాత 'బస్' (Bus) అని పిలువబడే క్షిపణి యొక్క ఎగువదశ వాతావరణంలోని ఉపకక్ష్య మార్గాన్ని (Sub Orbital Space) చేరుకుంటుంది. ఈ సమయంలో నిర్దేశించిన లక్ష్యాల కనుగుణంగా 'బస్' తనంతకు తాను సరళరేఖా మార్గంలో ప్రయాణించేటట్లు సమలేఖనం మరియు విన్యాసాలు చేస్తుంది.

**3. మోహరించు దశ (Deployment Stage) :**

ఈ దశలో క్షిపణి యొక్క ఎగువ దశ అయిన బస్ (Bus) నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే ప్రతిస్పందనా చర్యలలో భాగంగా ఒక వరుస క్రమంలో వార్ హెడ్లను మరియు ప్రత్యర్థిని గందరగోళ పరిచే ఉపకరణాలను (Decoys) మోహరిస్తుంది. ప్రతి వార్‌హెడ్‌కు కూడా ఒక ప్రత్యేక కక్ష్యామార్గం ఉంటుంది.

**4. పునఃప్రవేశం మరియు ప్రభావం (Re entry and impact):**

క్షిపణికి అమర్చిన వార్‌హెడ్‌లు భూవాతావరణం వెలుపల కొంత సమయం ప్రయాణించి తదుపరి తిరిగి భూవాతావరణంలోకి స్వతంత్రంగా ప్రవేశించి వాటికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొని ప్రత్యర్థికి కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తాయి.


### ప్రయోజనాలు

**క్షిపణి రక్షణ వ్యవస్థలను మోసగించడం :**

ప్రత్యర్థులు ప్రయోగించే క్షిపణులను అడ్డుకోవడానికి చాలాదేశాలు అధునాతన క్షిపణి నిరోధక వ్యవస్థల్ని అభివృద్ధి

చేసుకున్నాయి. వాటితో గుర్తించడం (Detecting), అనుసరించడం (Tracking), నిరోధించడం (Intercepting), ప్రత్యర్థి ప్రయోగించిన క్షిపణిని నాశనం చేయడం లాంటి సమీకృత నెట్‌వర్క్ ఉంటుంది. ఇందుకోసం అధునాతన రాడార్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ప్రత్యర్థి ప్రయోగించిన క్షిపణులను నిరోధించే క్షిపణులు లాంటి కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉంటాయి. అయితే ఇవన్నీ సాంప్రదాయ క్షిపణులను నిరోధించడానికి మాత్రమే ఉపయోగపడతాయి. ఎంఐఆర్‌వీ సాంకేతికతతో కూడిన క్షిపణుల ముందు ఇవేవీ పనిచేయవు.

బహుళ సంఖ్యలో గల వార్‌హెడ్లు, ప్రతి వార్‌హెడ్ కూడా స్వతంత్రంగా పయనించే సామర్థ్యం ఉండడం వల్ల వీటిని గుర్తించి, నిరోధించడం ప్రత్యర్థి క్షిపణి రక్షణ వ్యవస్థలకు చాలా సంక్లిష్టమవుతుంది. పైగా వార్‌హెడ్ల్‌కు ప్రత్యర్థిని మోసపుచ్చే ఉపకరణాలు వాడడం వల్ల, వారి క్షిపణి రక్షణ వ్యవస్థ గందరగోళానికి లోనవుతుంది. కాబట్టి ఒకటి లేదా బహుళ సంఖ్యలో వార్‌హెడ్లు ప్రత్యర్థి క్షిపణి రక్షణ వ్యవస్థను ఛేధించుకొని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకొని వారికి అపార నష్టాన్ని కలిగిస్తాయి.




### ఒకే క్షిపణి – బహుళ వార్‌హెడ్లు :

ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా ఒకే క్షిపణి ద్వారా, బహుళ వార్‌హెడ్లను ప్రయోగించడం ద్వారా సమయాన్ని ఆదాచేయడంతో పాటు, ఖర్చును తగ్గించవచ్చు. మరియు ప్రత్యర్థికి అపార నష్టం కలిగించవచ్చు.

### ఖచ్చితత్వంతో కూడిన లక్ష్యఛేదన :

ఆరునూరైనా, ఎంఐఆర్‌వీ సాంకేతికతతో కూడిన క్షిపణులు నిర్దేశించిన లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో ఛేదిస్తాయి. గురితప్పడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండదు.

### స్వతంత్రంగా వ్యవహరించే నేర్పు :

ఎంఐఆర్‌వీ సాంకేతికత ద్వారా ప్రయోగించే, క్షిపణిలోని ప్రతీ వార్‌హెడ్ కూడా స్వతంత్రంగా వ్యవహరిస్తూ భిన్న లక్ష్యాలపై దాడిచేయడం దీనిలోని ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చు.

### ప్రతికూలతలు :

ఎంఐఆర్‌వీ సాంకేతికతను ఇండియా విజయవంతంగా పరీక్షించినప్పటికీ అందులో ఎన్నో సంక్లిష్టతలున్నాయి. వాటికి మెరుగైన పరిష్కారాలు అన్వేషించాల్సిన అవసరం ఉంది.

### సాంకేతిక సంక్లిష్టతలు :

నిర్దేశించిన లక్ష్యంపైకి వేగంగా దూసుకెళ్లి, గరిష్టస్థాయిలో ప్రభావం చూపేందుకు గానూ, క్షిపణిలో అమర్చే వార్ హెడ్లను వీలైనంత తక్కువ స్థాయికి సూక్ష్మీకరించాల్సి ఉంటుంది. అదేవిధంగా స్వతంత్రంగా పయనిస్తూ, లక్ష్యంపై దాడి చేసేందుకు గానూ ఖచ్చితమైన, సునిశితమైన మార్గనిర్దేశం (గైడెన్స్), గమన నియంత్రణా పరిజ్ఞానం (నావిగేషన్ కంట్రోల్) క్షిపణికి అందజేయడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ.

### ప్రెసిషన్ ఇంజనీరింగ్ :

ఎంఐఆర్‌వీ సాంకేతికత ద్వారా ప్రయోగించిన క్షిపణిలోని ప్రతి వార్‌హెడ్ కూడా అత్యంత ఖచ్చితత్వంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎంతో అభివృద్ధి చెందిన స్వదేశీ ఏవియానిక్ వ్యవస్థలు మరియు సెన్సార్ సిస్టమ్స్‌ను సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

### అణ్వాయుధ సంఘర్షణలు పెరిగే ప్రమాదం :

ఎంఐఆర్‌వీ సాంకేతికత కలిగి ఉండడం వల్ల రక్షణ వ్యవస్థ బలోపేతమవడం ఆహ్వానించదగ్గ పరిణామమయినప్పటికీ, మరోవైపు ప్రత్యర్థులు ఈ సాంకేతికతను ఎదుర్కోవడం కోసం మరిన్ని అణ్వాయుధాలను పోగుచేసుకునే అవకాశం ఉంది. కాబట్టి ఎంఐఆర్‌వీ సాంకేతికత రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది.

### అంతర్జాతీయ ఒడంబడికలు:

ఏక కాలంలో బహుళ వార్‌హెడ్లను ప్రయోగించే క్షిపణులను అభివృద్ధి చేస్తున్నప్పుడు అంతర్జాతీయ పరిమితులను, విభిన్న ఒప్పందాలను వాటివల్ల కలిగే ప్రతికూలతలను సునిశితంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

### భద్రత మరియు విశ్వసనీయత :

సుదూర తీరాలకు బహుళ వార్‌హెడ్లను మోసుకెళ్లగలిగే క్షిపణుల యొక్క భద్రత మరియు విశ్వసనీయతను సునిశితంగా అధ్యయనం చేసి నిర్ధారించాల్సి ఉంటుంది.

### మహిళాశాస్త్రవేత్తల విజయం..!!

మిషన్ దివ్యాస్త్ర విజయం మహిళా శాస్త్రవేత్తల ఘనతేనని పలువురు విశ్లేషకులు వాఖ్యానిస్తున్నారు. ఈ మిషన్ కోసం పలు కీలక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి పలువురు మహిళా

శాస్త్రవేత్తలు గణనీయ సేవలందించారు.

షీనారాణి అగ్ని-5 ప్రోగ్రామ్‌కు డైరెక్టర్‌గా పనిచేయడంతో పాటు, ఆ ప్రాజెక్ట్‌కు నాయకత్వం వహించింది. ఆమె నాయకత్వం మరియు నైపుణ్యం అగ్ని-5 క్షిపణిలో ఎంఐఆర్‌వీ సాంకేతికతను విజయవంతంగా అనుసంధానించడంలో కీలక పాత్ర పోషించారు. ఈమె మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా.



షీనా రాణి
ఎంఐఆర్ వీ టెక్నాలజీ
రూప శిల్పి

అబ్దుల్ కలాం స్ఫూర్తితో పనిచేస్తూ, ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయికి చేరుకుంది. షీనారాణితో పాటు ఈ ప్రాజెక్ట్‌లో ఉషావర్మ, నీరజ, విజయలక్ష్మి మరియు వెంకటమణి వంటి మహిళా శాస్త్రవేత్తలు ఇతోధిక సేవలు అందించారు. ఈ విధంగా మహిళా శాస్త్రవేత్తల చొరవ, సైన్స్ మరియు రక్షణరంగంలో పెరుగుతున్న మహిళా భాగస్వామ్యాన్ని సూచిస్తోంది.

**భవిష్యత్ ప్రాజెక్టులు :**

**అగ్ని సిరీస్ క్షిపణుల పరంగా :**

**అగ్ని-6 క్షిపణి అభివృద్ధి :**

రాబోయే రోజుల్లో 12000 కి.మీ. పరిధి కలిగిన అగ్ని-6 క్షిపణిని అభివృద్ధి పరిచే ప్రక్రియలో డీఆర్‌డీఓ నిమగ్నమై ఉంది. దీనికి ఎంఐఆర్‌వీ సాంకేతికతను కూడా అనుసంధానించే అవకాశం ఉంది.

**మెరుగైన స్టెల్త్ ఫీచర్స్ :**

ప్రత్యర్థుల రాడార్ల మరియు క్షిపణి నిరోధక వ్యవస్థలను ఏమార్చే అధునాతన స్టెల్త్ ఫీచర్స్‌ను డీఆర్‌డీఓ అభివృద్ధి చేస్తోంది.


**మరింత పేలోడ్‌ను మోసుకెళ్ళగలిగే సామర్థ్యం :**

ఎక్కువ పరిమాణం కలిగిన వార్‌హెడ్లు లేదా అధిక సంఖ్యలో వార్ హెడ్లను మోసుకెళ్ళ గలిగే విధంగా క్షిపణుల పేలోడ్ కెపాసిటీని డీఆర్‌డీఓ అభివృద్ధి పరుస్తోంది.

**మిసైల్ టెక్నాలజీ పరంగా :**

**హైపర్ సానిక్ టెక్నాలజీ :**

ప్రత్యర్థుల క్షిపణి రక్షణ వ్యవస్థలను సులువుగా ఛేధించేందుకుగా మాక్-5 కన్నా అధిక వేగంతో ప్రయాణించ గలిగే హైపర్ సానిక్ క్షిపణి సాంకేతికతను అభివృద్ధి చేసేదిశగా ఇండియా దృష్టి సారించింది.




**కృత్రిమమేధ సమన్వయం :**

లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో ఛేధించేందుకు, సత్వర నిర్ణయాలను తీసుకొనేందుకు, మరియు స్వతంత్రంగా వ్యవహరించగలిగే నావిగేషన్ సిస్టమ్స్‌ను అభివృద్ధిపరిచేందుకు గానూ, క్షిపణి సాంకేతికతకు కృత్రిమమేధను జోడించే దిశగా కూడా పరిశోధనలు జరుగుతున్నాయి.

**అధునాతన ప్రొపల్షన్ సిస్టమ్స్ :**

క్షిపణులను సత్వరం లక్ష్యసాధన దిశగా మోహరించేందుకు ఘన ఇంధనంతో కూడిన ఇంజన్లను మరియు సుదీర్ఘ దూరాలకు వార్‌హెడ్లను మోసుకెళ్లేందుకు ద్రవ ఇంధనం కూడిన హైబ్రిడ్ ఇంజన్లతో కూడిన ప్రొపల్షన్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా ఇండియా తీవ్రంగా కృషి చేస్తోంది.

**చివరగా**

ఎంఐఆర్‌వీ సాంకేతి కతను సాధించడం ఇండియా రక్షణ రంగ చరిత్రలోనే ఒక చిరస్మరణీయ ఘట్టం అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ సాంకేతికత సాధించడంతో ఇండియా యూఎస్, యూకే, రష్యా, చైనా, ఫ్రాన్స్ లాంటి అగ్ర దేశాల సరసన చేరింది. ఇదే సమయంలో ప్రాంతీయ భద్రతను స్థిరీకరించడం లోనూ, ఇండో పసిఫిక్ రీజియన్‌లో చైనా, పాకిస్తాన్ లాంటి దేశాలతో భౌగోళిక రాజకీయాలను సమన్వయం చేసుకుంటూ, అంతర్జాతీయ అణ్వాయుధ ఒడంబడికలను, నియమాలను పాటిస్తూ భారత ఉపఖండంలో వ్యూహాత్మక స్థిరత్వాన్ని సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**-పుట్టా పెద్ద ఓబులేసు,**
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప
m : 9550290047
e : obu.jmd@gmail.com



# పారిశ్రామిక నాగరికత - పర్యావరణ దృష్టి

ప్రకృతికీ, మానవులకూ మధ్య సహజంగా జరిగే జీవరసాయన క్రియలో ఒక పెద్ద అగాధం ఏర్పడిందని, అది నానాటికీ మరింత విస్తరిస్తున్నదని ప్రకృతి శాస్త్రవేత్తలో, పర్యావరణవేత్తలో లేక పర్యావరణ సామాజిక శాస్త్రవేత్తలో చెప్పారనుకోండి. మనమేమీ పెద్దగా పట్టించుకోం. ప్రతిస్పందించం. మన నిత్యావసరాల గొడవ లేనంతవరకూ మనకేమీ ఇటువంటి విషయాల పట్ల పెద్ద ఆసక్తి ఏమీ కలగదు. అదే ఒక్కరోజు రెండు గంటలపాటు కరెంటు లేకపోయినా, రెండు బిందెల మంచినీళ్ళు అందకపోయినా ప్రపంచం తల్లకిందులై పోయిందని గగ్గోలు పెడతాం. ప్రభుత్వాలు అసమర్థతలను ఎత్తిచూపడానికి వెనుకాడం.

ప్రకృతికి, మానవాళికి మధ్య పెరిగిన దూరాన్ని 'ఎకలాజికల్ రిఫ్ట్' అంటున్నారు శాస్త్రవేత్తలు ప్రపంచం మొత్తం ఒక అఖండం అయితే ఈ అఖండాన్ని ఖండ ఖండాలుగా, శకల శకలాలుగా మార్చేది కృత్రిమ విభజన ఫలితం. మనలను మన పూర్వ తరాల నుండి వేరు చేస్తున్నది. భౌతిక-ప్రాకృతిక పరిస్థితులతోటి ఉన్న అస్తిత్వమే. మనకంటే ముందున్న తరాలు ప్రకృతితోటి సన్నిహితంగా ఉన్నారు. వారికిన్ని వాంఛలులేవు. ఆకాంక్షలులేవు. భౌతిక సంపదలను కొల్లగొట్టేయ్యాలన్న ఆశలులేవు. అసలు ప్రకృతిని ఏకమొత్తంగా జయించాలన్న అత్యాశలు లేవు.

మనకు భూమండలాన్ని కాపాడుకోవాలన్న ఆకాంక్షలేదు. మానవాళిని రక్షించుకోవాలన్న తపనలేదు. పెట్టుబడిని పరిరక్షించుకోవటం తద్వారా మరింత లాభాలను పొందగలగటం ఇదొక్కటే ఆశయంగా ఉంటోంది మనకు.

అసలు పర్యావరణ సమస్యలన్నిటికీ మూలం పెట్టుబడిదారీ వ్యవస్థలోనే ఉన్నాయనే సత్యాన్ని విస్మరించాం.

పారిశ్రామిక నాగరికత జీవితానికి సరిపోదు. అది జీవించనీయదు. ఒక పద్ధతి ప్రకారం జీవాన్ని ఈ భూమండలం నుంచి తొలగిస్తుంది. ఈ సంస్కృతి భూమిని హత్యచేస్తుంది. మనం దీనిని నిరోధించక పోయినట్లయితే, సహజ ప్రకృతి దీనిని హతమారుస్తుంది. అది ఆవరణ వ్యవస్థ కుప్పకూలటం ద్వారా కావచ్చు. మరొక మార్గం ద్వారానైనా సంభవించవచ్చు. జీవించి ఉన్న ప్రతి ప్రాణినీ పారిశ్రామిక నాగరికత చంపుతుంది అన్నారు డెరిక్ మెన్‌సెన్, అరిక్‌మెక్‌బేలు తమ 'దాట్‌వియ్ లీవ్ బిహైండ్' అనే పుస్తకంలో. మనం ప్రపంచాన్ని ఎలా చూస్తున్నాం అనేది ప్రపంచం గురించి ఎట్లా ఆలోచించాలనే విషయాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రపంచం గురించి ఎలా ఆలోచిస్తున్నాం అనేది ప్రపంచాన్ని మనం చూసే విధాన్ని ప్రభావిత పరుస్తుంది. ప్రపంచాన్ని చూసే విధానం, ఆలోచించే విధానాలు ప్రపంచంలో ప్రపంచంతోటి ఎట్లా ప్రవర్తించాలనే విషయాన్ని ప్రభావితం చేస్తుంది. పారిశ్రామిక సంస్కృతి ప్రవర్తన మొత్తం భూమిని హత్యచేయటం కాబట్టి మనం మన ప్రవర్తనా పద్ధతిని ఇతర విషయాలతో పాటుగా మార్చుకోవాలి. మనం ప్రపంచాన్ని ఎట్లా చూడాలి. ప్రపంచం గురించి ఏమి ఆలోచించాలో కూడా మార్చుకోవలసి ఉంది. తమ గ్రంథంలో టెరిక్‌యన్‌సెన్ ఏది వాస్తవం, ఏది వాస్తవం కాదు అనేది గుర్తించలేని విలోమ సంస్కృతిలో జీవిస్తున్నాం అంటారు.

ఒకవైపు సముద్రాలు అంతరించిపోయి, తల్లిపాలలో డయాక్సిన్‌లు పెరిగిపోవటం అనేది ప్రధాన విషయంగా 'పారిశ్రామిక పెట్టుబడి' అతి ముఖ్యవిషయంగా పరిగణన పొందుతూ ఉన్నది. ప్రపంచం అంతరించి పోతుందనేది అంతగా భీతిల్లవలసిన విషయం కాదని 'పారిశ్రామిక పెట్టుబడిదారీ వాదం'

అంతరించటం నిజంగా భయపడాల్సిన విషయమని నమ్మించ జూపే సంస్కృతిలో ఉన్నాం మనం. ఇటువంటి సంస్కృతిలో ఎక్కువమంది అడిగే ప్రశ్న 'గ్లోబల్ వార్మింగ్‌ను మనమెలా ఆపగలం?' అంటే వారడిగేది ఈ జీవన విధానాలను మార్చుకోకుండా మనమెలా దీనిని ఆపగలం అనే దీనర్థం. ఏమంటే జీవన విధానాలలో మార్పు రాకూడదు కానీ గ్లోబల్ వార్మింగ్‌లో మార్పు రావాలి. తాము తమ అలవాట్లు జీవనశైలులు మార్చుకోవడానికి సిద్ధంగా లేరు. అట్లాంటప్పుడు అసలు గ్లోబల్ వార్మింగ్ ఉందా? అని కూడా కొందరు అడగవచ్చునేమో! లేదా గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించాలను కోవటం పిచ్చితనంగా కూడా భావించే వారూ ఉండొచ్చు.

పారిశ్రామిక పెట్టుబడి అనేది ఎప్పటికీ సుస్థిరమైనదికాదు.



అది ఎప్పుడూ ఏ ఖనిజాల కోసం, పదార్థాల కోసం ఏ నేలమీద ఆధారపడి ఉందో దానినే విధ్వంసపరుస్తుంది. పారిశ్రామిక పెట్టుబడి పోవాలంటే దాని దోపిడీకి నేల, నీరు, గాలి లేకుండా పోయినప్పుడే సాధ్యమవుతుంది. గాలి, నేల, నీరు లేకుండా పోవాలనుకోవటం కంటే, పారిశ్రామిక పెట్టుబడే లేకుండా పోవాలి. పారిశ్రామిక పెట్టుబడులు పెరగటమే తప్పు. తరగటం చూడటం కుదరదు. పైగా అభివృద్ధి జరగాలంటే పెట్టుబడులను ఆకర్షించాలని, అవి వొస్తే రాష్ట్రాలు, దేశం సౌభాగ్యవంత మవుతాయని పోటీలు పడి తెచ్చుకుంటున్నాయి ప్రభుత్వాలు. పారిశ్రామిక కారిడార్ తామరతుంపగా వృద్ధి చెందుతున్నాయి. పెరగనిది ఏదైనా ఉందంటే పర్యావరణం పట్ల ప్రజల బాధ్యత, భాగస్వామ్యం, బాధ్యతను గుర్తించగలిగినప్పుడే భాగస్వాములం కాగలుగుతాము.

అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు తెచ్చిపెట్టే ముప్పు ఏమిటో తెలుసుకోవటం అందరికీ అవసరం, పారిశ్రామిక నాగరికత సంస్కృతి ప్రసాదించే వ్యర్థ, నిరుపయోగ ఉత్పత్తుల పట్ల, వాటి వినియోగం ఆ వినియోగం వల్ల ఉత్పన్నమయ్యే వ్యర్థాలు మొదలైన వాటి గురించి కనీసంగానైనా అవగాహన కావాలి.

నిజానికి వ్యర్థం అంటే ఏమిటి? మంచి వ్యర్థాలు అనేవి ఉంటాయా? లేక సరిగా వ్యర్థం చేయటమనేది ఉంటుందా అనేవి ప్రశ్నలు. వ్యర్థాల పట్ల మన వైఖరులు ఎలా ఉంటాయి? అనేదీ ముఖ్యమే. వ్యర్థం అనేదానికి రెండర్థాలున్నాయి. ఒకటి ఉపయోగం, రెండవది విధ్వంసం. ఏదైనా వ్యర్థమైందని అన్నామంటే దానిని సామర్థ్యమేరకు ఆర్థికంగా ఉపయోగించలేదని, లేదంటే పూర్తిగా ఉపయోగించాం కనుక ఇక పనికిరానిదని. కాలం, డబ్బు, జీవితం వృధా అయ్యాయని అన్నామంటే వాటిని సరిగా ఉపయోగించలేక పోయామని లేదా ఆశించిన ప్రయోజనం వాటినుంచి రాబట్టలేక పోయామని.

ఉపయోగించేవారి దృష్టికోణాన్ని బట్టి వ్యర్థం అనేది నిర్వచించబడుతూ ఉన్నది. ప్రకృతిని కూడా మానవులకు ఉన్న ఉపయోగాలను బట్టి నిర్వచిస్తూ వచ్చాం. ఈ దృష్టి కోణం సరైనది కాదు. నిజానికి ప్రకృతిలో పరస్పరం ఉపయోగాలను బట్టి వాటి మధ్య సంబంధం ఉంటుంది. ఒక్క మనిషి మాత్రమే తాను ఏ కొంచెం ప్రకృతికి ఉపయోగ పడకుండా ప్రకృతిని ఉపయోగించు కుంటున్నాడు. నీ వల్ల ప్రకృతికి ఉపయోగం ఏమీ లేనట్లయితే, ప్రకృతి దృష్టి కోణం నుంచి చూస్తే నువ్వు వర్థ్యానివే.

వాట్ విమ్‌లీవ్ బిహైండ్ రచనలో రచయిత ఒక ఉదాహరణను ఆసక్తికరంగా వివరించాడు. ప్రస్తుత వ్యవస్థలో ఏ వస్తువైనా అది మనకు ఉపయోగపడిన జీవిత కాలం కంటే అది నిరుపయోగంగా వ్యర్థంగా ఎక్కువ జీవిత కాలాన్ని కలిగి ఉంటుందని చెపుతాడు. ఒక సంఘటనను ఇలా చెపుతాడు "నేనొక మాల్‌కు భోజనం కొరకు వెళ్ళాను అక్కడ ఒకసారి వాడి పారవేసే ప్లాస్టిక్ ఫోర్క్ ఇవ్వబడింది. నేను ఐదు నిమిషాలు వాడే సరికి విరిగిపోయింది. దానిని నేను బయట విసిరేశాను. అది చెత్తకుప్పలోకి అక్కడ నుండి భూమిలోకి పోయింది. ఆ ప్లాస్టిక్ చెంచా భూమిలో కరగాలంటే ఐదు వేల సంవత్సరాల కాలం పడుతుంది. ఆ ప్లాస్టిక్ అటువంటి రకం. నేను ఆ ఫోర్కును వాడింది ఐదే నిమిషాలు. కానీ, నిమిష కాలం నేను వాడితే ఆ చెంచా వెయ్యేళ్లు వ్యర్థంగా మిగిలిపోతుంది. ఈ ఉదాహరణ చెప్పి మనం వాడేది స్వల్పకాలమైనా అది దీర్ఘకాలం నిరుపయోగంగా ఉంటున్నది. ఇట్లాంటివి అనేకం చెప్పవచ్చు. పారిశ్రామిక నాగరికత అనివార్యంగా సంక్లిష్టమైన పద్ధతిలో భూమిని వ్యర్థ పదార్థంగా మారుస్తున్నది అంటాడు. కనుక ఆ నాగరికత భూమిపై వ్యర్థంగా పడి ఉంటున్నదని భారమైపోతున్నదని పేర్కొంటాడు. మనమిప్పుడు ఏ నాగరికత, సంస్కృతులకు ప్రతినిధులమో ఆలోచించుకోవాలి.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

# దక్షిణ భారతంలోని జియో హెరిటేజ్ స్థలాలు

(South India - Geo Heritage Sites)



నేచురల్ ఆర్చ్ (శిలా తోరణం), తిరుమల, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్



ఎప్ ఆర్క్యన్ అన్‌కన్‌ఫర్మిటి తిరుమల, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

దక్షిణ భారతంలో ఇప్పటి వరకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతిపాదన మేరకు, కేంద్ర ప్రభుత్వం గుర్తించి వీటిని జయోలాజికల్ మాన్యుమెంట్స్‌గా డిక్లేర్ చేయడం జరిగింది. అలాంటి స్థలాలు పదిహేను (15) ఉన్నవి. ఆంధ్రప్రదేశ్‌లో అయిదు (5), కర్నాటకలో నాలుగు (4), తమిళ నాడులో మూడు (3) మరియు కేరళలో మూడు (3) కలవు. ఈ సంచికలో ఆంధ్రప్రదేశ్‌లోని జియోలాజికల్ మాన్యుమెంట్స్ గురించి చర్చించుకుందాము.

ఆంధ్రప్రదేశ్‌లోని అయిదు సైట్స్ యొక్క వివరణ ఒకొక్కటిగా క్రింద ఇవ్వబడినది.

**1) నేచురల్ ఆర్చ్ (శిలా తోరణం)**

ఈ నేచురల్ ఆర్చ్‌ని ఇక్కడి వారు శిలాతోరణం అని అంటారు. ఇది తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో కలదు. ఈ ప్రాంతం చిత్తూరు జిల్లాకు చెందుతుంది. ఈ శిలాతోరణం ఒక రాక్ బ్రిడ్జ్, ఇది మూడు (3) మీటర్ల ఎత్తు, ఎనిమిది (8) మీటర్ల వెడల్పు కలిగి ఉన్నది. ఇది క్వార్ట్జైట్ శిలలో ప్రకృతి వైపరీత్యాల ద్వారా చెక్కబడినది. ఈ శిల కడప సూపర్ గ్రూప్‌కు చెందిన నగరి ఫార్మేషన్‌కు చెందినది. దీని వయస్సు 1600 మిలియన్ సంవత్సరాలుగా నిర్ధారించడం జరిగినది. ఇది ఫార్మ్ కావడానికి కారణం డిఫరెన్షియల్ ఎరోశన్ అనగా సాఫ్ట్‌మెటీర్యెల్ ఎరోడ్ అయిపోయి హార్డ్ మెటీరియల్ మిగిలిపోవడం. ఇది తిరుమలలో ఉండడం వల్ల స్వామి దర్శనానికి వచ్చిన ప్రతివారు దీనిని కూడా దర్శించుకుంటారు. స్వామి ఈ ద్వారం గుండా అక్కడికి వచ్చాడన్న గట్టి నమ్మకం భక్తులలో వుంది.



స్ట్రాటిఫార్మ్ బైరైట్ డిపాజిట్

**2) ఎప్‌ఆర్క్యన్ అన్ కన్ఫర్‌మిటి**

ఈ స్థలం జియోలాజికల్‌గా చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే నగరి ఫార్మేషన్‌కు చెందిన క్వార్టజైట్ అనకన్‌ఫర్మబుల్‌గా పెనెన్ సులర్ నైస్ పైన ఉండటం విశేషం. ఆర్క్యన్ పీరియడ్‌కు చెందిన నైస్ శిలపైన ప్రొటిరోజోయిక్ పీరియడ్‌కు చెందిన క్వార్ట్జైట్ శిల దానిపైన కాంటాక్టులో ఉండటం మరియు ఇలాంటి దృశ్యం ఇంకెక్కడా లేకపోవడం దీని ప్రత్యేకత. దీనిని తిరుమల కొండల స్టీప్ స్కార్ప్‌లో 900 మీటర్ల ఎత్తు ప్రాంతంలో చూడగలము.

**3) స్ట్రాటిఫార్మ్ బైరైట్ డిపాజిట్**

ఈ స్ట్రాటిఫార్మ్ బైరైట్ డిపాజిట్ కడప జిల్లాలోని మంగంపేట



బొర్రా కేవ్స్, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్



ఎర్రమట్టి దిబ్బలు – భీమునిపట్నం వైజాగ్, ఆంధ్రప్రదేశ్

వద్ద కలదు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద స్ట్రాటిఫార్మ్ బెరైట్ డిపాజిట్ ఇక్కడ రెండు స్ట్రాటిఫార్మ్ లెన్స్ 1.2 కి.మీ. పొడవు 20 మీ. తిక్‌నెస్ కలిగి యుండి 74 మిలియన్ టన్నుల బెరైట్ రిజర్వు కలదు. ఈ బెరైట్ ఖనిజం యొక్క కాంపొజిషన్ BaSO4 దీని స్పెసిఫిక్ గ్రావిటి 2.4 నుండి 2.9 వుంటుంది. ఈ డిపాజిట్ ఫార్మ్ అయిన విధానం ఏంటంటే అగ్నిపర్వతం సబ్ మెరైన్ కండిషన్స్‌లో బద్ధలైన సమయంలో వేపర్స్, ఏశ్, మోల్టెన బరైట్ లాపిల్లి విరజల్లడం సెడిమెంటరీ బెసిన్ యొక్క సీ ఫ్లోర్ దగ్గర ఈ ప్రక్రియ ద్వారా ఏర్పడినది ఈ డిపాజిట్. ఇది కడపా సూపర్ గ్రూప్‌లోని పుల్లంపేట్ ఫార్మేషన్‌కు చెందినది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద బెరైట్ డిపాజిట్. దేశంలోనే అతి పెద్ద బెరైట్ డిపాజిట్ దేశంలోని రిజర్వ్‌లో 98%, ప్రపంచంలో 28% ఇక్కడి నుండి వస్తుంది. దీనిని డ్రిల్లింగ్ మడ్‌గా, కెమికల్స్, పేంట్స్, ఫిల్లర్ మరియు ఎక్స్‌టెండర్ అగ్రిగేట్స్‌లో ఉపయోగిస్తారు.

**4) ఎర్రమట్టి దిబ్బలు**

వీటిని విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం వద్ద చూడగలము. ఇవి కోనికల్ దిబ్బలుగా ఒక డైసెక్టెడ్ బ్యాడ్‌లాండ్ టోఫోగ్రఫీగా చూడగలము. ఈ బ్యాడ్ లాండ్ గల్లీ స్ట్రీమ్స్ ద్వారా ఏర్పడినది. ఈ దిబ్బలు ఏర్పడడానికి కారణం. ఈ ప్రాంతం నియో టెక్టానిక్ ఎక్టివిటికి గురి కావడం ఈ దిబ్బలు ఫెర్రుజినస్ సాండ్‌తో కూడి యున్నది. వీటి వయస్సును TL మరియు OSL మెథడ్స్ ద్వారా 49000-54000 సంవత్సరాలుగా నిర్ధారించడం జరిగినది. అనగా ప్లీస్టోసీన్ ఏజ్‌కు చెందినది.

**5) బొర్రాకేవ్స్**

ఈ బొర్రాకేవ్స్ విశాఖపట్నంకు 90 కి.మీ. దూరంలో ఈస్టర్న్ ఘాట్స్‌కు చెందిన అనంతగిరి హిల్స్‌లో 800 నుండి 1300 మీ ఎత్తు ఎం.ఎస్. ఎల్. పైన గలదు. వీటిని 1807లో మొట్ట మొదట విలియమ్. కింగ్ అనే ఒక బ్రిటీష్ జియాలజిస్ట్ రిపోర్ట్ చేశాడు. గోస్తని నది యొక్క ఉపనది నీళ్లలోని హుమిక్ ఎసిడ్ క్రిస్టలైన్ లైమ్ స్టోన్ లోని కాల్ శియం కార్బొనేట్‌తో రియాక్ట్ కావడం వల్ల కెమికల్ సెక్రీశన్ ద్వారా స్టాలక్ టైట్స్ మరియు స్టాలగ్‌మైట్స్, ఫార్మ్ కావడం జరిగినది. ఈ గుహల యొక్క ద్వారం ఎత్తు 705 మీ. M.S.L పైన, లోపల 625 ఎం. ఎస్, ఈ కేవ్ యొక్క పొడువు 200 ఎం. ఆంధ్రాయూనివర్సిటీ ఆంత్రపాలజిస్ట్లు తొవ్వకాలు జరపగా, మిడిల్ పేలియొలితిక్ స్టోన్ టూల్స్ దొరికినవి, అవి 30,000-50,000 సంవత్సరాలుగా నిర్ధారించారు.

*(వచ్చే సంచికలో కర్ణాటక గురించి తెలుసుకుందాం.)*

**– కమతం మహేందర్ రెడ్డి**
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com

ద


JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# క్యాన్సర్ భూతం

**కుర్మయ్య:** అమ్మా! నీ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. పదా! ఆసుపత్రికి వెళ్లి చూపించుకుందాం.

**తల్లి:** వద్దు బిడ్డా! ఇప్పటికే మస్తు ఆస్పిటల్లకు తిరిగినా. ఎన్ని మందులు వేసుకున్నా తగ్గుతలేదు. నేను రాను బిడ్డా!

**కుర్మయ్య:** లేదమ్మా! నామాట విను! పాలమూరులో మంచి డాక్టర్ వున్నడు. సూపించుకుని వద్దాం . ఇదొక్క సారి నా మాట వినమ్మా!

**తల్లి:** సరే బిడ్డా! పోదాం పదా ఈ మాయదారి రోగమేందో నన్ను సంపుతోంది

**కుర్మయ్య:** అమ్మా! పాత రిపోర్టులన్నీ తీసుకో

**తల్లి:** తీసుకున్న బిడ్డా!

**కుర్మయ్య:** డాక్టర్ గారూ! మా అమ్మకు వచ్చిన రోగమేందో తెలుస్తలేదు. మీరే మా అమ్మను కాపాడాలి.

**డాక్టర్:** ఇంతకు ముందు ఎక్కడైనా చూపించుకున్నారా

**కుర్మయ్య:** చూపించుకున్నాం. డాక్టర్

**డాక్టర్:** ఏదీ! రిపోర్టులు ఇటివ్వండి సరే! ఈ టెస్టు రాస్తాను చేయించండి

**కుర్మయ్య:** సరే, డాక్టర్

**కుర్మయ్య:** ఇదిగోండి డాక్టర్!

**డాక్టర్:** అమ్మా! మీరు బయటికి వెళ్ళండి

ఇదిగో చూడు బాబూ! మీ అమ్మకు క్యాన్సర్ ఉంది. అందుకే రోగం తగ్గుతలేదు

**కుర్మయ్య:** క్యాన్సరా! డాక్టర్! మేము పల్లెటూరోళ్ళం. కాయకష్టం చేసుకుని బతికేటోళ్లం క్యాన్సర్ ఎలా వచ్చింది

**డాక్టర్:** ఏమీ అలవాట్లు లేకున్నా మనం రోజూ తింటున్న ఆహారమే క్యాన్సర్ కు కారణం అవుతుంది.

**కుర్మయ్య:** ఏంది డాక్టర్. ఆహారం తింటే క్యాన్సర్ వస్తుందా?

**డాక్టర్:** ఎందుకురాదు! తింటున్న అన్నం, పప్పు, కూరగాయలు, వంటనూనెలు, పళ్ళు అన్నీ పురుగుమందులు పిచికారి చేస్తూ పండించినవేకదా. తినే ప్రతి దాంట్లో రసాయనాలు ఉంటున్నాయి. ఇవే క్యాన్సర్ కు కారణం అవుతున్నాయి.

ఓ మాట అడుగుతా! చెప్పు!

పురుగుమందులు కొట్టకుండా వ్యవసాయం చేసినప్పుడు ఈ రోగాలున్నాయా? జొన్న సంకటి , తైద అంబలి చింతకాయ చెట్నీ స్వచ్ఛమైన పల్లి నూనె తిన్నప్పుడు లేని రోగాలు ఇప్పుడు ఎందుకొచ్చినాయో అర్థమైందా?

బాబూ! ఔషధాలనే ఆహారంగా తీసుకుని బతుకులను నరకంగా మార్చుకుంటున్నాం. మనం రసాయనిక మందులులేని స్వచ్ఛమైన ఆహారాన్ని తీసుకోవాలి. ఆహారాన్ని ఔషధంగా మార్చుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఆనందంగా వుండగలుగుతాము



డాక్టర్‌గా చెబుతున్నా! ఈ రోగాలకు ఆసుపత్రులు శాశ్వత పరిష్కారం చూపలేవు.

డాక్టర్ ! ఇప్పుడేం చేయాలో చెప్పు.

నీ లాంటి యువరైతులతో పాటు ప్రతి రైతు ప్రకృతి సేద్యం చేయాలి. రసాయనిక ఎరువులు లేని పంటలను పండించాలి. ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవడంతో పాటు స్వచ్ఛమైన ప్రకృతి ఆహారాన్ని భావితరాలకు బహుమతిగా అందివ్వాలి.

అప్పుడు నాలాంటి డాక్టర్లతో పని ఉండదు. ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పనే లేదు.

ఇప్పటికైనా అందరూ మేల్కోవాలి. ప్రకృతి సేద్యాన్ని, వారు పండించిన పంటలను కొంటూ ఆ ఆహారాన్నే తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

–గుముడాల చక్రవర్తి గౌడ్
m : 9441059424
e: gcgoud7171@gmail.com



# లక్క గాజులకు 'జీఐ'(GI) నగిషీ

హైదరాబాద్ నగరానికి మరో గుర్తింపు దక్కింది. పాతబస్తీలోని లక్క గాజులకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (Geographical Indication) గుర్తింపు లభించింది. ఇదివరకే హైదరాబాద్ హలీమ్‌కు జీఐ ట్యాగ్ దక్కగా.. తాజాగా లక్క గాజులు ఆ జాబితాలో చేరాయి. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చార్మినార్ లాడ్‌బజార్ లాక్ గాజులను తెలుగులో లక్క రాళ్ల గాజులుగా పిలుస్తుంటారు. తాజాగా ఈ లక్క గాజులకు చెన్నైలోని కేంద్ర ప్రభుత్వ GI Registration Tagను ప్రకటించింది. తెలంగాణలో జీఐ ట్యాగ్ అందుకున్న 17వ ఉత్పత్తి ఇది.

**చేతితోనే తయారీ**

హైదరాబాద్ పాతబస్తీ గాజులకు ప్రసిద్ధి. ఇక్కడ రకరకాల గాజులు తయారవుతుంటాయి. అందులో లక్క రాళ్ల గాజులు స్థానిక, అంతర్జాతీయ మార్కెట్లో ప్రసిద్ధి చెందాయి. ఈ గాజుల తయారీ క్లిష్టమైన ప్రక్రియ. రెసిన్‌ను కొలిమిపై కరిగిస్తే లక్క వస్తుంది. దీన్ని వృత్తాకారంలో మలిచి.. దానిపై స్ఫటికాలు, రాళ్లు, పూసలు, అద్దాలను హస్తకళాకారులు అందంగా చేతులతోనే పొదుగుతారు. కాలక్రమంలో వీటి డిజైన్లలో ఎన్నో మార్పులొచ్చాయి. మొగలుల కాలంలో ఈ కళ ఉద్భవించిందని చెబుతారు. రాజకుటుంబాల్లోని మహిళలు ఈ గాజులు ధరించేవారు. ఇప్పుడు వేడుకల్లో వీటిని ధరించడానికి మహిళలు ఇష్టపడుతున్నారు.

లాడ్ బజార్‌లో మాత్రమే దొరికే లక్క గాజులకు GI గుర్తింపు కోసం 2022లో క్రిసెంట్ హ్యాండీక్రాఫ్ట్స్ ఆర్టిజన్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ దరఖాస్తు చేసింది. తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖ సహాయ సహకారాలు అందించింది. 18 నెలల పరిశీలన అనంతరం GI Tag మంజూరైంది. త్వరలోనే ధ్రువీకరణ పత్రం రానుంది. "లాక్ గాజుల తయారీలో 6 వేల కుటుంబాలు పాలు పంచుకుంటున్నాయి. GI Tag.. వీరందరికీ గుర్తింపు, గౌరవాన్ని తీసుకొస్తుంది. మంచి డిజైన్‌లను రూపొందించడానికి, కొత్తవి తయారు చేసేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. మార్కెట్లో గాజులకు డిమాండ్‌తో పాటు అమ్మకాలు పెరిగి హస్తకళాకారుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది" అని ఆర్టిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ హిసాముద్దీన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

– కె. సచిన్, m : 8686664949
e: desk.deccan@gmail.com



## KHAJURAHO MONUMENT

# ఖజురహో కట్టడాలు

**ఉనికి:** మధ్యప్రదేశ్ **UNESCO SITE - 1986**

**గుర్తింపు:** 1986

**విభాగం:** సాంస్కృతికం (**MOUNUMENT**)

ఖజురహోలోని దేవాలయాలు చందేలా రాజవంశం పాలనలో నిర్మించబడ్డాయి. అవి మూడు విభిన్న సమూహాలుగా విభజించబడ్డాయి. ఇవి రెండు వేర్వేరు మతాలకు చెందినవి. ఒకటి హిందూ మతం, మరొ కటి జైన మతం. వాస్తుశిల్పం, శిల్పకళల మధ్య సంపూర్ణ సమతుల్యతతో, అన్ని ఆలయ ఉపరితలాలు బాగా చెక్కబడ్డాయి. ఆరాధనలు, వంశం, చిన్నచిన్న దేవతలు, సన్నిహిత జంటలను చెక్కారు. ఇవన్నీ పవిత్ర విశ్వాస వ్యవస్థను ప్రతిబింబిస్తాయి. అత్యంత నిపుణులైన శిల్పులు సాధించిన కూర్పు, వారి నైపుణ్యం ఖజురహో దేవాలయాల రాతి ఉపరితలాలకు అరుదైన చైతన్యాన్ని అందించింది. మానవ భావోద్వేగాల వెచ్చదనానికి సున్నితత్వాన్ని అందించింది.



**ప్రాధాన్యం: (1) (ii)**

(1): ఖజురహో సముదాయం ఒక ప్రత్యేకమైన కళాత్మక సృష్టిని సూచిస్తుంది. దాని అత్యంత వాస్తవిక ఆర్కిటెక్చర్, అధిక నాణ్యమైన శిల్పాలు, అనేక పవిత్రమైన భావనలు లేదా దూషణ వివరణలకు తావిచ్చిన అనేక దృశ్యాలతో రూపొందించబడ్డాయి.

(ii): సామాన్య శకం పదమూడవ శతాబ్దం ప్రారంభంలో ఢిల్లీ సుల్తానేట్ స్థాపనకు ముందు మధ్య భారతదేశంలో అభివృద్ధి చెందిన చందేలా సంస్కృతికి ఈ దేవాలయాలు అసాధారణ సాక్ష్యాన్ని ఇస్తున్నాయి.

ఖజురహో దేవాలయాలు సామాన్య శకం తొమ్మిదవ శతాబ్దం నుండి పదమూడవ శతాబ్దం వరకు మధ్య భారతదేశాన్ని పాలించిన శక్తివంతమైన చందేల రాజులచే నిర్మించబడినట్లుగా చెబుతారు. వారి పాలన అనేక కోటలు, రాజభవనాలు, దేవాలయాలు, చెరువుల నిర్మాణానికి ప్రసిద్ధి చెందింది. వారి రాజధాని నగరం ఖజురహోలో, చుట్టుపక్కల దాదాపు ఎనభై-ఐదు దేవాలయాల నిర్మాణానికి వారి పాలన ప్రఖ్యాతి చెందింది. వాటిలో ఇరవై ఐదు మాత్రమే నేటికి మనుగడలో ఉన్నాయి. చందేలా రాజులు నిర్మించిన చాలా దేవాలయాలు పదవ శతాబ్దం నుండి ఈ ప్రాంతంలో హిందూమతం పునరుజ్జీవనానికి సంబంధించినవి. నగర (ఉత్తర భారత దేవాలయ)



నిర్మాణ శైలి వారి కాలంలో అత్యున్నత స్థాయికి చేరుకుంది.

ఖజురహో దేవాలయాలు – పశ్చిమ, తూర్పు, దక్షిణ అనే మూడు ప్రధాన సమూహాలుగా ఉన్నాయి. వీటిలో, ఒక పెద్ద జలాశయానికి ఆనుకుని ఉన్న పశ్చిమ దేవాలయాల సమూహంలో లక్ష్మణ, కందారియ మహాదేవ, విశ్వనాథ, చిత్రగుప్త దేవాలయాలు వంటి అత్యంత ప్రసిద్ధ ఆలయాలు ఉన్నాయి. తూర్పు సమూహంలో వామన, జవరి, ఆదినాథ దేవాలయాలు ఉన్నాయి. దక్షిణ సమూహంలో ప్రసిద్ధ దులాదియో, చతుర్భుజ ఆలయాలు ఉన్నాయి.




**World Heritage Series:** ఖజురహో రచయిత కృష్ణ దేవ కథనం ప్రకారం, సమిష్టిగా ఈ ఆలయాలు "విశిష్టమైన, ఏకీకృత నిర్మాణ కార్యక్రమ వ్యక్తీకరణలు. వివరాలలో మాత్రమే విభిన్నంగా ఉంటాయి". ఈ దేవాలయాలు "ప్రణాళిక మరియు ఎత్తులో కొన్ని ప్రత్యేకతలను కలిగి ఉన్న మధ్య-భారతీయ నిర్మాణ శైలికి పరాకాష్టను సూచిస్తాయి".

మూడు సమూహాలలో చాలా దేవాలయాలు ప్రణాళిక, ఎత్తులో క్రమానుగత పురోగతిని కలిగి ఉంటాయి. ఎత్తైన పునాదిపై నిర్మించబడిన ఈ ఆలయాలు ఒక చిన్న వాకిలి ద్వారా ఆవరణల పురోగతితో ఉంటాయి. అర్ధ మండపం నుండి మహా మండపం (Grand Pevilion) (పెద్ద దేవాలయాలలో మాత్రమే) అంతరాలయం, చివరకు, గర్భగుడి ఉంటాయి. ఆలయాల ఎత్తులో సంబంధిత పురోగతిని గమనించవచ్చు, ఇందులో శిక్కార రూపురేఖలలో ఆరోహణ క్రమం స్పష్టంగా వ్యక్తీకరించబడుతోంది. ఈ ఆలయాల శిఖరాలు బహుళ అంచెలు, అందమైన Caseading Profileను కలిగి ఉంటాయి. సూక్ష్మ శిఖరాలు ప్రధాన శిఖరాన్ని క్రమంగా తగ్గుతున్న ఆకృతితో అలంకరిస్తాయి. దేవాలయాల గోడలు, ఇతర ప్రాంతాల దేవాలయాల వలె కాకుండా, పెద్ద బాల్కనీలను కలిగిఉంటాయి.

ఖజురహో దేవాలయాల ముఖ్య లక్షణం వాటి ఎలివేషన్ లలో శిల్పాలు అధికంగా ఉండటం. వీటిలో కల్ట్ చిత్రాలు, దేవుళ్లు, వారి కుటుంబాలు, అప్సరసలు, సురసుందరి లాంటివి ఉంటాయి. సన్యాసులు వంటి లౌకిక ఇతివృత్తాలు గురు శిష్య సంప్రదాయం. నృత్యకారులు, సంగీతకారులు, శృంగార జంటలు లేదా సమూహాలు. పౌరాణిక వ్యాలాలు (రెండు జంతువుల లక్షణాలను కలపడం). దేవతలు లాంటి విగ్రహాలన్నీ కూడా కచ్చితమైన నియమానుగుణ నిష్పత్తులు, భంగిమలకు అనుగుణంగా ఉంటాయి. నిర్మాణ, కళ చారిత్రక దృక్కోణాల నుండి చూస్తే ఖజురహో అనేది భారతీయ ఆలయ వాస్తుశిల్ప సారాంశం అని విశ్వసిస్తారు.

కందారియా మహాదేవ ఆలయం ఉత్తర భారతదేశంలోని ఆలయ నిర్మాణ శైలికి అత్యుత్తమ, అత్యంత అభివృద్ధి చెందిన ఉదాహరణగా పరిగణించబడుతుంది. దీని ప్రధాన శిఖరం ఎనభై-నాలుగు సూక్ష్మ శిఖరాల లయబద్ధమైన ఆరోహణను కలిగి ఉంది, అది బలమైన దృశ్య వ్యక్తీకరణను ఇస్తుంది. ఈ ఆలయం వెలుపలి, లోపలి గోడలు, స్తంభాలు, పైకప్పులు శిల్పకళా సంపద పరంగా అత్యంతగా అలంకరించ బడ్డాయి. ASI ఈ సైట్ పరిరక్షణ, Land Scapingపై బాగా పనిచేసింది.

– జాన్విజ్ శర్మ
Janhwij Sharma
అనువాదం : ఎస్. వంశీ



కోట ద్వారాలు

# రామగిరి కథ

తెలంగాణ రాష్ట్రం పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలంలోని బేగంపేట గ్రామానికి దగ్గరగా రామగిరిఖిల్లాగా పిలువబడేదే రామగిరి దుర్గం. ఈ కోట రామగిరి గుట్టలమీద నిర్మాణమైంది. వనౌషధులకు ప్రసిద్ధమైన దట్టమైన అడవి విస్తరించిన ప్రదేశంలోనే దుర్గం కట్టబడ్డది. వివిధ మూలికాజాతులకు చెందిన మొక్కలతో సంపన్నమైంది. ఈ కోట నుంచి చూస్తే మానేరు, గోదావరి నదుల సంగమం కనిపిస్తుంది. రామగిరిని తరుచుగా రత్నగిరి, రత్నగర్భ అంటుంటారు.

**రామగిరి భౌగోళిక స్థితి:**

రామగిరి కొండ భౌగోళికంగా 790025-790028 డిగ్రీల తూర్పు రేఖాంశాలు, 180034-180038 డిగ్రీల ఉత్తర అక్షాంశాల మధ్య, సముద్ర మట్టానికి 679మీ.ల ఎత్తున నెలకొని వుంది. కొండ ఉపరితలం 40 చ.కి.మీ.లు విస్తరించి వుంది. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు 250 కి.మీ.ల దూరంలో, పెద్దపల్లి జిల్లా కేంద్రానికి 22 కి.మీ.ల దూరంలో రామగిరి ఖిల్లా వుంది. పెద్దపల్లి, మంథని రహదారిలో ఉన్న బేగంపేటకు 2కి.మీ.ల చేరువలో ఉంది.



రామగిరి ఖిల్లా

**రామగిర్యాయణం:**

రామాయణంలోని అరణ్యకాండలో అగస్త్యాశ్రమానికి వెళ్ళిన రామునికి పంచవటి వైపు వెళ్ళమని వర్ణించి చెప్పిన భౌగోళిక వర్ణన రామగిరికి సరిపోతుందని వాదించే వారున్నారు. సీతారామ లక్ష్మణులు ఒక తాటివనం దాటి, ఉత్తరదిశగా ఒక పర్వతోపరితలం మీద నడిచారు. రాముడు నడిచిన ఆ కొండ ఇదే. కనుక రామగిరి అయిందట.

కొండమీదున్న ఒక దిగుడుబావిలో సీతమ్మ స్నానమాడిందని, అందువల్ల దానిని సీతమ్మగుండం అని పిలుస్తారు స్థానికులు. ఆ పక్కన రెండు శివలింగాలున్నాయి. వాటిని సీతారాములే ప్రతిష్ఠించారని ప్రచారం. అక్కడే పసుపు, కుంకుమల గుంట లున్నాయి.

రామగిరి కొండకొనన ఉన్న గుహలజంట ఒకదానిలో సీతారామలక్ష్మణ, భరత, శతృఘ్ను, ఆంజనేయ శిల్పాలున్నాయి. భరతుడిక్కడ నుంచే రాముని పాదుకలు తీసుకుని అయోధ్యకు వెళ్ళాడని భక్తుల విశ్వాసం.

**ఏ రామగిరి....?**

'మేఘ సందేశం'లో మహాకవి కాళిదాసు

"యక్షశ్చక్రే జనకతనయా స్నానపుణ్యోదకమేషు

స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతి 'రామగిర్యా'శ్రమేషు" అని ప్రస్తావించిన రామగిరి ఇదేనని కొందరు పండితుల అభిప్రాయం. కాళిదాసు 5వ శతాబ్దం వాడు. అంటే తెలంగాణలో విష్ణు కుండినులు, వాకాటకుల పాలనాకాలం. ఇక్కడ విష్ణుకుండినుల నిర్మాణాలు ఉండెనో, లేదో పరిశోధించాల్సిన విషయం.

కాని, ఐ.కె.శర్మ అనే పురాతత్వవేత్త మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగపూర్‌కు 36కి.మీ.ల దూరంలోనున్న మానసార రామగిరి (ఆశ్రమాని)కి 5కి.మీ.ల దూరంలో ఉందని రాసాడు. కాళిదాసు 'మేఘసందేశం'లో యక్షుడు ఖైదీగా ఉన్న రామగిరి కొండ ఇది కాదని, కాళిదాసు వాకాటక రాకుమారునికి గురువుగా చాలాకాలం రామ్ టెక్ దగ్గరలోని రామగిరిలోనే ఉండేవాడని చరిత్రకారులు వివరించారు. కనుక 'మేఘసందేశం'లోని రామగిరి మన రామగిరి కాదనుకుంట.

**రామగిరి మీద చరిత్రపూర్వయుగం జాడలు:**

తెలంగాణాలో చరిత్రపూర్వయుగం, తొలి చారిత్రకదశలు, చారిత్రక యుగం చరిత్ర-సంస్కృతులను అధ్యయనం చేయడానికి రామగిరి ఒక మచ్చుతునక.



*గండభేరుండం*



*గజం, సింహం*



*గోవర్ధనగిరిధారి*

రామగిరిఖిల్లా ఎక్కడం మొదలుపెట్టి మొదటిదర్వాజకు చేరుకోగానే విరిగిన దర్వాజ, మొండికోట, విరిగిన ద్వారానికి కుడిపక్కన క్రీ.శ. 1478సం. నాటి తుమ్మీఖాన్ 10వేల రూకలు ఖర్చుపెట్టి చేయించిన కోటదర్వాజ శాసనం వుంది. దర్వాజ నుంచి ఎడమ వైపుకు గొల్లభామల దిక్కు పోతే పెండ్లిబావి. బాయి దాటినంక 100మీ.ల దూరంలోని చిన్నగుహలో లింగం లేని పానవట్టం వుంది. ఈ గుహలోనే ఎరుపురంగులో వేసిన రాతిచిత్రాలు అగుపిస్తాయి.

ఈ రాతిచిత్రాలలో ఒక మనిషి, ఒక ఎద్దు, గుర్తించడానికి వీలుకాని జంతువుల బొమ్మలు రెండు, మరొక మనిషిబొమ్మ అగుపిస్తున్నాయి. బొద్దుగీతలలో వున్న ఈ రాతిచిత్రాలు శైలిని బట్టి, వస్తువును బట్టి చాల్కోలిథిక్ పీరియడ్ కు చెందినవని చెప్పవచ్చు. కొత్తరాతియుగం నుంచి పెదరాతియుగానికి పరిణమించే సమయంలోని మానవసంస్కృతి ప్రతిబింబాలనవచ్చు. నేటికి 4,5 వేల సంవత్సరాలకు పూర్వానివి ఈ రాతిచిత్రాలు.

ఈ గుహకు అవతలివైపు గుహలో పదునైనమొన వున్న పరికరంతో గీరి గీసిన 'తొక్కుడు బొమ్మలు' (పెట్రోగ్లైఫ్స్) వున్నాయి. ఈ బొమ్మలలో ఎడమచేత త్రిశూలం ధరించిన నిలబడ్డ వేటగాడు, పక్కన పెద్దపక్షి అగుపించాయి. ఈ చిత్రాలు మధ్యరాతియుగం కాలానికి పూర్వాచెందినవి. ఠాకూర్ రాజారాం సింగ్ నర్రవెషాల పల్లెలో ఇటువంటి పెట్రోగ్లైఫ్స్‌ను చూసి, వాటిని పాతరాతియుగం చివరిదశకు చెందినవని రాసాడు. పోలికలతో ఈ రామగిరి పెట్రోగ్లైఫ్స్ కూడా మధ్యరాతియుగం నాటి చిత్రాలని చెప్పవచ్చు. రామగిరి కొండ మీద తెలంగాణ పురావస్తు పరిశోధకుడు ఠాకూర్ రాజారాం సింగ్ పురామానవుని (మైక్రోలిథ్స్) మధ్యరాతియుగపు సూక్ష్మరాతి పనిముట్లను దోసిళ్ళకొద్దీ సేకరించాడు. అపుడు తనవెంట తనజంట పరిశోధకుడు రాజారాం శర్మ, ఆర్కియాలజీ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ వివి కృష్ణశాస్త్రి వున్నారు.

అక్కడికి 10మీ.ల దూరంలోనే పెదరాతియుగానికి చెందిన రాళ్ళకుప్ప సమాధులు 36వున్నాయి. ఇవన్నీ రాతినేలమీదనే రాతికుప్పలతో ఏర్పరచిన సమాధులు. చాలా అరుదైనవి. వీటిలో మొదటి వరుసలో 6వ సమాధి దాటగానే పడిపోయిన మెన్హర్ కనిపిస్తుంది. మిగతాచోట్ల సమాధుల అంచుల్లో రాళ్ళపేర్పుతో నిలిపిన రాతి స్తంభాల వంటి మెన్హర్లు ప్రతి సమాధికి కనిపిస్తాయి. ఈ సమాధులలో కొన్నింటిలో ఎముకలు దొరికాయి. ఆ పరిసరాల్లో ఇనుము చిట్టేలు, బండలపై రాతిబొద్దులు (కప్ మార్క్స్), కుండ పెంకులు విరివిగా కనిపిస్తున్నాయి.

ఇక్కడ లభిస్తున్న ప్రకృతి సిద్ధమైన సహజవనరులైన నీటివూటలు, నీటి వనరులు, గుహలు, ఆహారానికి అవసరమైన జంతువులు, చెట్లు చేమలుండడం వల్ల వేల సంవత్సరాలుగా ఆదిమానవులిక్కడ నివాసమున్నారని చెప్పవచ్చు. రామగిరిఖిల్లా మీద చరిత్రపూర్వయుగ సంస్కృతి ఆనవాళ్ళు వెతికిన కొద్ది లభిస్తాయి. అన్వేషణ కొనసాగిస్తే ఇంకా చారిత్రకాధారాలు తప్పక లభిస్తాయి.

వాటిని దాటిపోతే గొల్లభామలు, సూటిగా పోతే నందిముక్కు, దానికి ఎడమవైపు నడిస్తే పాండవలొంకకు చేరుకుంటాం. అక్కడ 2 దిగుడు బావులు, 1 చేదబావి వున్నాయి. ఆ పక్కన నివాసాల శిథిలాలు కనిపిస్తాయి.

**చరిత్రలో రామగిరి:**

రామగిరి చరిత్ర మొదటి శతాబ్దం నుంచి మొదలవుతుందంటారు. ఈ రామగిరి దుర్గాన్ని 'వజ్రకూటమి' అని కూడా అన్నారు. కొంతమంది చరిత్రకారులు ఈ కోటను చంద్రగుప్త, బిందుసార, అశోకచక్రవర్తి వంటి మౌర్యపాలకులు అభివృద్ధిపరిచి వుంటారంటారు. సాతవాహన చక్రవర్తులైన గౌతమీపుత్రశ్రీ సాతకర్ణి, పులోమావి ఈ ప్రాంతాన్ని పాలించారు. రామగిరి దుర్గానికి 50కి.మీ.ల దూరంగా వాయవ్యదిశలో సాతవాహనుల రాజధాని కోటిలింగాల కోట వుంది.

వేములవాడనేలిన చాళుక్యులలో వినయాదిత్యుడు (సా.శ.750–755) ఈ కోటను వశపరచుకున్నాడని చరిత్రకారుల కథనాలున్నాయి. చరిత్రకారులు ఊహచేసినట్లు రామగిరి పొలవాస రాజ్యానికి రాజధానిగా ఉన్నట్టు ఆధారాలు దొరకలేదు. లభించిన శాసనాలు, దేవాలయ నిర్మాణాల ఆధారంగా పొలవాసరాజులు పొలవాసనే రాజధాని చేసుకున్నారని చెప్పాలె.


12వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన కోటగా రామగిరి ఖిల్లా ప్రసిద్ధం. కాని, కాకతీయుల సామ్రాజ్యంలో భాగమైన రామగిరిఖిల్లా మీద నిర్మాణాలలో వారిశైలి కనిపించడం లేదు. వారి సామంతులు చేసిన కట్టడాలుండ వచ్చు. కాకతీయులు చాళుక్య సామంతులుగా ఉన్నపుడే కాకతి రుద్రదేవుడు తిరుగుబాటు దారులైన మరో చాళుక్య సామంతరాజు గుండరాజును యుద్ధంలో వధించాడు. (సా.శ.1158లో కోటను వశపరచుకున్నాడు.) సా.శ.1323లో కాకతీయుల పతనానంతరం, ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ జయంతో రామగిరికోట కూడా వారిపాలనలో భాగం అయ్యింది. తర్వాత ముసునూరు నాయకులు ప్రోలయ, కాపయల ఏలుబడికాలంలో ఉన్నది రామగిరి. సా.శ. 1368లో రాచకొండ వెలమలు రామగిరిని



*మెగాలిథిక్ సమాధి*



*రాతిచిత్రాలు (1)*



*రాతిచిత్రాలు (2)*

స్వాధీనం చేసుకుని పరిపాలించారంటారు. సా.శ. 1425–1433 మధ్య రాచకొండ ప్రభువు సింగమను ఓడించి బహమనీ సుల్తాన్ అహ్మద్ షా రామగిరిని ఆక్రమించాడు. సా.శ. 1457వరకు పాలకులుగా బహమనీలున్నారు. సా.శ.1518 నుంచి 1687వరకు కుతుబ్షాహీల ఏలుబడిలో ఉంది రామగిరి.

ఈ కోట అప్పటి మొగలుల దక్కన్ సుబా గవర్నర్ ఔరంగజేబు కొడుకులలో ఒకరు, అబ్దుల్లా కుతుబ్షా పెద్దబిడ్డ భర్త, అల్లుడైన మహమ్మద్ సుల్తాన్ కు కట్నంగా ఇవ్వబడ్డది. రామగిరిలో 1656 ఏప్రిల్ 6న ఈ పెండ్లి జరిగిన స్థలంలోనే 'పెండ్లిబావి' అనే దిగుడు బావి ఉంది. సా.శ.1597 నుంచి మొగలుల పాలనలో ఉండేది ఈ దుర్గమని చరిత్రకారుల రాతలు. సా.శ.1606లో గోల్కొండ నవాబులు ఈ కొండమీద కోటను ఆక్రమించారు. నిజాంరాజుల దాక ఈ దుర్గం ముస్లింల పాలకుల చేతిలోనే వుంది. సా.శ. 1791 నుంచి బ్రిటిష్ వారి పాలనలోనికి వచ్చింది ఈ దుర్గం. బీరార్ సుల్తాన్ గోల్కొండ సుల్తానుల మధ్య జరిగిన యుద్ధంలో కులీ కుతుబ్షా రామగిరికోటమీద ఫిరంగిని పేల్చాడంటారు.

ముసునూరి నాయకుడైన కాపయ సర్వాధికారాలతో ముప్పయనాయకుణ్ణి రామగిరి మండలాధిపతిని చేసాడు. కేసన, కందనామాత్యులను మంత్రులుగా ఏర్పరిచాడు. ఈ ముప్పయ నాయకుడు మడికి సింగన రచనలో

'కూనయ ముప్పన్నపాలక/సూను, శ్రీ తెలుగున్నపతి సుదతీ మల్లాం/బానందనుడగు ముప్పయ/భూనాథుని సుకవివరుడ బుధసన్నుతుడన్' అని పేర్కొనబడ్డాడు.

సా.శ. 1552 ప్రాంతంలో గోలకొండ ఇబ్రహీమ్ కుతుబ్షా ఏలుబడిలో ఎరబాటి నారాయణ్ గారు గోల్కొండలో ముఖ్యోద్యోగి. సుల్తానుచేత రామగిరి దుర్గ పాలనాధికారం పొందినాడు. అతని కొడుకు ఆపో నారాయణ్, వారి కొడుకులు నారోజి, లింగోజిలు పాలకులైనారు.

రామగిరికోట 2వ ద్వారానికి కుడిభాగంలో చెక్కివున్న శాసనం తెలుగులోనే వుంది. కాని, దానిలో తేదీ తెలియడం లేదు. '148వి........./బ. 12 బుధవా..../ రిద్బురిం మీ భాండ/ రింకిటి దరువాజ కటించి/గ్నా పదివేలు యొండురాజు/ లవలెను...ఇమారాంతుపా.../ ......................../ దు................'. ఈ శాసనం 1479 శకానికి సరియగు 1557 నాటికి ఇబ్రహీం కుతుబ్షాహీ కాలం అవుతున్నది.

### రామగిరికోటలో.... ఏముంది?

తెలంగాణాలోని కోటలన్నింటిలో రామగిరి విస్తీర్ణతలో, కోటనిర్మాణంలో, ఎత్తులో పెద్దది.

పెద్ద, పెద్ద కోటగోడలు, ప్రాకారాలు, బురుజులు, భవనాలు, మసీదులు అగుపిస్తాయి. కోటలోపల చిత్రకోట, తాటికోట, నిమ్మకోట, సోలుకోట, సింహాలకోట, జంగ్లికోట, మహదేవునికోటలు, కొలువుశాల, మొగలుశాల, సభావేదికలు, భజనశాల, చెరసాల, గజశాల, రహస్యమడిగెలు, సొరంగాలు, నగార్ ఖానా, మందుకోట, తోపులు, తోపుగుండ్లు, చెప్పుల గది, గోరీలు, సమాధులు అని పిలిచే ప్రదేశాలు, దోపుబావి, నల్లకయ్య బావి, పసరు బావి, ఘోడెబావి, హరి బావి, చక్కెర బావి, అచ్చమ్మ బావి, అమ్మగారి బావి అనే బావులు, దేవస్థలాలు, సప్తద్వారాలు, చౌకీలు, సింహద్వారం, బృందావనం, గణపత్ర వనం, మల్లెవనాలు మొదలైనవాటితో మైళ్ళకొద్ది వైశాల్యంతో ఒప్పారుతున్నది రామగిరి దుర్గం. కోటలో అంత శిల్పనైపుణ్యం కనబడదు కాని, ఒకవైపు గోదావరి, 3వైపులా దట్టమైన అడవులు కనిపిస్తాయి.

'ఈ దుర్గమునే రాజు నిర్మించెనో యే రాజు పాలించెనో, యిది యే కాలమునాటిదో యూహకందనందున పలువురు పలువిధముల భావించి, పలువిధముల నూహించుట జరుగుతున్నది' అని యరబాటి బాపురావు రాసాడు.

రామగిరి ఖిల్లా పైన గోల్కొండ కోట కంటే విశాలమైన స్థలం వుంటుంది. కోట ఎక్కడానికి చెక్కిన మెట్లు మనుషులకే కాదు గుర్రాలు, ఏనుగులు పైకి ఎక్కడానికి అనువుగా చెక్కినవి అంటారు పరిశీలకులు. మొత్తం ఏడు ద్వారాలున్నాయి.

మొదటి కోట ప్రధానద్వారం ఫతేదర్వాజా దాటి ఇంకా 5 కోటగుమ్మాలు పైకి వెళ్ళాలి. మూడు ప్రాకారాలున్న కోట. రక్షణ కొరకు పటిష్టంగా కట్టిన ఈ కోటగోడలు 120 అడుగుల ఎత్తుంటాయంటారు. రాతితో కట్టిన ఈ కోటకు రక్షణవ్యూహపరంగా 20కంటే ఎక్కువ బురుజులున్నాయి. కోటలో నాలుగు పోతపోసిన ఉక్కు ఫిరంగులున్నాయి. 12మీ.ల ఎత్తున కట్టిన వేదికల మీద అమర్చివున్నాయి ఈ తోపులు. బురద, సున్నం, కొమ్ములు, జంతువుల వెంట్రుకలు, జంతువుల రక్తంతో చేసిన పూతతో కట్టబడ్డాయంటారు పరిశీలకులు.

### రామగిరి పూర్వనగరం (పాటిగడ్డ):


యరబాటి బాపురావు రామగిరి చరిత్రలో రాసినదానినిబట్టి రామగిరికొండకు ఉత్తరాన బేగంపేట శివారులో పాతనగరముండే దనడానికి ఆధారాలుగా లభిస్తున్న గుర్తులనేకం. ఇప్పటికి రికార్డుల్లో



యుద్ధగజం



రామగిరి - రామాలయంలో



శాసనం

ఈ ప్రదేశానికి రామగిరి అనే పేరున్నది. బేచిరాగ్ గ్రామం కావచ్చు. అపుడపుడిక్కడ రామటంకాలనే నాణాలు దొరుకుతుంటాయని అక్కడి ప్రజలు చెప్పుకుంటారు. బాపురావుగారు ఇక్కడికి సమీపగ్రామాలన్ని రామగిరి వాడలే అంటారు.

అప్పుడు కరణీకంచేసిన నియోగులు బేగంపేట గ్రామంలో ఉన్నారు. వారు అపుడపుడు మంత్రి పదవులు నిర్వహించేవారని చెప్పుకుంటారు. రామావఝుల అనే ఇంటిపేరున్నవారు అప్పటి రాచకొలువులోని వారేనని బాపురావుగారి నమ్మకం.

**గిరిదుర్గంలో వనసంపద:**

మంథని అటవీశాఖపరిధికి సంబంధించిన తూర్పు డివిజన్‌లో మైదంబండ, కుందారం, లక్కారం, పెద్దపల్లి, సబ్బితం, కల్వచెర్ల, మారేడుగొండ అనే 7 ఫారెస్టుబీట్స్‌ల లోపల ఉంది. రామగిరిమీద లభించే 150 రకాల వనౌషధులు గుర్తించబడ్డాయి. రామగిరిని 'వైద్య వనౌషధి కేంద్రం'గా చేయాలి

**రామగిరిపై దేవాలయాలు:**

రామగిరిలో గణపతి, అనేక శివలింగాలు అగుపిస్తాయి. ముప్పయనాయకుని మంత్రి కేసన రామగిరిలో కేశవాలయాన్ని కట్టించినాడని చెప్పడానికి 'సకల నీతి సమ్మత'మనే పుస్తకంలో చెప్పబడ్డది.

**రామగిరి కోట శిల్పాలు-విశేషాలు:**

రామగిరికోటలోని ఒక ద్వారానికి పక్కగా కనిపించే గండభేరుండ శిల్పం. ద్విముఖాలతో, పెద్ద రెక్కలతో, వాడియైన గోర్లతోఉన్న కాళ్ళతో సింహాలను, ఏనుగులను ఎత్తుకుని ఎగిరే రూపంలో దీనిని చెక్కారు. ఈ వైష్ణవ చిహ్నం. గండభేరుండను తమ రాజ్య చిహ్నంగా స్వీకరించిన రాజులు తమ కోటద్వారాలకు, దేవాలయాలలో అరిగజాలను (శత్రు రాజులను), అరిగజకేసరులను (వారిని అణిచి వేసిన వారిని) కాళ్ళతో తన్నుకునిపోయే అపరిమిత శక్తిశాలులం తామేనన్నట్లు గండభేరుండను చెక్కించారు. గండభేరుండం ఒక పౌరాణికమైన జంతువు. విష్ణువు నరసింహావతారాన్ని అణిచివేసిన శరభేశ్వరుడనే శివావతారాన్ని గెలువడానికి వైష్ణవమతంలో రూపొందిన వింత పక్షి. శైవ, వైష్ణవాల ఆధిక్యతల పోటీలో పుట్టిన వారే శరభేశ్వర, గండభేరుండాలు. గ్రద్ద వంటితల, రెక్కలు, సింహంవంటి శరీరంతో గండభేరుండ శిల్పాలు, చిత్రాలుంటాయి. గండభేరుండం ప్రస్తుత కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రచిహ్నం. వడయార్ రాజుల రాజచిహ్నం. అచ్యుత రాయలు వేయించిన నాణేలమీద గండభేరుండం బొమ్మ వుంటుంది. కౌలాస్ కోట ద్వారం మీద ఉన్నది. సంకీస రామాలయం గోడల మీద ఉంది.

కోట ద్వారానికి పైన పుష్పాలు, చేప, తాబేలు, రెండు హంసలు, సింహాలను కాళ్ళతో తన్నుకు పోతున్న గజం, ఏనుగులను నాలుగుకాళ్ళతో అణిచేస్తున్న సింహం శిల్పాలు జంతు పరిణామాలను, జలచర, భూచరాలనో చూపడం లేదు. వైష్ణవాల యాలలో చేప, తాబేలు కనిపిస్తాయి. హంసలు అలంకారాలు. ఈ ఏనుగు, సింహాలు గండభేరుండానికి బలైపోయే అరిగజాలు, అరిగజకేసరులు.

కొండచిలువను తొక్కివేస్తున్నట్టుగా ఈ ఏనుగు శిల్పం. రాజదర్పాన్ని సూచించేదే. ఘీంకరిస్తున్న యుద్ధగజం. మరో రెండు యుద్ధగజాలు, ద్వారం పక్కన చెక్కిన అలంకారంగా కాకతీయ శైలి హంస, గోపికలు, గోవులు, గోపాలురతో గోవర్ధనగిరిధారి అర్ధ శిల్పాలు, వేణుగోపాలుడు గొల్లభామలతో, శేషఫణఛత్రం కింద మహావిష్ణువు, లక్ష్మి కింద పన్నిద్దరాళ్వారులు... అక్కడే ఇంకా పరిష్కరింపబడని తెలుగు శాసనం ఉన్నాయి.

రామగిరి రామాలయంలో సీతా రామ లక్ష్మణ భరత శత్రుఘ్న, హనుమంతులున్నారు. ఇంకా కోటలో పిల్లల ఫిరంగి, పాడువడ్డ రాజమహల్, రక్షణ బురుజులు కనిపిస్తాయి.

**ఆధారాలు:**

1. కే.శే.యరబాటి బాపురావు-రామగిరి చరిత్ర-1982, రామగిరి దేవాలయనిర్మాణ ధర్మకర్త సంఘం మరియు దాతలు ప్రచురణ

2. రామగిరిఖిల్లాకు అన్నితొవ్వలు తెలిసిన చరిత్రకారుడు, మార్గదర్శి (గైడ్) సముద్రాల సునీల్ అన్వేషణలు- చరిత్ర పూర్వయుగపు ఆధారాలు

3. మహేంద్ర, సినీ దర్శకులు (దొరసాని ఫేం), రామగిరి డాక్యుమెంటరీ ఫిల్మ్, ఫోటోల సౌజన్యంతో

4. INTERNATIONAL JOURNAL OF PHARMACY & LIFE SCIENCES -(Int. J. of Pharm. Life Sci.) Enumeration of Medicinal Plants of Ramagiri-Khilla Forests of Karimnagar District, Telangana, India- E. Narasimha Murthy* and N. Venu Madhav, Department of Botany, Satavahana University, Karimnagar, (Telangana) - India.

- శ్రీరామోజు హరగోపాల్,

m : 99494 98698


e: akshara25@gmail.com

# కొల్లేటి జాడలు నవల – పర్యావరణ వివేచన

"If all mankind were to disappear, the world would regenerate back to the rich state of equilibrium that existed ten thousand years ago. If insects were to vanish, the environment would collapse into chaos."

*- E. O. Wilson,*

మానవ జాతి అంతా కనుమరుగైతే, ఈ ప్రపంచం పదివేలయేళ్లనాటి సమతుల్యతతో గొప్ప పునరుజ్జీవనం పొందుతుంది. కీటక జాతులు నాశనమైతే, పర్యావరణమంతా సంకటస్థితిలోకి కుంగిపోతుంది–జీవావరణ శాస్త్రం, జీవ వైవిధ్యంపై పరిశోధనలు చేసిన ప్రముఖ అమెరికన్ జీవ శాస్త్రవేత్త ఎడ్వర్డ్ ఓ విల్సన్ అన్న ఈ మాటలు, ఈ సర్వ ప్రకృతిలో మిగిలిన జీవకోటితో పోల్చుకుంటే, మానవుని ఉనికికి ఉన్న విలువ శూన్యమని, ఒక చిన్న కీటకమంత కూడా కాదని తెలుస్తుంది. మనం భూమికి చెందిన వాళ్ళమే కానీ భూమి మనకి చెందినది కాదు అన్న వాస్తవాన్ని గుర్తించని మనిషి చేస్తున్న తప్పిదాల వల్ల, అమానవీయ పెట్టుబడిదారీ విధానాల వల్ల, అత్యాశ వల్ల, కృతఘ్నత వల్ల పుడమితల్లిని గాయాల పాలుచేస్తున్నాడు మనిషి. ఈ భూగోళాన్ని ఆవరించి ఉన్న పరిసరాలలోని జీవనిర్జీవాలన్నింటినీ కలిపి పర్యావరణం అంటున్నాం. ఈ పరిసరాలలో ఉండే జీవులన్నిటికీ ప్రాణాధారమైన గాలి, నీరు, ఆహారం, వెలుతురు రోజువారీ కార్యకలాపాలను నిర్వహించడానికి అత్యంత ఆవశ్యకమైన అవసరాలు. ప్రకృతి ఏర్పరచిన ఆహార చక్రాన్ని అనుసరించి, ఇతర అవసరాలను అనుసరించి వాతావరణంలోని సకల జీవరాసులు ఒక దానిపై మరొకటి ఆధారపడి జీవిస్తాయి. జీవ పరిణామ క్రమంలో చివరగా వచ్చిన మానవ జాతి చర్యల వలన సమతౌల్యం లోపిస్తున్నదనే ప్రారంభవాక్యాలలో అనుకున్నది.




సుమారు 150 యేళ్ళ క్రితం నాటి ప్రాపంచిక పర్యావరణ దృక్పథ ఆవిర్భావం, 18వ శతాబ్ది నుండి 20వ శతాబ్దం వరకు దాని పరిణామ క్రమాన్ని గురించి ఒక ప్రామాణిక గ్రంథం రాసిన ప్రముఖ చరిత్రకారుడు, పర్యావరణవేత్త శ్రీ రామచంద్ర గుహ 'The Age of Ecological Innocence(1945–62)' అనే భాగంలో, రెండవ ప్రపంచయుద్ధానంతరం అభివృద్ధి కోసం తీసిన వెర్రి పరుగును పర్యావరణ స్పృహ యెరుక ప్రభావితం చేయలేక పోయిందంటాడు. అలాగే 'పాశ్చాత్య దేశాలలో పర్యావరణవాదం, ప్రధానంగా అంతరించిపోతున్న జీవ వైవిధ్యాన్ని, సహజ ఆవాసాలను రక్షించాలనే ఆలోచనతో ఎగువ మధ్య తరగతి, ఉన్నత వర్గాల నుండి వస్తే, మన దేశంలో, పేదవాడి మనుగడ చుట్టూ ఈ వాదం ఉన్నదని, ఇది పేదల పర్యావరణవాదమని, ఇదొక వైపు సుస్థిరతతో, మరోవైపు సామాజిక న్యాయం కోసమే జరిపే ఆందోళనతో జత కట్టింద'ని అంటాడు. ఈ వాస్తవాన్ని కొంచెం లోతుగా పరిశీలిస్తే, అడవుల నిర్మూలన, శిలాజ ఇంధనాలు కాల్చటం, గ్రీన్ హౌజ్ ఉద్గారాలు, అధికమోతాదులో రసాయనాలు నీటివనరులలోకి విచక్షణారహితంగా విడుదల చేయటం, రసాయన ఎరువుల వాడకం వంటి అనేక కారణాలవల్ల తీవ్రమైన వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని మనందరికీ తెలుసు. వీటి కారణంగా సముద్ర మట్టాలు పెరగడం, తరచుగా ప్రకృతి వైపరీత్యాలు రావటం, జంతు, వృక్ష జాతులు అంతరించిపోవడం వంటి ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. అయితే మొదట చెప్పుకున్న అడవుల నిర్మూలన వల్ల నష్టపోయేది అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు, అందుకే ఉత్తరాంచల్ అడవుల్లో నివసించే బిష్ణోయ్ తెగకు చెందిన గిరిజన మహిళలు అడవులను కాపాడుకోవడానికి చెట్లను ఆలింగనం చేసుకుని తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ఉద్యమించారు. అదే తర్వాతి కాలంలో చిప్కో ఉద్యమం అయింది. నర్మదా బచావో అంటూ బహుళార్థక సాధక ప్రాజెక్టుల నిర్మాణాల వలన నిర్వాసితులైన గిరిజనులు ఉద్యమం బాట పట్టారు. పరిశ్రమల నుండి వెలువడే విషపూరిత రసాయనాలు కలసిన నీటినే అన్ని అవసరాలకు వాడుకుంటున్న పేదలు...వీళ్ళందరిది జీవన పోరాటమే... అదే పర్యావరణవాదమైంది.

భూమి తల్లి పట్ల ప్రపంచం తన గౌరవాన్ని కోల్పోయింది, ఇది చాలా ప్రమాదకరమైన పరిణామం. కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్లు, అడవులను నేలకూల్చుతూ, జీవావరణాన్ని ధ్వంసం చేస్తూ, జీవనదుల్ని ఎడారులుగా మార్చుతూ పెట్టుబడిదారీ విధానం ద్వారా ఆర్థిక వృద్ధిని మాత్రమే అభిలషిస్తున్న మనిషి సామాజిక శ్రేయస్సును గురించి ఆలోచించకపోవటంతో పర్యావరణ విధ్వంసం మానవ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నది.

Sooner or later, we will have to recognize that the Earth has rights, too, to live without pollution. What mankind must know is that human beings cannot live without Mother Earth, but the planet can live without humans - అంటాడు దక్షిణ అమెరికా దేశమైన బొలీవియా అధ్యక్షుడిగా ఉండి ధరిత్రి హక్కుల కోసం పోరాడిన ఇవో మొరేల్స్. 'ధరిత్రికి కూడా కాలుష్యరహితంగా ఉండే హక్కుందని ముందో వెనుకో మనందరం గుర్తించాల్సి ఉంటుందని, భూమాత లేకుండా మనుషులు జీవించలేరుకానీ, మానవజాతి లేకుండా భూగోళం మనగలుగుతుంద'ని, మానవ హక్కుల విశ్వ ప్రకటన వెలువడిన 60 సంవత్సరాల తరువాతైనా భూమి హక్కుని గుర్తించి, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ, ఏప్రిల్ 22ని ధరిత్రి దినోత్సవంగా ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేశాడు.

ఐక్యరాజ్య సమితి అటు తరువాత ప్రపంచ నీటి దినోత్సవం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, జీవవైవిధ్య దినోత్సవం ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. అభివృద్ధి, అత్యాశ పేరిట మానవ జాతి చేస్తున్న పనులవల్ల గత కొన్ని దశాబ్దాలలోనే అరణ్యాలు 50 శాతానికిపైగా, నీటి వనరులు 70 శాతానికి పైగా లుప్తమయ్యాయి. తన జీవనశైలితో ప్రకృతిని ధ్వంసం చేస్తున్న మనిషి సహజ వనరుల వినియోగంపై, పర్యావరణ పరిరక్షణపై, అంతరించిపోతున్న జీవజాతుల సంరక్షణ కోసం ప్రత్యేక దినాలను ప్రకటించి ఆ ఒక్క రోజు కంటితుడుపుచర్యగా కార్యక్రమాలు నిర్వహించటం.

కవులు, రచయితలు సాహిత్యానికి, పర్యావరణానికి మధ్య గల సంబంధాన్ని, పర్యావరణ విమర్శక దృష్టితో చూడటం 1970లనుండి మనకు అమెరికన్ సాహిత్యంలో కనిపిస్తుంది. Joseph W. Meeker అనే అమెరికన్ మానవ పర్యావరణవేత్త, వన్యప్రాణి జీవావరణం, మానవ–జంతు స్వభావాలు అనే అంశంపై పరిశోధన చేశాడు. అతడు రాసిన The Comedy of Survival: Literary Ecology and a Play Ethic అనే పుస్తకంలో తొలిసారిగా సాహిత్య జీవావరణం గురించి చేసిన చర్చ పర్యావరణవేత్తలు, సాహిత్య విమర్శకులు, మానవ పరిణామ శాస్త్రవేత్తలతోపాటు, సాధారణ పౌరులను సైతం ఆలోచింపజేసి ఈ భూగోళాన్ని పరిరక్షించవలసిన సైన్యంగా మన కర్తవ్యాన్ని తెలియజేస్తుంది. William Rueckert అనే అమెరికన్ రచయిత, సాహిత్య అధ్యాపకుడు 1978లో 'Ecocriticism' అనే పదాన్ని పరిచయం చేశాడు. పర్యావరణాంశాలు, ప్రకృతి సంబంధ విశేషాలను సాహిత్యంతో అన్వయించేస్తూ కవులు, రచయితలు, పరిశోధకుల రచనలను విశ్లేషించే విమర్శా ధోరణిగా దీనిని అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో పర్యావరణాంశాలను ప్రస్తావించిన, చర్చించిన రచనల గురించి పరిశీలించినప్పుడు అక్కినేని కుటుంబరావు గారు రాసిన "కొల్లేటి జాడలు" నవలను పేర్కొనవచ్చు.



జలవనరులు సమృద్ధిగా ఉంటే ఏ ప్రాంతమైనా సుభిక్షంగా ఉన్నట్లే. నీటి జాడల వెంటే నాగరికతల జాడలు కనిపిస్తాయి. కానీ జీవ నదులు సైతం కనుమరుగవుతున్న విషాద కాలంలో చెరువులు, సరస్సులు, కుంటలు, బావుల దుస్థితి మనందరికీ తెలిసిందే. అలాంటి ఎన్నో సరస్సులలో పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో ఉన్న కొల్లేరు సరస్సు ఒకటి. చిత్తడి నేలల్లో సుమారుగా 1.20 లక్షల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన కొల్లేరు సరస్సు ఆసియాలో అత్యంత ప్రాచీనమైన పెద్ద మంచినీటి సరస్సు. ప్రపంచ ప్రసిద్ధమైన వలస పక్షుల ఆవాస కేంద్రం. ఒకప్పుడు ఒక్క పెలికన్, ఫ్లెమింగో జాతి పక్షులే లక్షల్లో సందర్శించేవి. రెండు వందల పక్షి జాతులతో కొల్లేరు అలౌకికమైన జీవంతో తొణికిసలాడేది. బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు లాంటి చిన్నా, పెద్దా ఏరుల నుంచి కొల్లేరుకు నీరు వచ్చి చేరుతుంది. ఒకప్పుడు సమష్టి వ్యవసాయంతో దేశానికే ఆదర్శంగా నిలిచిన కొల్లేటి ప్రాంతంలోని ఒక గ్రామ వాసి వర్తమాన బీభత్సాన్ని చూసి బెంగటిల్లి తలచుకున్న జ్ఞాపకాల వలపోత అక్కినేని కుటుంబరావు రాసిన 'కొల్లేటి జాడలు'. ఈ నవలలో రచయిత బాల్యం నాటి కొల్లేటి జీవనం, ఏటా వస్తున్న వరదలతో తమ చేతికొచ్చిన పంట, నిలువ నీడ, నీళ్ళపాలైనా, ఆ ప్రాంతీయులంతా శూన్యం నుంచి పోరాటం మొదలుపెట్టారు కానీ, ఏనాడూ ప్రకృతి ప్రకోపాన్ని నిందించిన వాళ్ళు కాదు. ఒక సామూహిక కార్యాచరణ గురించి ఆలోచించి, అందరూ ఒక్క మాట మీద నిలబడి 500 ఎకరాలను ఊరంతా ఒక్కటై సమష్టిగా వ్యవసాయం చేస్తారు. కానీ దేశాన్ని విడగొట్టే కులమతాలు ఊరినీ విడగొడతాయి. ఊరు కులాలుగా విడిపోవటం, సమష్టి వ్యవసాయం దెబ్బతినటం, అటు తరువాత వరుస తుఫానులతో వ్యవసాయం కుదరదని రైతులు వలసలు వెళ్ళిపోతారు. 1976లో చేపల చెరువులకు, 1990ల తరువాత రొయ్యల సాగుకు ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేయటంతో కొల్లేరు చుట్టుపక్కల ఆక్రమణలు పెరిగాయి. సర్వే చేయని భూముల్లో కూడా ఇతర ప్రాంతాల వాళ్ళు వచ్చి చేపల చెరువులు, రొయ్యల చెరువుల తవ్వకాలు చేపట్టటం, చుట్టుపక్కల భూముల ఆక్రమణ, మురుగు నీరు వచ్చిచేరటంతో మంచినీటి సరస్సు ఉన్నా, చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలు తాగునీటి కోసం అలమటించటం వంటివి పర్యావరణ విధ్వంసం, జీవావరణాన్ని ధ్వంసం చేసిన ఆనవాళ్ళు ఆవేదనకు గురిచేస్తాయి.

కొల్లేరు పరిధిలోని పులపర్రు గ్రామానికి చెందిన శీను అనే అయిదేళ్ళ బాలుడు తన బాల్యంలో తన కళ్ళతో, తన హృదయంతో చూసిన, ఈతలు నేర్చుకున్న కొల్లేరు సరస్సుకు దూరమై 60 యేళ్ళ తరువాత చూడటానికి వస్తాడు. అనంతమైన సరస్సు ముక్కలు ముక్కలై కళ్ళముందు కనబడుతుంటే మనసులో కల్లోలం చెలరేగుతుంది. ఆ సరస్సుతో పెనవేసుకున్న బంధాన్ని, పులపర్రు గ్రామ వాసుల జీవనం, కేవలం రెండే కులాలు ప్రధానంగా జీవించిన గ్రామంలో సామాజిక సంబంధాలు, అవసరం ఏర్పడినప్పుడు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి సమష్టిగా నిలబడటం... అన్నీ జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోతాయి. కొల్లేరు ప్రాంతంలోని సాంఘీక జీవితాన్ని రికార్డ్ చేస్తూనే పర్యావరణం, జీవావరణం పట్ల ప్రభుత్వాలు, సమాజమూ చేస్తున్న అమానవీయ ఆర్థిక దోపిడీ, అత్యంత వేగంగా విస్తరించిన ప్రపంచీకరణ ప్రభావం, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, అభివృద్ధి పేరుతో దళారులకోసం పుట్టే ప్రాజెక్టుల గురించి రచయిత ప్రస్తావిస్తాడు.

ప్రకృతిలో జీవవైవిధ్య సౌందర్యమే బహు గొప్పది, సహజసిద్ధంగా ఏర్పడిన ఆహార చక్రానికి అనుగుణంగా జీవులన్నీ ఒకదానిపై మరొకటి ఆధారపడి జీవిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. కొల్లేరు నీటిలోని జీవ వైవిధ్యాన్ని రచయిత పేర్కొంటాడు–కొరమీనులు, వాలగలు, బొచ్చెలు, గురకలు, పరిగలు, బిల్లా పరిగలు, బెట్టులు, మత్త గుడిసెలు, బొమ్మిడాయిలు, ఇంగిలాయిలు, మార్పులు, జెల్లలు, శీలావతి వంటి అనేక చేపల రకాలు, వేసవిలో దేశంలోని వివిధ ప్రాంతాలనుండే కాక సైబీరియా, ఫిలిప్పైన్స్, రష్యా, చైనా, ఫిజి దీవులనుండి వచ్చే పెలికాన్, ఫ్లెమింగో పక్షులు, గూడ కొంగలు, పరజ, కొండింగాయ్, నత్తగొట్టు

కొంగలు, తెల్ల కంకణాలు, ఎర్రకాళ్ళ కొంగలు, చింతవక్కలు, చుక్కమూతి బాతులు, నల్లబోడికోడి, కలికి పక్షులు, జకానాలు, కత్తిరి పిట్టలు, మైనా గోరలు, పాల పిట్టలు, కొంగలు, ఉత్తూతి పిట్టలు. మేరతూడు, తుంగ, గవర, గరిక, అల్లి వంటి పచ్చని మేతతో, జమ్ము, జీలగ వంటి పొదలతో ఉండే కొల్లేరు అక్కడి పశువులకి తల్లివంటిది. పులపర్రు గ్రామంలోని పిల్లలంతా తమ పశువులను తీసుకుని కొల్లేరుకొస్తే, పశువులకు కడుపునిండా మేత దొరికేది. పిల్లలు కూడా అక్కడ దొరికే కలేకాయలు, చీమిడి కాయలు తిని సరస్సులో నీళ్ళు తాగి కడుపునింపుకునేవాళ్లు. వందల రకాల చేపలను తన కడుపులో దాచుకున్న కొల్లేరును, వ్యాపారం పేరుతో ముక్కలు చేసి ఒకే రకం చేపలను పెంచి, జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేశారు. అభివృద్ధి పేరుతో వృద్ధి చెందింది కొందరేనని, ఒకప్పుడు కొల్లేట్లో చేపలుపట్టి అమ్ముకున్న కృష్ణమూర్తి కుటుంబం ఇప్పుడు చెరువుల్లో కూలీల్లా చేపలు పడుతుంటారు. విజయవాడ, ఏలూరు పారిశ్రామిక కాలుష్యాలన్నీ కొల్లేరులోకి విసర్జితమవుతున్నాయ్. చేపల పెంపకంలో అధికలాభాలకోసం మేతలో కూడా రసాయనాలున్నాయి. వరదల సమయంలో వచ్చే ఒండ్రు మట్టి, గుర్రపు డెక్క, కిక్కిస వంటివాటి కారణంగా కొల్లేరు పూడికతో నిండిపోతోంది. దీని ఫలితంగా 1900 నాటికి సముద్ర మట్టం కంటే దిగువన ఉన్న కొల్లేరు ఇప్పుడు ఎగువకు వచ్చిందని అధికారిక నివేదికలు తెలుపుతున్నాయి. ఇదిలాగే కొనసాగి, ప్రధానంగా పారిశ్రామిక వ్యర్థాలు, రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు చేరికతో మరింత వేగంగా సరస్సు పూడికమయం అయిపోయే ప్రమాదం ఉంది.




కొల్లేరు గురించి శ్రీనివాసరావు పడుతున్న బాధను చూసి మధుసూదనరావు "కొల్లేరు సమస్య చిన్న సమస్య కాదు. రాజకీయాలతో, వ్యాపారంతో, పెట్టుబడులతో ముడిపడి ఉందని, బతకటానికి కాక, లాభాలవేటకి ప్రకృతిని, సహజ వనరుల్ని కొల్లగొడతామో, అప్పుడు పర్యావరణానికి ముప్పు తెస్తున్నట్టేనం"టాడు. "కొల్లేరు బాగుండాలి, పేదల బతుకులూ బాగుపడాలంటే ప్రభుత్వాలు ముందు చూపుతో చిత్తశుద్ధితో పనిచేయాలం"టాడు. కానీ కొల్లేరును ప్రభుత్వం అభయారణ్యంగా ప్రకటించింది. చిత్తడి నేలల పరిరక్షణ కోసం ఒక చట్టం ఉంది. 40 శాతం జీవరాసులు ఈ చిత్తడి నేలల్లోనే జీవిస్తున్నాయి. "కొందరు పెట్టుబడీదారులు కొల్లేరును 77 వేల ఎకరాలకు కుదించి మిగిలిన 23వేల ఎకరాల్లో ఏమైనా చేసుకోవచ్చని వాదిస్తుంటే, స్వార్థ రాజకీయ నాయకులు నలభైఐదువేల ఎకరాలకు కుదించి మిగిలిన దాన్ని చిత్తడి నేలల పరిరక్షణ చట్టం నుండి మినహాయింపు పొంది, తద్వారా దక్కే యాభైఐదు వేల ఎకరాలను చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. కొల్లేరులో అంతులేని సంపద ఉందని గ్రహించిన ప్రభుత్వం దానిని దురాశాపరుల చేతుల్లో పెట్టింద"ని విని శ్రీనివాసరావు బాధ పడితే, చదువుకోసం, మెరుగైన జీవితాల కోసం వలస వెళ్ళిపోయిన వాళ్లు ఇప్పుడు కొల్లేరు గురించి చింతించటం చూసి వ్యంగ్యంగా నవ్వుతాడు అతడి చిన్ననాటి మిత్రుడు రాధాకృష్ణ. కొల్లేరు మాత్రమే కాదని, తాము ఉన్నచోట మరో రకంగా పర్యావరణంపై జరుగుతున్న విధ్వంసాన్ని పట్టించుకోకుండా కేవలం కుటుంబాలను బాగుచేసుకోవటంపైనే దృష్టి పెట్టామని, ప్రతిదీ ప్రభుత్వాలే చూడాలన్న తమ ఆలోచనా విధానం తప్పని అంటాడు రాధాకృష్ణ.

"కొల్లేటి జాడలు" నవల మనుషులంతా ఉమ్మడిగా కృషి చేస్తే ఏదైనా సాధించగలరన్న విషయాన్ని సమష్టి వ్యవసాయం ద్వారా నిరూపించింది. ఇదే స్ఫూర్తితో జీవవైవిధ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకోసం కూడా ఉద్యమిస్తే సాధ్యమవుతుందన్న భావన కలుగుతుంది. అలాంటి ఆలోచనతోనే ప్రముఖ పర్యావరణవేత్త డా.తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి, రాష్ట్ర డ్రైనేజ్ బోర్డు సభ్యుడు ఏమని నాగేంద్రనాథ్, కొల్లేరు జాలర్ల సంఘం, సన్నకారు రైతు సంఘం వారు ప్రభుత్వంపై వేర్వేరుగా వేసిన పిటీషన్లపై అనేక సంవత్సరాలు సాగిన వాదోపవాదాలు విన్న ఎస్.సిన్హా, వి.రావు బెంచ్ ఒక తీర్పు ఇచ్చింది "జాతీయ ప్రాముఖ్యత కలిగిన సరస్సులను కాలుష్యం, జీవావరణ శాస్త్రం, ఆక్రమణ మొదలైన వాటి నుండి రక్షించడం రాష్ట్రం ప్రాథమిక అంశంగా ఉండాలి. వేగవంతమైన ప్రపంచీకరణ మరియు పర్యావరణానికి ముప్పు పొంచివున్న నేపథ్యంలో, కాలుష్య రహిత పర్యావరణాన్ని కలిగి ఉండటానికి పౌరుల హక్కులు, నీటి హక్కు మొదలైనవాటిని అపెక్స్ కోర్ట్ ఆర్టికల్ 21 ప్రకారం గుర్తించింది. భారత రాజ్యాంగం, సరస్సుల పరిరక్షణలో ప్రభుత్వ కర్తవ్యం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. రాజ్యాంగంలోని పార్ట్" కింద రాష్ట్ర విధాన నిర్దేశక సూత్రాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం అమలు చేయబడతాయని ఇప్పుడు బాగా స్థిరపడిన చట్ట సూత్రం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48-A ప్రకారం, పర్యావరణాన్ని రక్షించడానికి, మెరుగుపరచడానికి, దేశంలోని అడవులు, వన్యప్రాణులను రక్షించడానికి రాష్ట్రం ప్రయత్నిస్తుంది. రాజ్యాంగంలోని 49వ అధికరణం జాతీయ ప్రాముఖ్యత కలిగినదిగా పార్లమెంట్ చేసిన చట్టం ద్వారా లేదా చట్టం ప్రకారం కళాత్మక లేదా చారిత్రాత్మక ఆసక్తి ఉన్న ప్రతి స్మారక చిహ్నాన్ని లేదా ప్రదేశాన్ని పాడుచేయడం, వికృతీకరణ, విధ్వంసం, తొలగింపు, పారవేయడం, ఎగుమతి చేయడం వంటి వాటి నుండి రక్షించాల్సిన బాధ్యత రాష్ట్రంపై ఉంది. అదే సమయంలో, అడవులు, సరస్సులు, నదులు మరియు వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని పరిరక్షించడం, మెరుగుపరచడం, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51-A(g) ప్రకారం జీవుల పట్ల కరుణ కలిగి ఉండటం భారతదేశంలోని ప్రతి పౌరుడి ప్రాథమిక విధి. పిటిషన్లలో లేవనెత్తిన వివిధ సమస్యలను పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986, నీరు (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం, 1974, మరియు వన్యప్రాణుల (రక్షణ) చట్టం, 1972 వంటి పై రాజ్యాంగ నిబంధనలు, పర్యావరణ చట్టాల వెలుగులో పరిశీలించాలి.

1999లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 120 విడుదల చేసి ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించింది. 2005లో సుప్రీం కోర్టు నియమించిన సాధికారిక కమిటీ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు

చేసిన మిత్రా కమిటీలు కొల్లేరులో పర్యటించి అప్పటి స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదికలందించాయి. సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి 2007లో కొల్లేరు ప్రక్షాళనలో భాగంగా సుమ్మరు 55వేల ఎకరాల అనధికార చెరువులు కొట్టేసి సాగుదారులకు రూ.55 కోట్ల మేరకు నష్ట పరిహారం అందించింది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం. కైకలూరు పరిసర ప్రాంతాల్లో అభయారణ్యంలో 7500 ఎకరాల భూమి వెలుగులోకి వచ్చింది. కొల్లేరులో 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకి కుదించాలని స్థానికుల కోరిక మీద అప్పటి రాష్ట్ర ప్రభుత్వం "కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం +5 అడుగుల ఆకృతి నుండి +3 అడుగుల ఆకృతి వరకు తగ్గించటం ద్వారా స్థానిక రైతుల సమస్యలను తగ్గించడానికి 'నేషనల్ బోర్డ్ ఆఫ్ వైల్డ్ లైఫ్', భారత ప్రభుత్వం, 'సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ' సిఫారసుల కోసం 'అసెంబ్లీలో తీర్మానం చేసింది. తీర్మానంలోని పర్యావరణ, చట్టపరమైన, సామాజిక-ఆర్థిక, జీవనోపాధికి సంబంధించిన చిక్కులను గ్రహించి, కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ సమన్వయ పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ జూన్ 2010నుండి కొల్లేరు ప్రాంతాన్ని పలుమార్లు సందర్శించి, సంబంధిత అధికారులతో, రైతులతో, రైతుసంఘాలతో, చేపల చెరువుల వ్యాపారులతో అనేక సమావేశాలు నిర్వహించింది. కొల్లేరు సరస్సు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక మరియు పర్యావరణ సమస్యలకు ప్రస్తుత అభయారణ్యం ప్రాంతాన్ని తగ్గించడం ఆచరణీయ పరిష్కారం కాదు. కొల్లేరు అభయారణ్యం ప్రస్తుత సరిహద్దులో చేపల పెంపకాలను నిర్వహించడంతోపాటు, దాని పరిధిలో ఎటువంటి మార్పును అనుమతించకూడదని కమిటీ నివేదిక సమర్పించింది.




2012లో కొల్లేరును ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించింది. కొల్లేరులో 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకి కుదించాలని స్థానికుల కోరిక మీద 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో కాంటూరు కుదింపు కోసం తీర్మానం చేసి కేంద్రం పరిధిలో ఉన్న అంశం కావడంతో వారికి నివేదిస్తున్నట్టు తెలిపింది. సముద్రమట్టానికి ఎగువ, దిగువన ఎంత మేరకు ఉన్నది అన్నది లెక్కగట్టి కాంటూరు లెక్కిస్తారు. ప్రస్తుతం కాంటూరు 5గా ఉన్న కొల్లేరు పరిధిని కాంటూరు 3కు కుదిస్తే సుమారుగా 40 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. తద్వారా స్థానికులందరికీ ఉపాధి లభిస్తుందని దానిని పర్యావరణ పరంగా సక్రమంగా అభివృద్ధి చేస్తే అందరికీ మేలు జరుగుతుందని, కానీ, పర్యావరణం పేరు చెప్పి ప్రజల ఉపాధిని కొల్లగొట్టడం తగదని అక్కడి రైతులు, రైతు సంఘాల వాదన.

గణాంకాల ప్రకారం సరస్సు మొత్తం విస్తీర్ణంలో 1967లో 29.95 చదరపు కిమీలో ఉన్న ఆక్వాకల్చర్ ప్రస్తుతం సుమారు 110.0 చ.కిమీ.కు విస్తరించింది. చిత్తడి నేలలో వ్యవసాయం చేసే విస్తీర్ణం కూడా పెరిగింది. ఏలూరు, గుడివాడ పట్టణాల నుండి పెరిగిన మురుగు ప్రవాహమే కాక, కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతం నుండి, విజయవాడ నుండి పారిశ్రామిక వ్యర్థాలు, పురుగుమందులు, ఎరువులు కూడా సరస్సును కలుషితం చేస్తున్నాయి. సరస్సులో ఇప్పటికే వాడుకలో ఉన్నవి కాకుండా అక్రమ చేపల తొట్టెల నిర్మాణం ప్రస్తుతం సరస్సుకు పెను ముప్పుగా పరిణమిస్తోంది. వర్షాకాలం తరువాత, అభయారణ్యంలోకి నీటి ప్రవాహం ఆగిపోవటం, ఆ ప్రాంతంలో అక్రమ చేపల చెరువులు త్రవ్వటానికి అక్కడ 8-10 అడుగుల ఎత్తు వరకు పెరిగే ఫ్రాగ్‌మిట్ కర్కాతో పాటు అనేక జల కలుపు మొక్కలను కాల్చడం సౌకర్యంగా ఉంటుంది. అభయారణ్యం ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులకు వేల ఎకరాల భూమిని అధీనంలోకి తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ భూములను జిరాయతీ భూములుగా పేర్కొంటారు. చేపల పెంపకందారులు మరియు రాజకీయ నాయకులు అభయారణ్యం ప్రాంతాన్ని తగ్గించడానికి ఆసక్తి చూపుతున్నారు. అభయారణ్యం ప్రాంతం తగ్గడం పెలికాన్‌లు, పెయింటెడ్ కొంగలు, ఇతర నీటి పక్షులపై ప్రభావం చూపుతుంది.

స్వదేశీ పక్షులతో పాటు విదేశీ పక్షి జాతులకు ఆలవాలమైన కొల్లేరు సరస్సులో ఏటేటా వాటి సందడి తగ్గిపోతుంది. కొల్లేరుపై ఆధారపడి మూడు దశాబ్దాల క్రితం నులుగుపిట్ట, పరాజ, పెలికాన్ వంటి పక్షులు రెండు కోట్ల వరకు మనుగడ సాగించేవి. కానీ ప్రస్తుతం వాటి సంఖ్య ప్రమాదకరస్థాయిలో తగ్గిపోతున్నదని, గత రెండు, మూడు సంవత్సరాలుగా అభయారణ్య శాఖ తెలుపుతున్న పక్షజాతి గణాంకాలను గమనిస్తే అర్థమవుతుంది. కేవలం రెండు, మూడు లక్షల పక్షులు మాత్రమే విహరిస్తున్నట్లు అంచనా.

2010లోని చిత్తడి నేలల నిబంధనల ప్రకారం చిత్తడి నేలలను రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. కొన్నేళ్లుగా కొల్లేరును పరిరక్షించాలని పర్యావరణవేత్తలు హైకోర్టు, సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, కేసులు వేశారు. సుప్రీం కోర్టు కూల్చివేత ఉత్తర్వు తర్వాత, అక్రమ చేపల ట్యాంకులు కూల్చివేసినా, కొంతకాలం తర్వాత మళ్లీ ట్యాంకులను నిర్మించారు. ఇదే తీరు కొనసాగితే కొల్లేటి సరస్సు పునరుద్ధరణ అసాధ్యం.

ఒక సరస్సు అస్తిత్వాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని సమాజంలో పర్యావరణ చైతన్యాన్ని ఆర్ద్రంగా ప్రబోధించిన నవల 'కొల్లేటి జాడలు'. పర్యావరణ సాహిత్యంలో ఇది ఒక సృజనాత్మక డాక్యుమెంట్‌గా నిలిచిపోతుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. Environmentalism: A Global History-Ramachandra Guha
2. The Comedy of Survival: Literary Ecology and a Play Ethic-Joseph W Meeker
3. Dr.T.Patanjali Shastri vs Chairman Andhra Pradesh State Judgement
4. Report on the proposal for downsizing the Kolleru Wild-life Sanctuary (+5 to +3 feet contour)- Submitted to The Ministry of Environment and Forests Government of India April 2011
5. The story of a Glory Lost - Kolleru Lake- Shakti and AS Bishnoi Saevus Magazine

-డా.జె.నీరజ
m : 9848370018
e: nj.ccets@gmail.com




# భారీ జలాశయాలపై మరో 800 మె.వా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి సన్నాహం

## రాజస్థాన్‌లో 500 మెగావాట్ల సోలార్ ప్లాంటుకు ప్రాజెక్ట్ రిపోర్ట్‌కు ఆదేశం

## మరింత తక్కువ ధరలో విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలి

## రాష్ట్రంలో పవన విద్యుత్తు ప్లాంట్‌ల ఏర్పాటుకు పరిశీలన

## సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్.బలరామ్

ఇప్పటికే కంపెనీ వ్యాప్తంగా 234 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సింగరేణి సంస్థ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో భారీ జలాశయాలపై సుమారు 800 మెగా వాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి సంసిద్ధంగా ఉందని సింగరేణి చైర్మన్ మరియు ఎండి ఎన్.బలరాం పేర్కొన్నారు.

హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సింగరేణి విద్యుత్ విభాగంపై డైరెక్టర్ ఈ అండ్ ఎం. డి.సత్యనారాయణ రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులతో శనివారం (మార్చి 2) నాడు ప్రత్యేక సమీక్షను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన కంపెనీ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా కొత్తగా సింగరేణి సంస్థ చేపట్టనున్న సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులపై చర్చించారు. సోలార్ విద్యుత్తు పెంపుదలకు కృషి చేయాలని ఇటీవల రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చిన నేపథ్యంలో భారీ జలాశయాలైన లోయర్ మానేరు డ్యాం పైన 300 మెగావాట్ల నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్ జలాశయం పైన 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటుకు తగు సన్నాహక చర్యలుతీసుకోవాలని సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్.బలరామ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

లోయర్ మానేర్ డ్యాంపై 300 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన డిపిఆర్ సిద్ధంగా ఉంది. కనుక దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో నిర్మాణం చేపట్టడానికి కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. కాగా మల్లన్న సాగర్ జలాశయంపై ఏర్పాటు చేయ తలపెట్టిన రెండు 250 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి డిపిఆర్‌ను వెంటనే రూపొందించాలనీ ఆయన అధికారులను ఆదేశించారు.

రాజస్థాన్ రాష్ట్రంలో సింగరేణి ఏర్పాటు చేయతల పెట్టిన 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు సంబంధించిన కార్యాచరణపై కూడా ఆయన సమీక్షించారు. దీనిపై రూపొందించిన డిపిఆర్‌పై మరింత లోతుగా అధ్యయనం జరపాలని, తక్కువ ధరకే విద్యుత్ ఉత్పత్తి జరిగే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, తద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణి సోలార్ విద్యుత్తును ఎక్కువగా కొనే అవకాశం ఉంటుందన్నారు.

మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్




కేంద్ర పనితీరుపై కూడా ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రస్తుత 1200 మెగావాట్ల ప్లాంటుకు అదనంగా అదే ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి నిర్మాణం ప్రారంభించాలని అధికారులను కోరారు. ఇటీవల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమృత లాల్ మీనా ఇదే ప్రాంగణంలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్‌తో పాటు మరో ఎనిమిది వందల ప్లాంట్‌ను కూడా నిర్మించే అవకాశాలను పరిశీలించాలని సూచించారని, కనుక దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై వెంటనే ఒక నివేదిక సమర్పించాలని చైర్మన్ ఆదేశించారు.

వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటు చేయటానికి అవకాశం గల ప్రాంతాలను సందర్శించాలని, దీనికి సంబంధించి ఒక నివేదికను కూడా రూపొందించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి సత్యనారాయణ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బసివి రెడ్డి, జనరల్ మేనేజర్ సివిల్ సూర్యనారాయణ, మేనేజర్ సోలార్ జానకిరామ్, చీఫ్ ఆఫ్ పవర్ ఎన్ వికెవి రాజు, చీఫ్ ఓఅండ్ ఎంజేఎన్ సింగ్. డీజీఎంలు వేణుగోపాల్, సిహెచ్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
ప్రజా సంబంధాల విభాగం, హైదరాబాద్

# దక్షిణ భారత నాణ్యాల 32వ వార్షిక సదస్సు

## XXXII ANNUAL CONFERENCE OF SOUTH INDIAN NUMISMATIC SOCIETY

దక్షిణ భారత నాణ్యాల 32వ వార్షిక సదస్సును చరిత్ర శాఖ, డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, దక్షిణ భారత నాణ్యాల సమాఖ్య ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏప్రిల్ 10, 11, 2024 తేదీల్లో నిర్వహించ బడుతుంది. దక్షిణ భారత దేశ చరిత్ర పునర్‌నిర్మాణంలో నాణ్యాల పాత్ర అనే కీలక అంశంపై చర్చ జరుగుతున్నది.

**ఈ సదస్సులో చర్చించే ప్రధాన అంశాలు**

1. దక్షిణ భారత దేశంలో నాణ్యాలు అధ్యాయనం – ప్రధాన సవాళ్లు
2. ఆర్థిక చరిత్ర నిర్మాణంలో నాణ్యాల పాత్ర
3. దక్షిణ భారత దేశంలో లోహ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం.
4. దక్షిణ భారతదేశంలో నాణ్యాల ముద్రణ కేంద్రాలు
5. దక్షిణ భారత దేశంలో నాణ్యాల ప్రాధాన్యతతో పాటు ఇతర సంబంధిత అంశాలు చర్చించ బడుతాయి.

సదస్సు ప్రదానవక్త ఆచార్య కె.పి.రావు చరిత్ర విభాగం, హైదరా బాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం. స్మారకోపన్యాసం –ఆచార్య శకుంతల, చరిత్ర శాఖ, శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం. సదస్సు అధ్యక్షులు డాక్టర్. డి. రాజా రెడ్డి. ప్రముఖ వైద్యులు, హైదరాబాద్ స్థానిక కార్యదర్శి. డాక్టర్. గాజుల దయాకర్, చరిత్ర శాఖ అధ్యక్షులు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం, సదస్సు డైరెక్టర్ ఆచార్య ఇ. సుధారాణి, చరిత్ర శాఖ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వా విద్యాలయం, డీన్ ఆచార్య శ్రీనివాస్ వడ్డాణం. అంబేద్కర్ సార్వత్రిక విశ్వా విద్యాలయం.

ఈ సదస్సు, డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జరుపబడుతుంది.

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లా – గ్రామ నామాలు

తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక స్థానమున్నది. ఈ ప్రాంతాన్ని మౌర్యులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, త్రికూటులు, విష్ణుకుండినులు, రాష్ట్రకూటులు, బోధన్ చాళుక్యులు, కళ్యాణీ చాళుక్యులు, కాకతీయులు, ఢిల్లీ సుల్తానులు, కుతుబ్ షాహీలు, బరిద్ షాహీలు, మరెడ్డి రాజులు, మొఘల్ చక్రవర్తులు, మహారాష్ట్రులు, అసఫ్ జాహీలు పరిపాలించారు. ఈ జిల్లాకు దక్షిణాన మరియు పడమరన కొంత భాగం ఉమ్మడి మెదక్, బీదర్, నాందేడ్ జిల్లాలు ఉండగా, తూర్పున ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఉత్తరాన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మూడు రెవెన్యూ డివిజన్లు, 36 మండలాలు, 912 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. నిజామాబాద్ ప్రాంత నామాన్ని పూర్వం ఇందూరు, ఇంద్రపురి, ఇందూరుసీమ అను పేర్లతో వ్యవహరించేవారు. క్రీ.శ.8వ శతాబ్దంలో రాష్ట్రకూట రాజు ఇంద్ర వల్లభుడి పరిపాలనా ప్రభావం ఒక కారణం కాగా, ఇతర చారిత్రక కారణాలు కూడా ఉన్నాయని చరిత్రకారుల అభిప్రాయం. ప్రస్తుతం నిజామాబాద్ పేరుతో ఉన్న ఈ ప్రాంతం అశ్మక రాష్ట్రం, నాగభూమి, మంజీర భూమి, సపాదలక్ష భూమి, దక్షిణ కోసల, శక్రాభిదానపురం, పోదన నాడు, కాసలనాడు, ఇందూరు అనే పేర్లతో పిలువబడినదట. జైన యుగం నాటికి ఇందూరు ప్రాంతం పుళక ప్రాంతంగా పిలువబడింది. విష్ణుకుండిన రాజైన ఇంద్ర దత్తుడు క్రీ.శ. 388 ప్రాంతంలో తన పేరుతో ఇంద్రపురిని నిర్మించాడని ఒక కథనం. క్రీ.శ. 500 ప్రాంతంలో మొదటి ఇంద్రవర్మ ఇంద్రపురిని నిర్మించాడని కొందరు చరిత్రకారుల భావన. క్రీ.శ.1905లో జిల్లాల పునర్విభజన జరిగి కొత్తగా జిల్లాను ఏర్పాటు చేసినప్పుడు ఇందూరు'ను నిజామాబాద్ జిల్లాగా మార్చడం జరిగింది. (ఆలోకనం – డా. సాగి కమలాకర శర్మ పుట.115,116) తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో ఈ జిల్లాను నిజామాబాద్, కామారెడ్డి అను కొత్త జిల్లాలుగా విభజించారు. జిల్లాలోని కొన్ని గ్రామ నామాలను చారిత్రకంగా ఆధార గ్రంథాలతో చర్చించడం ఈ వ్యాసం ఉద్దేశం.



**కందకుర్తి:–** రెంజల్ మండలంలోని గ్రామమిది. గోదావరి నది తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించే తొలి ప్రదేశమిది. కందకుర్తి అనే పేరులో కందకూడతి రెండు పదాలు ఉన్నాయి. కంద అనే పదము స్కంద నుండి వచ్చినది. గ్రామము ఏర్పడక ముందు స్కందుడి (కార్తికేయుడు) ఆలయం వెలసి యుండుట వలన స్కంద కాల క్రమంలో కందగా ఏర్పడినది. (పుష్కర విశిష్టత. డా. సంగన భట్ల నరసయ్య. పుట.40,41)కందకుర్తి అనే వంశీయుల పేరు మీదుగా ఈ గ్రామ నామం ఏర్పడి ఉండవచ్చునని మరో ఐతిహ్యమున్నది.

**కామారెడ్డి:–** కొత్త జిల్లా కేంద్రమిది. కామారెడ్డి పేరుని పూర్వం సర్కారు రికార్డుల్లో కామారెడ్డి పేట అని రాసే వారట. ప్రజలు కామారెడ్డి ప్యాట అని కూడా వ్యవహరించేవారట. కామారెడ్డి నగరం మధ్యలో పురాతనమైన కిష్టమ్మ గుడి ఉంది. ఆ గుడికి ఉత్తరంగా కొంత దూరంలో కోడూరు హనుమాండ్లు అని మరో దేవాలయం దీనికి కొంత దూరంలో కోడి చెరువు (కోడూరు చెరువు) ఉండేదట. ఇప్పుడు లేదు. కానీ ఆ ప్రాంత భూముల రెవెన్యూ రికార్డుల్లో కోడిచెరువు భూములు' అని ఉందని పరిశోధకుడు ఆచార్య రాజేశ్వర శర్మ గారు తన ఆత్మ నివేదనలో రాసుకున్నారు. పై విషయాల ఆధారంగా కోడూరు అనే గ్రామం ఇక్కడ ఉండేదని, దానిని ఏ దండయాత్రలోనో ధ్వంసం చేయడం ద్వారానే ఇప్పుడున్న కిష్టమ్మగుడిని కూడా ధ్వంసం చేసారని అంచనా వేసుకోవచ్చు. అటువంటి గ్రామాన్ని కామినేని వంశస్థులు పునరుద్ధరించి వారి వంశంలో ఒకరైన కామిరెడ్డి పేరు మీద కామాడిపేట, కామారెడ్డి పేట, కామారెడ్డిగా పేరు మార్చారని తెలుస్తుంది. (ఆలోకనం – డా. సాగి కమలాకర శర్మ. పుట.25)

**చౌటుపల్లి:–** కమ్మర్ పల్లి మండలం లోని గ్రామమిది. ఈ గ్రామంలో చౌడు భూములు అధికంగా ఉండడం వలన గ్రామానికి చౌడుపల్లె అను పేరు ఏర్పడి అనంతరం చౌడుపల్లి, చౌటుపల్లి గా మారి యుండ వచ్చునని స్థానిక కథనం.

**జక్రాన్ పల్లి:–** జైనుల ప్రభావం అధికంగా ఉన్న మండల కేంద్రమిది. చక్రేశ్వర పురం అని మరొక పేరు. జక్కుల రాణి నామ ప్రభావంతో జకరాణి పల్లిగా, జకరాన్ పల్లి' గా మారిందని స్థానిక కథనం.





**జానకం పేట్:-** వేల్పూరు మండలంలోని గ్రామమిది. ఈ గ్రామ చెరువుకు జానకమ్మ చెరువు అని పేరు. ఈ పేరు మీదుగానే జానకమ్మ పేట, జానకం పేటగా స్థిర పడి యుండవచ్చు.

**డిచ్ పల్లి:-** జిల్లాలోని మండల కేంద్రమిది. ఈ నామాన్ని ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర చరిత్రలో డిచ్చుపల్లి అని పేర్కొన్నారు. గతంలో దీక్షపల్లిగా, డచ్ వారు ఉన్న ప్రాంతం కావడం వలన డచ్ పల్లి'గా పిలుస్తారని స్థానిక కథనాలు ఉన్నాయి.

**బాన్స్ వాడ:-** జిల్లాలోని మండల కేంద్రమిది. ఈ మండలంలోని దేశాయిపేట గ్రామంలోని శాసనంలో ఈ నామం బనవాసవాడి అని పేర్కొనబడి ఉన్నది. శాసన రూపం బనవాసవాడి కాల క్రమంలో బాన్స్ వాడగా మార్పు చెంది ఉండ వచ్చు.

**బిచ్కుంద:-** జిల్లాలోని మండల కేంద్రమిది. పూర్వం ఈ నామాన్ని ముచికుంద మహర్షి పేరు మీదుగా ముచికుంద అని వ్యవహరించే వారట. తదనంతరం బిచ్ కుంద' గా మారినట్లు స్థానిక కథనం.

**బోధన్:-** అశ్మక రాజు పరిపాలించిన పౌదన్యం అనే నగరమే ఈ బోధన్ నగరం. ఋషభ దేవుని కుమారుడు బాహుబలి (గోమటేశుడు) ఈ బోధన్ ప్రాంతాన్ని పరిపాలించినట్లు చెబుతారు. ఆ తర్వాత సన్యాసం స్వీకరించి జైన మునులలో ప్రసిద్ధుడై పూజలందుకున్నట్లు చెబుతారు. నాటి జైనమత కేంద్రమైన బోధన్ దక్షిణ భారత దేశ యాత్రా స్థలంగా పేరుగాంచినది. ఈ ప్రాంతం మంజీరా నది పరీవాహక ప్రాంతం కావడం వల్ల మంజీరా భూమిగా కూడా పిలవబడింది. దక్కన్ పీఠభూమిలో మరియు దక్షిణ భారతదేశంలోనే గొప్ప జైన పుణ్యక్షేత్రం, కర్మభూమి ఈ బోధన్ ప్రాంతం. కాశీ, మధుర, హస్తినాపురాల వలె పోదనం' (బోధన్) కూడా పవిత్ర తీర్థ క్షేత్రమని క్రీ.శ. ఒకటవ శతాబ్దికి చెందిన జైన మహాకవి కుంద కుందాచార్యుడు తన దసభత్తి' అనే ప్రాకృత గ్రంథంలో ప్రశంసించాడు. పంప మహా కవి బోధన్ లోనే జన్మించినట్లు, తన చివరి దశను బోధన్ లో గడిపినట్లు అనేక ఆధారాలున్నాయని చరిత్రకారుల అభిప్రాయం. బాహుబలి గురించి రాయబడిన కన్నడ పురాణంలో బోధన్ నగరం పద్మపురం అని పేర్కొనబడింది. పంప కవి తాను పద్మపుర నివాసినని చెప్పుకున్నాడు. ఈ బోధన్ నగరానికి వసుమతి, పద్మపుర, ఏకచక్రపుర, బహుధాన్య పురము అనే పేర్లున్నాయని తన విక్రమార్జున విజయం'లో పేర్కొన్నాడు. (తెలివాహ గోదావరి - డా. సంగనభట్ల నరసయ్య. పుట. 69)

**భిక్ నూర్:-** జిల్లాలోని మండల కేంద్రమిది. బిక్కనూరు పేట, భిక్షువులపురం అని కూడా పిలుస్తారు. ప్రాచీన సంస్థానం దోమకొండకు బిక్కనవోలు అనే పేరు కూడా ఉంది.

**భీమ్ గల్:-** మండల కేంద్రమిది. వేముగల్లు అని కూడా పిలుస్తారు. సింహాసన ద్వాత్రింశిక కర్త కొఱవి గోపరాజు గారిది ఈ మండలంలోని పల్లికొండ గ్రామం.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఉప్లూర్- ఉప్పలూర్, కాటేపల్లి - కాటేరిపల్లి, గాండ్లపేట్-గౌండ్లపేట్, బంజెపల్లి-బంజెరుపల్లి, ముల్తుమ్మెద -మాల్తుమ్మెద, దూద్ గావ్-దూద్ వాలేగావ్, దేవన్ పల్లి-దేవునిపల్లి, నడిపల్లి-నడిమిపల్లి, నసమల్లాబాద్-నజీరుల్లాబాద్, యాచారం-యాచవరం, సాంబాపూర్-సాంబయ్యపురం వంటి అనేక గ్రామనామాల ప్రత్యేక రూపాలను చూడవచ్చు.(నిజామాబాద్ జిల్లా గ్రామ నామాలు-సాహిత్య, చారిత్రక,పరిశీలన, సిద్ధాంత గ్రంథం. డా. అక్కెనపల్లి వెంకట్ రాంరెడ్డి, OU.HYD. 2015)


కామారెడ్డి పేట, బిక్కనూరు పేట, యూదల వాయి, జగనంపల్లి, ఆర్మూరు, బాల కొండ వంటి స్థల నామాలను సందర్శించినట్లు ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర చరిత్రలో రాసినారు. ఈ ప్రాంతంలో బౌద్ధం, జైనం, శైవం, వైష్ణవం ఇస్లాం మత సంబంధమైన గ్రామ నామాలున్నవి. ఆయా గ్రామ నామాలపై తెలుగు, ఉర్దూ, మరాఠ, కన్నడ, తమిళ భాషా ప్రభావం కనబడుతుంది. కౌలాస్ దుర్గం, దోమకొండ, వెల్మల, సిర్నాపల్లి సంస్థానాలు జిల్లాకు తరగని చారిత్రక ఆభరణాలు.

-డా. మండల స్వామి
m : 9177607603
e : mandala.smy@gmail.com

ప్రకృతే సౌందర్యం!　23　ప్రకృతే ఆనందం!!

# తిండి పోతులం!
# ఆహారపు గొలుసులో మేమే తోపులం!!

జీవజాతులలో పరిమాణం దృష్ట్యా భూచరాలల్లో ఏనుగును, ఖడ్గమృగాన్ని, నీటిగుర్రాన్ని అతిపెద్ద జంతువులుగా గుర్తిస్తే, జలచరాలల్లో పెద్దజంతువులుగా సొరచేపని, తిమింగలాన్ని ప్రస్తావిస్తాం! భూ, జలచరాల్లో అన్నింటా తిమింగలమే అతిపెద్ద జంతువు. భారీకాయంతో, సుమారు 100 అడుగుల పొడవుతో, 150 టన్నుల (బ్లూవేల్) బరువుతో వుండే తిమింగలం నాలుకే మూడు టన్నులంటే నమ్మశక్యం కాదు. అయితే జంతువుల పరిమాణంను కచ్చితంగా తేల్చడం కష్టమైనపని. జంతువు యొక్క బరువు, పొడవు, ఎత్తు, శరీర సాంద్రత (mass) తదితర కొలతలు, తూకాలు అనేక అంశాలపై, అవి నడయాడే ప్రాంతాలపై ఆధారపడి వుంటాయి. ముఖ్యంగా భూచరాల లాగా, జలచరాల్ని అంచనా వేయడం మరింత కష్టసాధ్యమైన పని. ప్రధానంగా లభించిన కళేబరాల ఆధారంతో అంచనావేయడం జరుగుతుంది. అందుకే జలచరాల పరిమాణం గూర్చి పరస్పర వాదనలుంటాయి.




ఇప్పుడు సముద్రాల్లో ప్రధాన భూమికను పోషించి, ఆహారపు గొలుసులో కీలకపాత్రను పోషించే తిమింగలం ఆత్మకథను చూద్దాం!

**తిమింగలం (whale) :**

మా పేరు విననివారుండరు. కాని చూసిన వారు తక్కువే! మేం క్రూరజంతువులమని, పెద్దపెద్ద ఓడల్ని సైతం పడగొట్టే సత్తావున్న వారమని, మనుషుల్ని వేటాడుతామని నమ్మేవారు అత్యధికమే! ఇదంతా మిడిమిడి జ్ఞానపువారు, మా గూర్చి కల్పిత (fiction) కథల్ని అల్లేవారు సాగించే దుష్ప్రచారం. కాని, ఆధునాతన పరిశోధనలు మేమెంత బుద్ధిమంతులమో, సంఘజీవులమో చూపాయి. ఇంకా చెప్పాలంటే, మీ మానవులలాగా మేం క్రూరులం అసలేకాము. మీ మాటల్లో చెప్పాలంటే, మేం సాధుజంతువులం. సాధారణంగా మీరు ఆవుల గూర్చి, వాటి ఉపయోగాల గూర్చి, ప్రాధాన్యత గూర్చి ప్రచారం చేస్తూ వుంటారు. నిజం చెప్పాలంటే, మేం ఆవులను మించిన సాధు జంతువులం.

పర్యావరణ (జల) సంరక్షణలో, ఆహారపు గొలుసును నియంత్రించి సముద్రాన్ని మానవ, సకలజీవరాశికి అనుకూలంగా నియంత్రించుటలో మేమే పెద్దతోపు. ఒక్క క్షణం సూర్యుడి శక్తి ఆగుతే భూగోళంకు ఏం జరుగుతుందో ఊహించండి! మా జాతి కూడా మీలా ఒక్కరోజు ఉపవాసం వుంటే మొత్తం సముద్రాలన్నీ చేపలచే, ఇతర జలచరాల కళేబరాలతో నిండిపోతాయి. అప్పుడు సముద్రాల నీరంతా భూభాగాల్ని ముంచెత్తుతాయి. కాబట్టి మేం తిండిపోతులమే, కానీ, ఆహారపు గొలుసు నియంత్రణతోపాటు, భూగోళ సమతుల్యతను కాపాడే మహా ఉపకారులం.

**భారీ కాయం – పిడికెడు గొంతు:**

మా తిండి, మీ బకాసురుడు కూడా (కల్పిత) తినలేడు. రోజుకు వందల కిలోల నుండి సుమారు ఒక టన్ను చేపల్ని, ఇతర చిన్న జంతువుల్ని మేము తీసుకున్నా, మా గొంతు మాత్రం మీ పిడికెడంతా (fist) మాత్రమే వుంటుంది. మానోరు, నాలుక అతిపెద్దవే అయినా, మేం మీరనుకున్నట్లు మనుషుల్నిగాని, పెద్ద జంతువుల్ని గాని మింగలేము. పైగా మా నోటిలోకి వచ్చినా, వాటిని వెంటనే బయటికి తోస్తాం! ఇలా మా ఆహార విధానమే భూగోళ ఆహారపు సమతుల్యతకు ప్రధానకారణం!

**మాదో వైవిధ్య భరిత జాతి :**

మా గూర్చి, మా జాతి గూర్చి మీకు చాలా విషయాలు తెలియవు. ఇప్పుడిప్పుడే మా గూర్చిన చాలా అంశాలు మీ దృష్టికి వస్తున్నాయి. సర్కసు విన్యాసాలు చేస్తాయని భావించే అందమైన డాల్ఫిన్లు మాలోని ఒక కుటుంబమే! ప్రధానంగా మా ఆకృతిని బట్టి, పరిమాణాన్ని బట్టి మా క్రమమైన (order) సెటేసియన్ (cetacean)ను మూడు కుటుంబాలుగా విభజించారు.

- తిమింగలాలు (whales) Balaenopteridae
- డాల్ఫిన్స్ (dolphins) Dolphinidae
- పోర్పోయిస్ (porpises) Phocoenidae

దాదాపు ఒకే విధమైన జీవన విధానాల్ని కల్గివున్నా, మా ఆకృతిని బట్టి ఈ విభజన చేసారు. అనగా

- తొమ్మిది అడుగులకన్నా ఎక్కువ పొడవుగల వాటిని తిమింగలాలని.
- తొమ్మిది అడుగులకన్నా తక్కువ గల వాటిని డాల్ఫిన్స్ అని, పోర్పోయిస్ అని. పోతే, పోర్పోయిస్, డాల్ఫిన్స్‌కన్నా మరింత చిన్న జంతువులన్న మాట!



# భారీ జలచరాల జీవన చర్యల్ని పరిశీలించే బయో-లాగింగ్

సముద్రాల్లోని భారీకాయ జీవులైన తిమింగలాల, సొరచేపల, ఇతర పెద్ద జంతువుల జీవన ప్రక్రియల్ని, వాటి శారీరక అంశాల్ని పరిశీలించడానికి వాడే పరికరమే బయో-లాగింగ్. ఇదో రికార్డింగ్ పరికరం. తిమింగలాల లాంటి భారీ కాయపు జంతువులకు దీన్ని అమర్చడం కష్టంతో కూడుకున్న పని కాబట్టి జపాన్‌కు చెందిన కగారి అయోకి చూషణ కప్పుల్ని (suction cup) అభివృద్ధి చేసింది. ఓ పొడువాటి ఉక్కురాడ్‌తో, తిమింగల శరీరానికి దీన్ని అతుక్కునేలా చేస్తారు. సుమారు 24 గంటల తర్వాత ఈ చూషణ కప్పు తిమింగలం నుంచి విడిపోయి నీటిపై తేలుతుంది. దీన్ని సేకరించి, రికార్డును పరిశీలించి తిమింగలాల జీవన విధానాల్ని గుర్తిస్తారు.

ఈ పరికరాల్ని, భూచరాలకు, పక్షులకు కూడా ఉపయోగించి, వాటి ప్రవర్తనను, శారీరక ధర్మాల్ని అంచనావేస్తారు. ఇప్పుడు శరీర అంతర్భాగాల్ని, గర్భధారణ లాంటి అంశాల్ని కూడా పరిశీలించడానికై కగారి కొత్త పరికరాల్ని అభివృద్ధి చేస్తున్నది.

- అంటే, డాల్ఫిన్స్, పోర్పోయిస్‌లు కూడా తిమింగలాలే అయినా, తిమింగలాలన్నీ డాల్ఫిన్స్, పోర్పోయిస్ కావు.
- ముఖ్యంగా మా గుణగణాలు మానవులకు దగ్గరగా వుంటాయి.
- మేం మీలాగే ఊపిరితిత్తులతో శ్వాసిస్తాం. కాని, మీ ముక్కుపుటాల్లా కాకుండా, మాకు రంధ్రాలాంటి (blow holes) మార్గాలు వుంటాయి. ఇవి కొన్నింటికి రెండు వుంటే, కొన్నింటికి ఒకే రంధ్రం వుంటుంది.
- మా శరీర ఆకృతి చేపల్లా వుండి, వీపుపై, చివరన భారీ వృంతాలు (fins) వివిధ ఆకృతుల్లో వుంటాయి.
- మీలాగే పిల్లల్ని కని, పాలిచ్చి సాంఘికరణ (socialization) చేస్తాం.
- మీకు లేనటువంటి శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించే పొరలతో, వాటిలో కొవ్వుతో (blubber)కూడిన బాహ్య చర్మం వుంటుంది.
- మేం వేడిరక్తపు జీవులమే!



బ్లూ వేల్



స్పెర్మ్ వేల్

**మాది బలమైన సంఘ జీవనం!**

మీలాగే మేం సంతోషాల్ని, దుఃఖాన్ని, బాధల్ని (griefs)ను వ్యక్తపరుస్తాం. సహచరులతో పంచుకుంటాం. డాల్ఫిన్స్ అయితే, అనారోగ్యానికి గురైన, గాయపడిన సహచరులకు మీలాగా నర్సింగ్ సపర్యల్ని అందిస్తాయి. వాటి వెన్నంటి వుంటాయి. మేం ప్రత్యేకమైన శబ్దాలచే (whistles) సంకేతాల్ని పంపించుకుంటాం. మా శబ్దాలు అవసరాన్ని బట్టి మార్చుకుంటాం. మా పిల్లలకు వేటాడే విధానాన్ని, శత్రువులకు చిక్కకుండా తప్పించుకునే నేర్పరితనాన్ని అందిస్తాం. పోతే, మా శబ్దాలు మీ మానవులు భరించలేనంతగా (130 డిసిబుల్ కన్నా ఎక్కువ) వుంటాయి. ఈ శబ్ద తరంగాల్నే మీరు గుర్తించి, జాగ్రత్త పడడం, ఓడల్ని నడపడం చేస్తుంటారు.

**పలువరుస – జీవన విధానం !**

భారీ ఆకారం వున్నా, మాలో కొన్నింటికి దంతాలే వుండకపోవడం గమనార్హం! అందుకే మమ్మల్ని మొత్తంగా రెండుభాగాలుగా విభజించారు.

**దంతాలు లేనివి (mysticetes)**

- దంతాలు లేకుండా, పై దవడల నుంచి వేలాడే వడపోత (baleen)

లాంటి జల్లెడ (bristles made with, keratin) వుంటాయి.

- దీంతో మమ్మల్ని బలీన్ (balean) వేల్స్ అని కూడా సంబోధిస్తారు.
- సముద్ర పాచిని, క్రిల్స్‌ని (పీతల్ని) నీటి నుంచి వడపోసి, ఆహారంగా తీసుకోవడానికి ఇవి పనిచేస్తాయి.
- ఈ రకం తిమింగలాలు ధ్వనిని (echolocate) కల్గించలేవు.

ఇవి సుమారు 14 రకాలు :

ఉదాహరణకు : బ్లూ వేల్, ఫిన్ వేల్, హంప్‌బ్యాక్ వేల్, గ్రే వేల్, నార్త్ అంట్లాంటిక్ రైట్ వేల్ (కొంత అపాయకరమైనవి) మొ॥.

**దంతాలు కలవి (odontocetes)**

- ఈ రకం మీ లాగా దంతాలను కలిగి వుంటాయి.
- పెద్దస్థాయి జంతువుల్ని కూడా పట్టుకోని ఆహారంగా తీసుకుంటాయి.
- ధ్వనిని (echolocate) కల్గిస్తూ ముందుకు సాగుతాయి.
- ఇవి సుమారు 72 రకాలు :

ఉదా॥ స్పెర్మ్ వేల్ (అతి పెద్దది), ఓర్కా వేల్, బాటిల్ నోస్ వేల్, బెలుగా, హార్బర్ పోర్పోయిస్ మొ॥

- అలాగే డాల్ఫిన్స్‌కు, పోర్పోయిస్‌కు తేడాలుంటాయి. అతి చిన్న డాల్ఫిన్ (మాయిూస్ పొడవు 5-7 అడుగులు మాత్రమే!)



డాల్ఫిన్

**మా ప్రత్యేకతలు :**

- స్పెర్మ్ వేల్ తలలో నూనెలాంటి (spermacetic) జిగురు పదార్థ ముంటుంది. తిత్తిలాంటి ఈ అవయవం శబ్దాల్ని కల్గిస్తాయి. సముద్రమార్గంలో ఎదురుగా వచ్చే అడ్డంకుల్ని, పెద్ద పెద్ద ఓడల్ని ప్రతిధ్వని ద్వారా గుర్తించి జాగ్రత్తవడి దారి మళ్ళుతాయి.
- ఈ జిగురును మీ మానవులు దీపాలకు, కొవ్వు వత్తులకు, కందెనలుగా ఉపయోగించుకుంటారు.
- మా చర్మాలు పొరలతో మందంగా వుంటాయి. ఈ పొరల్లో కొవ్వు (fat) వుంటుంది. దీంతో మా శరీర ఉష్ణోగ్రతల్ని నియంత్రించుకుంటాం. దీన్నే బ్లబ్బర్ అంటారు.
- మేం చనిపోతే, ఈ పొరల్లోని కొవ్వే మమ్మల్ని నీటిపై తేలేలా చేస్తుంది.
- మేం కూడా మంచి పాటలు పాడుతాం. ఇవే మా ఉనికిని తెలియ జేస్తాయి. సమూహంగా వుండడానికి తోడ్పడుతాయి. బెలూగా వేల్ (beluga) దీంట్లో మరింత నైపుణ్యతను గలిగి వుంటుంది.
- మా తల తిప్పడానికి అనుకూలంగా వుంటుంది.
- సాధారణంగా మా జీవిత కాలం వంద సం॥లు కాగా, మాలోని బౌహెడ్ వేల్ (bow head) సుమారు 200 సం॥ జీవిస్తాయి. అంటే, భూమిపై వృక్షాల్లా జీవించే దీర్ఘకాలిక జంతువులం మేమే!
- మూడు కిలోమీటర్ల లోతువరకు మేం డైవ్ (dive) చేయగలం.
- సుమారు రెండు గంటలు నీటిలో వుండగలం.
- దాదాపు 16,000 కి.మీ. దూరాల వరకు, కాలానుగుణంగా మేం వలసపోతాం.
- స్థూలంగా చెప్పాలంటే సముద్రాల్లో మానవునికి నడక నేర్పింది మేమే! మా ఆకృతులను బట్టే మీరు ఓడ నిర్మాణాలను, క్రూజులను నిర్మించుకుంటున్నారు. అంటే, మీ తెలివికి మూలం మేమే!



పోర్పోయిస్

**మా ఉపయోగాలు :**

మా ఉపయోగాలు అంతా ఇంతా కాదు. దాదాపు మానవుడి అభివృద్ధికి, జీవన విధానానికి మేం తోడ్పడని రోజులేదు. సబ్బులు, కొవ్వత్తుల, కందెనల తయారిలో, బట్టల పరిశ్రమలో, సుగంధ పరిమళాల తయారిలో, ఫ్యాషన్ వస్తువులకు, అలంకరణ వస్తువులకు, గొడుగు పుల్లలకు, సిగరెట్ పరిశ్రమల్లో మా కొవ్వుల్ని, ఇతర భాగాల్ని వాడుతారు. ఇక మందుల పరిశ్రమల్లో, ఆరోగ్య సంబంధమైన గుండె జబ్బులకు, జీర్ణకోశ వ్యాధులకు, చర్మ సంబంధ వ్యాధులకు కూడా దీన్ని విరివిగా వాడుతారు. పరోక్షంగా చెప్పాలంటే, మీ నిత్య జీవితంలో మేం అన్నింటా మీతో వుంటామన్న మాట.

**ముగింపు :**

ముగింపు మా ఆత్మకథ గూర్చి కాదు. ఈ భూమిపై మేం కనుమరుగైతే, బహుషా భూగోళం చివరిదశ కావచ్చు అనేది. ఓ మహా వృక్షం ఎన్నివిధాలుగా, ప్రాణవాయువుతో సహా ఉపయోగపడుతుందో, మేం అంతే ఉపయోగపడుతాం. చెట్లు లేని భూగోళం ఎలావుంటుందో, మేం లేని భూగోళం కూడా అంతే అని గ్రహించండి.

పోతే మా గూర్చిన రక్షణ చట్టాలు ప్రపంచవ్యాపితంగా వున్నాయి. మా గూర్చిన చర్చలున్నాయి. కాని, ఆచరణలోనే నిర్లక్ష్యం. అమెరికాతో సహా, ప్రపంచ దేశాలన్ని మా రక్షణ చట్టాల్ని పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు మిలియన్ సంఖ్యలో ప్రపంచ

## జీవ పరిణామానికి నిలువెత్తు సాక్ష్యం - ప్లాంక్‌టన్ (PLANKTON)


ఫ్యోటో ప్లాంక్టన్


జూ ప్లాంక్టన్

సృష్టంతా జీవవైవిధ్యభరితమైనదే! మానవమేధ ఎంత శోధించినా, అంతుచిక్కని ప్రకృతి రహస్యాలు అనేకం! ముఖ్యంగా జీవరాశిని ఒకప్పుడు వృక్ష, జంతు శాస్త్రంగా విభజించారు. తర్వాతి కాలంలో దీనికి సూక్ష్మజీవశాస్త్రం వచ్చి చేరింది. ఈ సూక్ష్మజీవశాస్త్రం కూడా ఇప్పటికి క్లిష్టంగానే కనపడుతుంది. చాలా సందర్భాలలో ఈ జీవులు రెండురకాలైన, వృక్ష, జంతు సంబంధ జీవనచర్యల్ని కలిగి వుండడం గమనార్హం! దీనికి క్లామిడోమోనాస్, యూగ్లీనాల్ని ఉదాహరణగా చెపుతాం. ఈ దిశగా పరిశోధనలు మరింత ముందుకెళ్ళడం, మరిన్ని జీవులు వృక్ష, జంతు సంబంధమైన చర్యల్ని జరుపుతాయని చూపుతున్నాయి. అలాంటి వాటిలో సముద్ర సంబంధమైన ప్లాంక్‌టన్ ఒకటి.

ప్లాంక్‌టన్ అనగా గ్రీక్‌లో డ్రిఫ్టర్ – (drifter ) లేదా సంచారి (wanderer) అని అర్థం. అయితే ఈ సమాచారం సముద్ర అలలచే జరుగుతుంది. ఇందులో కొన్ని పెరిగి పెద్దవైతే స్వయంగా నీటిలో ఈదడం, ఎదురీదడం చేస్తుంటాయి. వీటి నిడివి 2.5 సెం.మీ. కన్నా తక్కువగా వుంటాయి. వీటి జీవన చర్యల్ని బట్టి శాస్త్రజ్ఞులు రెండు రకాలుగా విభజించారు.

1) ఫైటోప్లాంక్‌టన్ (Phytoplankton)

2) జూప్లాంక్‌టన్ (Zooplankton)

ఇందులో మొదటిది వృక్ష సంబంధమైనది కాగా, రెండోది జంతు సంబంధమైనది. ఫైటోప్లాంక్‌టన్ భూమిపై వృక్షాల్లా వాటిలోని పత్రంహరితంతో కిరణజన్యసంయోగ క్రియ జరుపుకుంటూ సముద్రపు ఆహారపు గొలుసులో ప్రధానపాత్రను పోషిస్తాయి. ఇవి ఉపరితలంగా కదలుతూ కార్బన్‌డయాక్సైడును గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ఈ విధంగా భూగోళ జీవరాశికి కావల్సిన 70 శాతం ఆక్సిజన్‌ను ఈ ప్లాంక్‌టన్ మొక్కలే ఉత్పత్తి చేస్తాయంటే ఆశ్చర్యమే!

ఇక రెండో రకం జూప్లాంక్‌టన్ అతి సూక్ష్మమైన జీవులు. వీటిలో సూక్ష్మ పీతలు (krill), అతి సూక్ష్మ నత్తగుల్లలు (sea snails), పెలాజిక్ క్రిములు (pelagic) మొదలగునవి వుంటాయి. ఇవి ఫైటోప్లాంక్‌టన్‌పై ఆధారపడి జీవిస్తాయి. ఇతర పెద్ద జంతువుల నుంచి రక్షణ కోసం దినమంతా సముద్రలోతుల్లోకి వెళ్ళి, రాత్రుల్లో ఉపరితలానికి వస్తాయి. అందుకే వీటిని జీవితాంత వలస జీవులుగా పరిగణిస్తారు. వీటిలో పత్రహరితముండదు.

ఫైటోప్లాంక్‌టన్ అత్యధికంగా ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలు కాబట్టి, సముద్ర ఉష్ణోగ్రతను, P$^H$ విలువను నియంత్రించి, పోషకాల్ని పెంపొందిస్తాయి. సముద్ర ఉపరితలంలో ఓ తివాచీలా పనిచేసే ఈ సముద్ర వృక్షజాలం అనేక కారణాలచే, కలుషితంచే దెబ్బతింటున్నది. ఇది రక్షించబడక పోతే, అతి తొందరలోనే భూగోళ ఉపరితలం ఆక్సిజన్ కొరతను ఎదుర్కొంటుంది. అప్పుడు జీవరాశి మనుగడకే పెను ప్రమాదం సంభవిస్తుంది.

సముద్రాల్లో ఈదులాడిన మా జాతి 200 సం॥ల క్రితం 1.5 మిలియన్లకు పడిపోయింది. బ్లూ వేల్స్ 25,000కు పడిపోయాయి. నార్త్ అట్లాంటిక్ రైట్ వేల్స్ కేవలం 500 గా, అత్యంత ప్రమాదకర పరిస్థితిలో వున్నాయి. రెడ్‌లిస్టు (Red List)లో అత్యంత శీఘ్రంగా అంతరించుతున్న అతి భారీ జంతువుగా చేర్చింది. స్పెర్మ్ వేల్స్ సుమారు మూడు లక్షలే! ఇవన్నీ అంచనాలే! వాస్తవ పరిస్థితి ఇంతకన్నా దారుణంగా వుంది. అందుకే IUCN వేదిక మమ్మల్ని అత్యంత ప్రమాదకర స్థితిలో వున్న జాతిగా ప్రకటించింది. మీకు అత్యంత వినోదాన్ని కల్గించే డాల్ఫిన్ల స్థితి కూడా బాధాకరమే! ఉక్రేయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా యుద్ధనౌకల వల్ల సముద్రంలో కల్గిస్తున్న కలుషితాలకు, భీకర శబ్దాలకు సుమారు 50,000కు పైగా డాల్ఫిన్స్, పోర్పోయిస్‌లు మృత్యువాత పడ్డాయని అంచనా! ఇప్పుడు చెప్పండి. మా దీనపరిస్థితికి కారకులెవరో! వేం కనుమరుగైతే భవిష్యత్ చిత్రపటం ఎలా వుంటుందో!

- తెల్లని స్పెర్మ్‌వేల్‌పై హెర్మాన్ మెల్విల్లే (Herman Melville) రాసిన మోబిడిక్ (moby dick) నవల మాపై ఎంత తప్పుడు ప్రచారాన్ని కల్గించిందో చదవండి!
- డాల్ఫిన్‌పై వచ్చిన ఫ్లిప్పర్ (Flipper) టీవి సీరియల్ చూడండి!

*(వచ్చే సంచికలో పక్షుల దయనీయ స్థితిని చూద్దాం!)*

– డా॥ లచ్చయ్య గాండ్ల,
m : 9440116162
e : drglachaiah@gmail.com

# తెలంగాణ గిరిజనుల
# సంప్రదాయ వాద్యాలు-వైవిధ్యం

తెలుగు రాష్ట్రాల్లో గిరిజన తెగలుగా గుర్తించబడిన 35 తెగలు తమ సంస్కృతిలో భాగంగా జరుపుకునే పండుగలు, దేవతల కొలుపులు, పెళ్లిళ్లు, చావు పుట్టుకలు, వినోదాలు వంటి సందర్భాల్లో సంగీత వాద్యాలను ఉపయోగిస్తారు. వీరు ఆయా సందర్భాన్ని బట్టి ప్రత్యేకమైన వాద్యాలను వాయించుకుంటూ తమ సాంస్కృతిక జీవనాన్ని గడుపుతున్నారు. అనాదిగా వాద్యం వారి జీవితంలో భాగమై ఆయా గిరిజనుల విభిన్న సాంస్కృతిక వైవిధ్యాన్ని తెలియజేస్తున్నవి. ఆంధ్రప్రదేశ్‌లో కనిపించే భగత, వాల్మీకి, కొండదొర, నూకదొర, కమ్మర, గదబ, గౌడ, కొటియా, సవర, ఖోంధ్, హిల్ రెడ్డి, పోర్జ, మన్నె దొర, జాతాపు మొదలైన గిరిజన తెగలు డోలు, డప్పు, తుడుం, కిద్ది వంటి వాద్యాలనే ఉపయోగించటమే కనిపిస్తుంది. సహజంగా వీరు ఉపయోగించే వాద్యాలు మిగతా తెగలు కూడా ఉపయోగిస్తాయి. ఆయా తెగలకంటూ ప్రత్యేకమైన వాద్యాలు కనిపించవు.



**ఉద్దేశ్యం:**

తెలంగాణా ప్రాంతంలో కనిపించే, గోండు, తోటి, పర్ధాన్, కోలాం, అంధ్, చెంచు, నాయకపోడు, కొండరెడ్డితో పాటుగా మైదాన ప్రాంత గిరిజనులైన బంజారా, ఎరుకల, నక్కల వంటి తెగలు ఉపయోగించే వాద్యాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఇందులో కోయ గిరిజనుల ఉపతెగలైన డోలి, పట్టెడ మరియు బంజారా ఉపతెగలైన ఢాడి, భాట్స్ మరియు డప్పుడియా వారు ఉపయోగించే వాద్యాలు ప్రత్యేకతను సంతరించుకున్నవి. ఇందులో డోలి ఉపతెగ వారు ఉపయోగించే వాద్యం కారణంగానే వారికి ఆ పేరు స్థిరపడింది. ఈ రకంగా ఆ వాద్యం వారి సంస్కృతిలో ఎంతటి ప్రాధాన్యత సంతరించుకుందో తెలుస్తుంది. అదేవిధంగా తమ దేవతలకు ప్రతిరూపాలుగా కొలిచే వాద్యాలు, ప్రత్యేక సందర్భాల్లోనే వాయించే వాద్యాలు, ప్రకృతి సహజసిద్ధమైన వాద్యాలు,తెగ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే వాద్యాలు మరియు వాద్యాల తయారీలో ఉపయోగించే ప్రత్యేకమైన వస్తువులు, విశ్వాసాలకు సంబంధించి 71 రకాల వాద్యాలు తెలంగాణ గిరిజనులు ఉపయోగిస్తున్నారు. అయితే గిరిజనులు ఉపయోగించే వాద్యాలు కాలానుగుణంగా వస్తున్న మార్పులకు లోనయ్యి పరిణామం చెందుతున్నవి. వీటన్నింటిని తెలియజేస్తూ గిరిజనుల వాద్యాల సంస్కృతి వైవిధ్యాన్ని వైశిష్యాన్ని పరిచయం చేయాలని ఉద్దేశంతో రాయడం జరిగింది.

**తెలంగాణ గిరిజనులు ఉపయోగించే వాద్యాలు**

**అంధ్ గిరిజనులు:**

ఏక్తారా, డోలక్, డప్పుడి, తార్, మంజీరా, డోల్కి జాన్జర్, డోలు .

**చెంచు గిరిజనులు:**

తప్పెట, 12 మెట్ల కిన్నెర, జేగంట, డప్పు

**కోయ గిరిజనులు:**

కొమ్ముడోలు, తూతు కొమ్ము, అందెలు, అక్కుమ్, గజ్జెల పట్టా, సన్నాయి, మేళం, మువ్వలు.

**కోయ ఉపతెగలు:**

డోలికోయ - డోలి

పట్టెడ కోయ - రావణాస్త్రం

**గోండు గిరిజనులు:**

గుమేల, తుడుం, టపాల్ డోలు, జోడు కోలలు,

వెట్టె, పర్ర, డప్పు.

**తోటి గిరిజనులు:**

కికిరి ,కుజ్జా దక్కి, డోలు, కాలికోమ్, సన్నాయి, బొంగా టిప్లింగ్ /చిటికెలు, తమ్మెడ బాజా, తోటి బుర్ర, 12 మెట్ల కిన్నెర, తుడుం మద్దెల, తాళాలు, గజ్జెలు, హార్మోనియం.

**కొండ రెడ్డి గిరిజనులు**

గిల్ల కాయలు/ దామర గుత్తులు, ఔజం, డోలు.

**పర్ధాన్ గిరిజనులు:**

సుర్నేయి, డోలు, బొంగా, కీకిరి డప్పుడి, వెట్టే పర్ర, కాలీకోమ్, తుడుం, డప్పు.

**కోలాం గిరిజనులు:**

డోలు, డప్పు, పిల్లన గోయి, తుడుం, దుల్కి, గుమేల.

**నాయకపోడు గిరిజనులు:**

తప్పెట, పిల్లనగోయి, మూగడోలు, అందెలు, డప్పు.

**బంజారా గిరిజనులు:**

నంగారా, ఇత్తడి పల్లెం, డప్పు, కచోడో, తాళాలు, చిరతలు.

**బంజారా గిరిజనుల ఉపతెగలు:**

**భాట్స్:** రబాబ్, జంనగ/ జంగ్, చిరతలు, తాళాలు, నగారా.

**ధాడి:** సారంగి

**డప్పుడియా:** డప్పు

**ఎరుకల గిరిజనులు:**

సోది కిన్నెర, ఏక్తారా.

**నక్కల గిరిజనులు:**

దేంచుక, కసాలి వంటి వాద్యాలు ఉపయోగిస్తారు.

తెలంగాణ ప్రాంతానికి చత్తీస్గడ్ నుండి వలస వచ్చి ఏటూర్ నాగారం పరిసర ప్రాంతాల్లో స్థిరపడిన గుత్తి కోయ గిరిజనులు డోలు కొయ్య గుజ్జిడి అనే ప్రత్యేకమైన వాద్యాలను ఉపయోగిస్తారు. అయా గిరిజన తెగలు ఉపయోగించే కొన్ని వాద్యాలు ఒకే రకంగా కనిపించినప్పటికీ వాటిలో కొద్దిపాటి బేధ సాదృశ్యాలు కనిపిస్తాయి.

గిరిజన తెగలన్నింటిలో డప్పు వాద్యం సర్వసాధారణంగా కనిపిస్తుంది.

ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లోని గిరిజనులు ఉపయోగించే డప్పులు ఆకారంలో చిన్నగా, పెద్దగా ఉంటాయి. పెద్దగా ఉండే డప్పులు ఆకర్షణీయంగా ఉండటమే గాక ఉత్సాహాన్ని కలిగించే శ్రావ్యమైన ధ్వనిని సృష్టిస్తాయి. డప్పులను తయారు చేసుకోవడానికి కావలసిన పట్టీ కోసం కుక్కెలికి కర్ర లేదా ఆరెకర్ర లేదా టేకు కర్రను ఉపయోగిస్తారు. ఈ పట్టీకి చర్మాన్ని ముడుచుకోవడానికి దారుగు చెక్క, మొర్రి పండు బంకను బాగా ఉడికించి జిగురు తయారు చేసుకుంటారు. ఆ జిగురును పట్టీ అంచుకు రాస్తూ, చర్మాన్ని ముడుచుకోవడం జరుగుతుంది. ఇక ఆదిలాబాద్ ప్రాంతానికే



చెందిన తోటి మరియు పర్ధాన్ తెగ ఉపయోగించే కీకిరి వాద్యాన్ని తంత్రీలు మరియు చర్మంతో కలిసి తయారు చేసుకుంటారు. ఈ కీకిరి వాద్యంతో కళాకారులు గోండు సంస్కృతికి చెందిన అన్నోరాని, సదర్భీడి వంటి కథలను కథాగానం చేస్తారు. ఈ వాద్యం మణిపూర్ లోని పేనా, ఒరిస్సాలోని కెన్రా బాణం, రాజస్థాన్లో రావణ హట్టా, కేరళలోని వీణాకుంజ్ వంటి వాద్యాల పోలిక ఉంటుంది. దీనిని పర్ధాన్ మరియు తోటి గిరిజనులు మహంకాళి శక్తి నాలుకకు ప్రతిరూపంగా, హీరాబాయికి ప్రతిరూపంగా కొలుస్తారు. ఇక వాద్యాన్ని వాయించడానికి ఉపయోగపడే కుజ్జాను జల్లిదేవరకు ప్రతిరూపంగా కొలుస్తారు. ఈ కుజ్జాను బర్రె కొమ్ముతో విల్లు మాదిరిగా తయారు చేసుకుని దానికి గుర్రపు వెంట్రుకలను మందంగా విల్లుకు దారం కట్టినట్లుగా కడతారు. ఈ విల్లుకే చిన్న గజ్జెలు మరియు పెద్ద గజ్జెలు అల్లుకుంటారు. పెద్ద గజ్జెల్లో వాయించే కళాకారుడు తోటి మరియు పర్ధాన్ తెగలో ఏ సగకు చెందిన వారైతే ఉదాహరణకు ఆ కళాకారుడు నాలుగో సగాకు చెందినవాడైతే నాలుగు పెద్ద గజ్జెలు అల్లుకుంటాడు. ఇది వారి అస్తిత్వానికి ప్రతీకగా కట్టుకుంటారు. ఈ రకంగా వాద్యాలను తాము కొలిచే దేవతల ప్రతిరూపంగా కూడా కొలుస్తూ కనిపించడం విశేషం.

**ప్రత్యేక సందర్భాల్లో వాయించే వాద్యాలు:**

గిరిజనులు ఉపయోగించే కొన్ని వాద్యాలను కేవలం పండుగలు, దేవతల కొలుపుల సందర్భాల్లోనే బయటకు తీసి పవిత్రంగా వాయిస్తారు. ఇటువంటి వాద్యాల్లో గోండు గిరిజనులు ఉపయోగించే గుమేల, పర్ర, వెట్టె వంటి చర్మ వాద్యాలు వారి సంస్కృతిలో అత్యంత పవిత్రమైనవిగా భావిస్తారు. ఇందులో గోండు వారిలోని నాలుగో సగా వారు 'గుమేల' వాద్యాన్ని దండారి దేవతకు ప్రతిరూపంగా కొలుస్తారు. అట్లాగే పర్ర వాద్యాన్ని ఐదు వేల్పుల వారు తమ దేవతకు ప్రతిరూపంగా పూజించడం విశేషం. అదేవిధంగా వెట్టె వాద్యాన్ని ఏత్మాసూర్ దేవతకు పతిరూపంగా కొలువడం కనిపిస్తుంది. ఈ రకంగా వాద్యాలను తమ దేవతలకు చిహ్నాంగా చూస్తూ, కొలిచే విధానం గోండు సంస్కృతిలో దర్శనమిస్తుంది. ఈ వాద్యాలను గోండు వారు దండారి పండుగ సందర్భంగా బయటకు తీసి గుస్సాడీలో భాగంగా నిష్టతో వాయిస్తారు. మిగతా రోజుల్లో బయటకు తీయడం గానీ, బయటి వ్యక్తులకు చూపించడం కానీ చేయరు. ఇందులో పర్ర వాద్యం మద్దెల మాదిరిగాను, వెట్టే వాద్యం కంజర ఆకారంలో వెడల్పుగా చర్మంతో ముడవబడి ఉంటుంది. పర్ర వాద్యానికి సహ వాద్యమైన వెట్టె వాద్యం మీద 18 రకాల దరువులు వాయిస్తారు. దీనికి అనుగుణంగా పర్రను వాయించడం జరుగుతుంది. వెట్టె, పర్ర వాద్యాలను జోడువాద్యాలని పిలుస్తారు. గుస్సాడీలో ఈ రెండు వాద్యాల సంగీతానికే టప్పాల్, కొండల్ ధరించిన వారికి దేవుడు పూనకం వస్తుంది. వీటి వాయింపుతో పాటుగా గుమేల, డప్పులు ఉపయోగిస్తారు. వెట్టె వాద్యానికి చర్మాన్ని ముడుచుకునేప్పుడు తప్పనిసరిగా స్త్రీ బహిష్టు ఉన్న రోజుల్లోనే ఆ వెట్టె ను తాకిస్తారు. తద్వారా అది పవిత్రమవుతుందని విశ్వసిస్తారు. ఇంకా గిరిజన తెగల్లో జంతువు పేరుతో పిలవబడే నక్కల తెగ ప్రత్యేకమైనది. తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న నక్కల వారు తమ మూల సంస్కృతిని అనుసరించి సంప్రదాయ వేట, చిరు వ్యాపారాలు చేసుకుంటూ, సంచారం చేస్తారు. వీరిని పిట్టలోళ్ళు అని కూడా పిలుస్తారు. నక్కల వారు తమ వంశదేవతలను భద్రపరుచుకునే స్వామి మూటతోపాటుగా పవిత్రంగా భద్రపరచుకునే వాద్యాలు దేంచుక, కసాలి వాద్యాలు. వీరు వంశాల వారీగా సామూహికంగా దేవతలను దసరా లేదా శివరాత్రికి కొలుస్తారు. ఈ సందర్భంలోనే స్వామి మూటలోని విగ్రహాలను తీసి పండుగ చేస్తారు. ఇదే

సందర్భంలో వాద్యాలను బయటకు తీసి పవిత్రంగా వాయిస్తారు. గిరిజన తెగలు ఉపయోగించే వాద్యాల్లోనే దేంచుక వాద్యం ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఇది తంత్రీ వాద్యం. బైండ్ల కళాకారులు ఉపయోగించే జమిడిక మాదిరిగా కనిపించినప్పటికీ, తయారీలోనూ వాయించడంలోనూ భిన్నంగా ఉంటుంది. ఇది సుమారుగా మూరెడున్నర పొడవు వృత్తాకారం నుండి జానెడు వెడల్పు ఉంటుంది. దీని తయారీకి మొగిలి చెట్టు మొద్దు బోధగద్దనరం, మేక చర్మం, పాచి తీగ, గజ్జెలు మరియు ఇనుప రింగులు ఉపయోగించి తయారు చేస్తారు. దీన్ని వాయిస్తుంటే నాలుగైదు మైళ్ల శ్రావ్యమైన శబ్దం వినిపిస్తుంది. ఇక కసాలి వాద్యాలు, ఇవి తాళాల మాదిరిగా ఉండి కంచుతో తయారు చేయబడినవి. వీటిని కూడా పండుగ సందర్భంలోనే బయటకు తీసి వాయిస్తారు. అదేవిధంగా నాయక పోడు గిరిజనుల ఇలవేల్పు లక్ష్మీదేవర. లక్ష్మీ దేవర ఆలయాలు నాయకపోడు గిరిజనులు ఉండే గూడెంలో ఉంటాయి. ఆ గుడి దగ్గర లక్ష్మీదేవర ప్రతిమను నిలుపుకొని పూజిస్తారు. అక్కడ గిరిజనులు అత్యంత పవిత్రంగా భావించే మూగడోలును భద్రపరుస్తారు. ఇది సుమారుగా రెండు మీటర్ల పొడుగుతో ఇద్దరు కళాకారులు రెండు వైపులా వాయించేందుకు వీలుగా ఉంటుంది. కేవలం లక్ష్మీ దేవర కొలుపులోనే దీన్ని ఒక గుంజకు తగిలించి ఇద్దరు వ్యక్తులు చెరో వైపు ఉండి వాయిస్తారు. ఈ వాద్యాన్ని నాయక పోడు గిరిజనులు తమ దేవుడైన మూగలరాయునికి ప్రతిరూపంగా, పవిత్రంగా కొలుస్తారు.



అంధ్ గిరిజనులు ఆదిలాబాద్ ప్రాంతంలో అంధ్ లకే మరాఠీ భాషలో కండోభ కథను చోండ్కా, మంజీరా, డప్పులు, డోలక్, తాళాలు వంటి వాద్యాలను ఉపయోగించి కథాగానం చేస్తారు. వీరు ప్రదర్శనలో ఉపయోగించే చోండ్కావాద్యాన్ని చర్మం మరియు తంత్రీతో కలిపి ప్రత్యేకంగా తయారు చేసుకుంటారు.

చర్మవాద్యాలలో తెలంగాణా ప్రాంత గిరిజనులు ఉపయోగించే డోళ్లు ప్రత్యేకమైనవి. కోలాం, గోండు, తోటి, పర్ధాన్ ఈ నాలుగు తెగలవారు ఒకే రకమైన డోలును పెండ్లి మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో వాయిస్తారు. ఈ డోలు సహాయంతో పెళ్లిలో జరిగే ప్రతీ తంతుకు ఒక్కొక్క రకంగా పదహారు రకాల దరువులను వాయించడం విశేషం. డోలు సంగీతాన్ని బట్టి పెళ్లిలో ఏ తంతు జరుగుతుందో గుర్తుపడతారు. డోలు తయారీలో ఎక్కువ రోజులు మన్నిక గలిగే సంద్రేగి కర్రను ఉపయోగిస్తారు. ఈ కర్రను కూడా అడవి నుండి అమావాస్య రోజున తెచ్చుకుంటే కర్ర చెదలు పట్టకుండా ఉంటుందని విశ్వసిస్తారు. అంతేకాకుండా డోలు తయారీలోనే ఆయా తెగలు ఏ సగాకు చెందినవారో ఉదాహరణకి నాలుగో సగా వారైతే నాలుగు గీతాలను ఆ డోలు మీద గీయించుకుంటారు. ఇది వారి సాంస్కృతిక అస్తిత్వానికి చిహ్నంగా భావిస్తారు.

ఆదిలాబాద్ ప్రాంతంలోని గిరిజనులు ఉపయోగించే చర్మవాద్యాలలోనే ప్రత్యేకమైనది తుడుం వాద్యం. దీనిని గోండు, పర్ధాన్, తోటి, కోలాం తెగవారు ఉపయోగిస్తారు. వీరంతా తుడుం వాద్యాన్ని అత్యంత పవిత్రంగా చూసుకుంటారు..' ఇది సుమారుగా రెండు జానల్ల వెడల్పు, జానెడున్నర ఎత్తుతో ఉంటుంది. ఓజా అనే ప్రత్యేకమైన జాతితో తయారు చేయించుకుంటారు. దీన్ని తయారు చేయించుకున్నందుకు ప్రతిఫలాన్ని డబ్బులతో వెలు కట్టలేరు. నాలుగు కాళ్ల జంతువుల్లో ఆవు దూడను గానీ మేక పిల్లగానీ దానంగా ఇస్తారు. ఓజాలు కూడా 360 మేకులను గోండు జాతి దేవుళ్లకు ప్రతిరూపంగా తుడుం నిర్మాణంలోనే కొట్టి,పవిత్రంగా తయారు చేసి ఇస్తారు. అందుకే తుడుం ను ఆయా తెగలు అత్యంత పవిత్రంగా చూసుకోవడం జరుగుతుంది. దీనికి మందంగా ఉండే ఎద్దు లేదా మెకం లేదా దుప్పి చర్మాన్ని ముడుచుకుంటారు. దీనిని వీరి ఆటపాటల్లో దేవతల కొలుపుల్లో, పెళ్లిళ్ల, ఊరేగింపులు, దేవతల కొలుపులు వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రధానంగా వాయిస్తారు.

ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంతంలోని బంజారాలు నృత్యం చేసే సందర్భంలో వాయించే నగారా వాద్యం కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ వాద్యం ఆకర్షణీయమైన ధ్వనిని పలికిస్తూ ఉత్సాహాన్ని కలిగిస్తుంది. బంజారాల ఉప తెగలు ధాడీ మరియు భాట్స్ కళాకారులు వాయించే సారంగి, రబాబ్ అనే తంత్రీవాద్యాలు చాలా పురాతనమైనవి. ఈ వాద్యాలను ఉపయోగిస్తూ బంజారులకు కథాగానం చేస్తారు. వీరు ఉత్తర భారతం నుండి వచ్చిన వారు కావటంతో ఆ ప్రాంతంలో ఉపయోగించే వాద్యాలకు వీరు వాయించే వాద్యాలకు సాదృశ్యం కనిపిస్తుంది. సారంగి, రబాబ్ వీరికి ఏ రకంగా సంక్రమించాయో వాటికి చెందిన మౌఖిక కథలు కూడా వినిపిస్తాయి. ఈ వాద్యాల మీద తమ పూర్వీకులను మరియు దాతల పేర్లు రాగి రేకుల మీద రాయించుకొని వేయించుకుంటారు. బంజారులు వారి ఉపతెగలు డప్పులు, తాళాలు, చిరుతలు, మద్దెల, నగారా, రబాబ్, సారంగి వాద్యాలన్నింటిని వారి సంస్కృతిలో భాగంగా ఉపయోగిస్తున్నప్పటికి వీరి రబాబ్, సారంగి వాద్యాలను అత్యంత పవిత్రంగా, సరస్వతీ దేవికి ప్రతిరూపంగా చూసుకుంటారు.

గిరిజనులు వాద్యాలకు మేక, ఆవు, మేకం, ఉడుము వంటి జంతువుల చర్మాన్ని ఉపయోగించి ముడుసుకుంటారు. చర్మ వాద్యాలైన డోలక్, డోలు, మద్దెల, దుమ్కి, తమ్మెడ బాజ,

మూగడోలు, కొమ్ము డోలు మొదలైన వాద్యాలకు చర్మాన్ని ముడుసుకున్న తర్వాత డోలు రెండు వైపులా ఒకే రకమైన శబ్దం రాకుండా ఉండేందుకు ఒక పక్కన ఒగ్గం దీనినే ఒంగం లేదా కందెన, ఓం, బోనం అని కూడా అంటారు. దీన్ని డోలుకు ఒక ప్రక్కన పెట్టుకుంటారు. దీని వల్ల డోలును వాయించినపుడు 'గుమ్ గుమ్' అని శబ్దం చేస్తుంది. ఈ రకంగా డోలులో రెండు వేరు వేరు ధ్వనులను పలికించే విధంగా తయారు చేసుకుంటారు. ఈ చర్మవాద్యాలలోనే అతి పలుచని చర్మం పొరను ఉపయోగించి కూడా వాద్యాలను ముడుసుకుంటారు. తోటి మరియు పర్ధాన్లు ఉపయోగించే కీకిరి, దక్కీ వంటి వాద్యాలకు పలుచని మేక లేదా ఆవు పత్రను ఉపయోగించి ముడుసుకుంటారు. ఇక గోండు గిరిజనులు వాడే గుమేలకు ప్రత్యేకంగా ఉడుము చర్మాన్ని ముడుసుకోవడం విశేషం. ప్రతి వాద్యానికి కింది భాగంలో చిన్న రంధ్రం ఉంటుంది . ఇక్కడి నుండే శబ్దం బయటికి వస్తుందని, ఆ భాగాన్ని జీవర అని పిలుస్తారు. అక్కడ వాద్యానికి ప్రాణం ఉంటుందని, బొట్టు పెట్టి పూజిస్తారు గిరిజనులు.



అదేవిధంగా అతి ప్రాచీనమైన పన్నెండుమెట్ల కిన్నెర, తోటి బుర్ర, ఏక్తార మొదలైన తంత్రీవాద్యాల్లో చేదు ఆనపకాయ బుర్రను, ఆడవెదురు బొంగును మాత్రమే ఉపయోగించి తయారు చేసుకుంటారు. ఈరకమైన వస్తువులను వాద్యం తయారీలో ఉపయోగిస్తేనే తాము చెప్పబోయే కథకు, శృతికి వాద్యం అనుకువుగా శ్రావ్యమైన సంగీతాన్ని పలికిస్తుందంటారు కళాకారులు. తోటి గిరిజన కళాకారులు పన్నెండు మెట్ల కిన్నెరను వాయిస్తూ జంగులింగు కథ, ఎల్లమ్మకథ, కృష్ణలీల, మహాభారతం కథలను చెప్పడంతో పాటుగా తోటి బుర్రను ఉపయోగించి కూడా పాండవుల కథలను గానం చేస్తారు. వీరు తోటి బుర్రను భీముని 'గద' గా భావించుకొని పూజచేస్తారు. కొందరు బుర్రకు నెమలీకలు అలంకరించుకుంటే లక్ష్మీచేకూరుతుందని విశ్వసిస్తారు. ఈ రకంగా వాద్యాల మీద ఇటువంటి విశ్వాసాలు విరివిగా కనిపిస్తాయి.

### ప్రకృతి సహజసిద్ధమైన వాద్యాలు:

ఆదిమ జాతులు మొదట సహజంగా ప్రకృతిలో లభించే అరుదైన వస్తువులనే సంగీత వాద్యాలుగా ఉపయోగించుకున్నారు. నేటికీ ఆదివాసీలు అదే సంస్కృతిని అనుసరిస్తున్నారు. మీరు ప్రకృతిలో ధ్వనికి హేతువైన కాయలు, గింజలు, వెదురు కర్రలు వంటివి కూడా వాద్యాలుగా ఉపయోగించుకోవడం కనిపిస్తుంది.అందుకే గిల్లకాయలను కూడా సంగీత వాద్యంగా తయారు చేసుకునే నైపుణ్యం కూడా కొండ రెడ్డి గిరిజనుల్లో కనిపిస్తుంది. ఇంకా వీరి తెగకే చెందిన ప్రత్యేకమైన వాద్యం 'ఔజం'. దీని సంగీతం విశిష్టమైనది. దీని శబ్దం నాలుగైదు మైళ్ళ దూరం వినిపిస్తుందంటే అతిశయోక్తికాదు. ఇది వీరి తెగకు అస్తిత్వపు ప్రతీకగా భావిస్తారు. అట్లాగే తోటి గిరిజనులు గోండులకు కథ చెప్పే సందర్భంలో గరిట మాదిరిగా ఉండే రెండు కర్రలతో శబ్దం చేస్తూ వాయించే వాటిని చిటికలు లేదా టిప్లింగ్ అంటారు. వీటి శబ్దం సహజ సిద్ధంగా, శ్రావ్యంగా ఉంటుంది. అదేవిధంగా గోండు గిరిజనులు గుస్సాడీ సందర్భంలో గుమేల వాద్యంతో పాటుగా వాయించే టపాల్ వాద్యం కూడా కర్రతో చేయబడి ఉంటుంది. దీని శబ్దం కూడా సహజ సిద్ధంగా శ్రావ్యంగా ఉంటుంది. ఇవే కాకుండా కోలాం గిరిజనులు మరియు నాయకపోడు గిరిజనులు ప్రకృతిలో సహజంగా లభించే ఆడ వెదురు బొంగును పొడవైన పిల్లనగోయిగా తయారు చేసుకుని సంగీతాన్ని పలికించడం గిరిజనులకే చెల్లింది.

గిరిజనులు చర్మ తంత్రీ, ప్రకృతి సహజసిద్ధమైన వాద్యాలతో పాటుగా లోహం తో తయారు చేయబడిన సంగీత పరికరాలను కూడా ఉపయోగిస్తారు.

ఇందులో భాగంగా కోయ గిరిజనులు తూతుకొమ్ము, అక్కుం వంటి వాయు సంబంధించిన సంగీత పరికరాలను ఉపయోగిస్తారు. ఇవన్నీ ఒక రకమైన సంగీత వాద్యాలయితే లోహ పాత్రలను ఉపయోగించి కూడా సంగీతాన్ని పుట్టిస్తారు. ఇందులో ప్రధానంగా గుజ్జిడి, గజ్జెలు, అందెలు, మంజీరాలు ముఖ్యమైనవి. ఇవే కాకుండా బంజారాలు తాళాలు మాత్రమే ఉపయోగించకుండా 'కొచోడ్' అనే కంచు పాత్రను కూడా వాద్యంగా ఉపయోగిస్తారు. అంతే కాక ఈ పాత్రను నంగారా వాద్యంలో చేర్చి తయారు చేసుకోవడం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. 'ఇట్లా గిరిజన వాద్యాలలో ఎన్నో ప్రత్యేకతలు కనిపిస్తాయి. ఇక కోయ గిరిజనుల ఉపతెగ పట్టెడ కళాకారులు ఉపయోగించే పట్టెడ వాద్యం కూడా కనుమరుగైంది. దీనితో వారి మౌఖిక సాహిత్యం అంతరించింది. అంతే కాక బంజారాల ఉపతెగ ధాడి కళాకారులు సారంగి అనే వాద్యాన్ని ఉపయోగించి బంజారాలకు కథలు చెప్తారు. నేడు ఆ వాద్యంతో పాటు వారి సంస్కృతి కాలగర్భంలో కలిసిపోతున్నది.

### ముగింపు :

ఆధునికంగా మారుతున్న కాలంతోపాటు గిరిజన వాద్యాలు అంతరించిపోయే దశకు చేరుతున్నవి. గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఎన్నో ప్రత్యేకమైన వాద్యాలను వాయించే కళాకారులు కనుమరుగవుతున్నారు. ఇదంతా ఒక్క రోజులో ఒక్క సంవత్సరంలో జరుగుతున్నది కాదు. క్రమంగా ఆయా తెగల్లో వస్తున్న సాంఘిక, సాంస్కృతిక మార్పుల కారణంగా క్రమంగా జరుగుతూ వస్తున్నది. గిరిజన వాద్యాలు కొన్నైతే ఆయా తెగలు అస్తిత్వానికి సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనంగా నిలుస్తాయి. ఉదాహరణకు గోండు గిరిజనుల ఉపతెగ అయిన తోటి వారు ఉపయోగించే కీకిరి వారి సంస్కృతిలో భాగమైనది. వారికి ఆ వాద్యం,ఆయా తెగ దేవత హీరాబాయికి ప్రతిరూపంగా, పవిత్రంగా కొలుస్తారు. ఇక కొండరెడ్డి

వారికి ప్రత్యేకంగా ఉండే ఔజం వాద్యం వారి అస్తిత్వానికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఈ రకంగా ఆయా తెగలకు కొన్ని ప్రత్యేక వాద్యాలు ఉన్నవి. ఇది వారి సంస్కృతీ గొప్పదనం. ఆయా వాద్యాలకు ప్రత్యేకమైన గుర్తింపు, చరిత్ర మౌఖిక సాహిత్యం ఉంటుంది. అయితే ఇప్పటికే అరుదైన వాద్యాలు తుడుం, కీకిరి, గుమేల, ఔజం, కిర్ధీ, డప్పులు మూగడోళ్లు, రబాబ్, సారంగి వంటి వాద్యాలు ప్రస్తుతం కనుమరుగయ్యే స్థితికి చేరుకున్నాయి. ఆయా వాద్యాలను వాయించే కళాకారులు కూడా వృద్ధ వయసులోనే ఉన్నారు. కళ అనేది యువతలో వారసత్వంగా సంక్రమిస్తే ఆ కళ పదికాలాలపాటు నిలుస్తుంది. అట్లా కాకుండా కళ వృద్ధుల చేతుల్లోనే ఉంటే వారి కళానైపుణ్యం ఆ కళ వారితోనే అంతరించిపోతుంది. ప్రస్తుతం ఇటువంటి పరిస్థితి గిరిజన వాద్యాలు వాయించే కళాకారుల్లో కనిపిస్తున్నది. పూర్వం కళాకారులు కొన్ని వాద్యాల మీద అనేక దరువులను అనేక రకాలుగా పలికించేవారు. ప్రస్తుతం ఆ దరువులను వాయించే కళాకారులు కనుమరుగవుతున్నారు.



ఇక వాద్యాలను తాము స్వయంగా తయారు చేసుకొనే సంస్కృతి కూడా కళాకారుల్లో కనుమరుగవుతున్నది. తద్వారా ఆయా వాద్యాల్లో నైపుణ్యం తగ్గి ఆ వాద్యాలు చేసే మధురమైన ధ్వని కూడా క్షీణించిపోతున్నది.

పూర్వం వాద్యం తయారీలో చర్మాన్ని ప్రధానంగా ఉపయోగించేవారు. కానీ ప్రస్థుతం దాని స్థానంలో ప్లాస్టిక్ వచ్చి చేరింది. డోలు వంటి తయారీలో కర్రను ఉపయోగించే సంస్కృతి ఉండేది కానే దాని స్థానంలో కీ కేసిన్ పైపును వాడుతున్నారు. ఈ కేసిన్ పైప్‌కే చర్మాన్ని ముడుసుకుంటున్నారు. ఇక కీకిరి వంటి వాద్యంలో గుర్రపు వెంట్రుకలు ఉపయోగించే స్థానంలో ప్లాస్టిక్ వైరును ఉపయోగిస్తున్నారు. అలాగే భాట్స్ కళాకారులు ఉపయోగించే రబాబ్ వాద్యానికి తీగలుగా ఒకప్పుడు మేక పేగులను ఉపయోగించేవారు. ప్రస్తుతం కొందరు కళాకారులు వాటి స్థానంలో ప్లాస్టిక్ తీగలను కట్టుకుంటున్నారు. వాద్యాల తయారీలో చర్మం, కర్ర ఉపయోగించి తయారు చేసుకోకుండా ప్లాస్టిక్, ఇనుము వంటి వస్తువులను ఆధునికంగా ఉపయోగిస్తున్నారు. దీని వల్ల వాద్యం యొక్క మూల శబ్దం ఏదైతే ఉంటుందో అది కనుమరుగవుతున్నది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని గిరిజనుల మూల సంస్కృతి ప్రతిబింబించే వాద్యాలన్నింటిని సేకరించి భద్రపరచాల్సిన అవశ్యకత ఉన్నది. తద్వారా వారి సంస్కృతి పరిరక్షింపబడుతుంది.

**విషయ దాతలు:**

1. అర్క రాములు, వయస్సు -70, కోలాం తెగ- కామాయపేట గ్రామం, ఇంద్రవెల్లి మండలం, ఆదిలాబాద్ జిల్లా.
2. సోయం భీమ్రావు, వయసు- 73- పర్ధాన్ తెగ- పర్ధాన్ గూడ- ఇంద్రవెల్లి మండలం -ఆదిలాబాద్ జిల్లా.
3. కొమ్రం లింగు-వయసు -70, గోండు -చుంచు ఘాట్ గ్రామం -ఆదిలాబాద్ మండలం, జిల్లా.
4. వెడ్మా శంకర్-వయస్సు 45, తోటి- ఎదులాపాడు -తిర్యాణి మండలం -ఆసిఫాబాద్ జిల్లా.
5. శెవికే మారుతి -వయస్సు 45-అంధ్, లోకారి-బి, గాదిగూడ మండలం - ఆదిలాబాద్ జిల్లా
6. భట్టు కిషన్- వయస్సు 65 -ఏబి తండా- నెక్కొండ మండలం- వరంగల్ జిల్లా
7. కొయ్యల సమ్మయ్య- వయస్సు 50 -నాయక పోడు- రొయ్యూరు మండలం-
8. కల్లు సోమిడి- వయస్సు 40- గుత్తి కోయ చింతలమోరి -ఏటూరు నాగారం మండలం- ములుగు జిల్లా.
9. సంద్ర శేఖర్ -వయస్సు 45- డోలికోయ- తుపాకులగూడెం గ్రామం-ఏటూర్ నాగారం మండలం- ములుగు జిల్లా.

- డా. బాసని సురేష్
m: 9989417299
e : basanisuresh75@gmail.com

DECCAN
దక్కన్
CHANNEL
సామాజిక, సాంస్కృతిక ఛానల్

# పర్యావరణ పరిరక్షణ

## ఏప్రిల్ 22 ప్రపంచ ధరిత్రి దినోత్సవం

ప్రతి యేటా ధరిత్రి దినోత్సవం (Earth Day) ఏప్రిల్ 22 న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించడమే.. దీని లక్ష్యం, ప్రాముఖ్యత. ఈ రోజును అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే (International Mother Earth Day) అని కూడా అంటారు. పర్యావరణానికి హాని కలిగించే, గ్రహం నాశనానికి దారితీసే కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, అటవీ నిర్మూలన వంటి సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ రోజున వివిధ అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం గురించి అవగాహన నిర్వహిస్తారు.



### చరిత్ర

అమెరికాలో సెనేటర్ గేలార్డ్ నెల్సన్ (Senator Gaylord Nelson) 1970లో మొదటిసారి ఎర్త్‌డేని నిర్వహించారు. కాలిఫోర్నియాలోని శాంటా బార్బరా చమురు చిందిన ఘటన తర్వాత అమెరికన్ పౌరులు చేపట్టిన ఉద్యమ విజయానికి సూచకంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పర్యావరణ శాస్త్రాన్ని ప్రోత్సహించాలని, పర్యావరణానికి సంబంధించిన సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలని నిర్ణయించారు. 1969 ప్రారంభంలో కాలిఫోర్నియా (California)లోని శాంటా బార్బరా (Santa Barbara)లో చమురు చిందిన భయానక ఘటన చూసిన తర్వాత గెలార్డ్ నెల్సన్ ఆందోళన చెందాడు.

ఏప్రిల్ 22, 1970న, నీటి కాలుష్యం, చమురు చిందటం, అడవి మంటలు, వాయు కాలుష్యం మొదలైన పర్యావరణ సంక్షోభానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. 20 మిలియన్ల అమెరికన్ పౌరులు నగరం అంతటా వీధుల్లోకి వచ్చారు. ఆ వీధి నిరసన భారీ సంచలనం సృష్టించింది. దావానలంలా వ్యాపించిన ఈ ఉద్యమంతో వందలాది నగరాలు క్రమంగా ఉద్యమ బాట పట్టాయి. ప్రపంచంలోని అతిపెద్ద నిరసనలలో ఒకటిగా ఈ ఉద్యమం నిలిచింది. మొదటి ప్రపంచ దినోత్సవ ఉద్యమం నుంచి ప్రస్తుత ప్రపంచ దినోత్సవం 2024 వేడుక వరకు ఇదే అతిపెద్ద ఉద్యమం.

ప్రస్తుతం సెమినార్లు, ఈవెంట్‌లు వంటి వాటితో అవగాహన కల్పించడానికి ఎర్త్ డే నిర్వహిస్తున్నాం. ఇటువంటి ఆధునిక పర్యావరణ ఉద్యమాలు మెరుగైన జీవనం పెంపొందించు కోవాల్సిన అవసరాన్ని ప్రపంచానికి తెలియజేస్తాయి.

### ఎర్త్ డే 2024 ప్రాముఖ్యత

మా థీమ్, ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్స్, ప్లాస్టిక్‌ల వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లన్నింటినీ త్వరితగతిన తొలగించాలని, ప్లాస్టిక్ కాలుష్యంపై బలమైన UN ఒప్పందం కోసం తక్షణమే ఒత్తిడి చేయాలని మరియు ఫాస్ట్ ఫ్యాషన్‌కు ముగింపు పలకాలని కోరింది.

– కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com



బాలసాహితీవేత్త
గరిపల్లి అశోక్‌ను
సన్మానిస్తున్న దృశ్యం



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాడభూషి లలితాదేవి,
డా॥ చెరుకుపల్లి హారిక, మణికొండ వేదకుమార్,
పైడిమర్రి గిరిజ, తిరునగరి వేందాత సూరి, గరిపల్లి అశోక్



మొలక బాలల పత్రిక
సంపాదకులు
తిరునగరి వేదాంత సూరిని
సన్మానిస్తున్న దృశ్యం

# మాడభూషి రంగాచార్య స్మారక కథల పోటీ బహుమతుల ప్రదానోత్సవం

మాడభూషి రంగాచార్య స్మారక సంఘం వారు గత ఇరవై యేళ్లుగా బాలసాహిత్య రంగంలో చేస్తున్న కృషి ఎంతో శ్లాఘనీయం. ప్రతి ఏటా నవంబరు నెలలో హైదరాబాద్‌లోని పాఠశాలల బాలబాలికలకు కథల పోటీ నిర్వహిస్తుంది. అందులో బాగున్న కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పదకొండు ప్రోత్సాహక బహుమతులను మార్చి 11న అందజేయడంతో పాటు ఇద్దరు బాల సాహితీవేత్తలను సన్మానించడం జరుగుతుంది.

ఈ యేడాది మార్చి 11న హైదరాబాద్ నగరంలోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో గిరిజ పైడిమర్రి అధ్యక్షతన స్మారక సమావేశం జరిగింది. సంస్థ కన్వీనర్ మాడభూషి లలితాదేవి సాహితీరంగంలో తమ సంస్థ చేస్తున్న కృషిని వివరించారు.

ముఖ్య అతిథిగా చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఛైర్మన్, దక్కన్‌ల్యాండ్, బాలచెలిమి పత్రికల సంపాదకులు మణికొండ వేదకుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాలసాహితీవేత్త డా. సిరి రాసిన 'రాచ ఏనుగు' బాలల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాల సాహితీవేత్తల సన్మానం, విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. వేదకుమార్ తన ప్రసంగంలో విద్యార్థులలోని సృజనాత్మక శక్తులను వెలికి తీయాలని, ఆ బాధ్యత ప్రధానంగా ఉపాధ్యాయులది, తల్లిదండ్రులది అని చెప్పారు. అలాంటి పిల్లలకు తాము ఎల్ల వేళలా అండగా ఉంటామని చెపుతూ... ఆ సందర్భంలో బహుమతులు అందుకున్న పిల్లలకు బాలచెలిమి పత్రికను సంవత్సరం పాటు ఉచితంగా అందజేస్తామన్నారు. పిల్లలు రాసిన సృజనాత్మక రచనలను తమ పత్రికలో ప్రచురిస్తామని చెప్పి వాళ్ళను ప్రోత్సహించారు. బాల సాహిత్యరంగంలో మాడభూషి రంగాచార్య స్మారక సంఘం చేస్తున్న కృషిని కొనియాడారు.

సన్మాన గ్రహీత మొలక బాలల పత్రిక సంపాదకులు తిరునగరి వేదాంత సూరి మాట్లాడుతూ... వార్త దినపత్రికలో మొగ్గ పిల్లల పేజీకి తాను చాలా కాలం ఇన్‌చార్జిగా పనిచేసానని ఎంతోమంది మొగ్గ (పిల్లలు) పాఠకులు ఈనాడు ఉన్నతస్థానంలో ఉన్నారని, పిల్లలు అనుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదని అన్నారు.

సన్మానగ్రహీత బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ మాట్లాడుతూ.. మునుపెన్నడూ లేనంత విస్తృత స్థాయిలో ఈనాడు బాల సాహిత్యం వస్తున్నదని, బడి పిల్లలే తమ జీవితంలోని సంఘటనలను కథలుగా రాస్తున్నారని తెలిపారు.

ఈ కథల న్యాయ నిర్ణేతగా బాలసాహితీవేత్త డా. హారిక చెరుకుపల్లి మాట్లాడుతూ.. అన్ని కథలూ బాగున్నాయని, కానీ పోటీ అన్నాక కొన్ని కథలను మాత్రమే ఎంపిక చేయడం తప్పదని, బహుమతి రాని పిల్లలు నిరుత్సాహపడవద్దని చెపుతూ పిల్లలు రాసిన నాలుగు కథలను సమీక్షించారు. సెల్‌ఫోనును అర్థవంతంగా ఎలా ఉపయోగించవచ్చునో తెలిపే కథ ప్రథమ బహుమతికి ఎంపికైంది. దీనిని ఎనిమిదో తరగతి చదివే మాంకాల ఉజ్వల రాసింది. మార్కులే కొలమానం కాదంటూ... జడ్.పి.హెచ్.ఎస్. బొల్లారం ఎనిమిదో తరగతి విద్యార్థి గణపతి వెంకట్రావు రాసిన కథ ద్వితీయ బహుమతి పొందింది.

– పైడిమర్రి గిరిజ
m : 9949443414

# బాలచెలిమి గ్రంథాలయం

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తడపాకల్, నిజామాబాద్ జిల్లా

బాల చెలిమి గ్రంథాలయంను మా పాఠశాలలో 2020లో ఏర్పాటు చేయడం జరిగింది. సుమారు 25 వేల రూపాయలతో మా పాఠశాలకు ఈ గ్రంథాలయాన్ని బాలచెలిమి వ్యవస్థాపకులు శ్రీ వేదకుమార్ గారు ఇవ్వడం జరిగింది. అనేక రకాల పుస్తకాలు ఉండడంవల్ల మా విద్యార్థులు వాటిని చదవడం, అనేక విషయాలు అర్థం చేసుకోవడం, దానితోపాటు చక్కగా కథలు రాయడం, కవితలు అల్లడం జరిగింది. అనేక సాహిత్య పోటీలలో పాల్గొని బహుమతులు కూడా సంపాదించడం జరిగింది. అదేవిధంగా అనేక ప్రక్రియల్లో విద్యార్థులు పుస్తకాలను రాయడం, ఆవిష్కరించడం జరిగింది. చక్కని గ్రంథాలయాన్ని మాకు బహుమానంగా ఇచ్చిన బాలచెలిమి వారికి ప్రత్యేక అభినందనలు.

– ప్రవీణ్ కుమార్ శర్మ
తెలుగు పండితులు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
తడపాకల్, నిజామాబాద్ జిల్లా.



ఏడవ తరగతి నుండి నేను మా పాఠశాల గ్రంథాలయం పుస్తకాలను చదవడం మొదలు పెట్టాను. ముఖ్యంగా బాలచెలిమి వారు మా పాఠశాలకు గ్రంథాలయం ఇవ్వడం ద్వారా అనేక పుస్తకాలను చదివే అవకాశం నాకు లభించింది. దాని వల్లనే నేను కథలు కవితలు రాయడం జరిగింది. ఇప్పటివరకు సుమారుగా 30 కథలు, కవితలు రాసాను. అనేక సాహిత్య పోటీలలో పాల్గొని బహుమతులు కూడా సాధించాను. అంతర్జాతీయ మాసపత్రిక గడుగ్గాయి వారు నిర్వహించిన కవితల పోటీలలో పాల్గొని నేను రాసిన కవిత తెలుగు భాషకి బహుమతి పొందాను.

**– శ్రీలేఖ, పదవ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్**






మా పాఠశాల పేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్.. మా పాఠశాలలోని బాలచెలిమి గ్రంథాలయంలో ఉన్నటువంటి అనేక పుస్తకాలను ప్రతినిత్యం చదవడం వల్ల నేను కవితలు, కథలు రాయడం నేర్చుకున్న. ఇప్పటివరకు 30 పైగా కవితలు కథలు రాయడమే కాకుండా అనేక సాహిత్య పోటీలలో పాల్గొని బహుమతులు సంపాదించాను. జాతీయస్థాయి సైన్స్ ఫిక్షన్ కథల పోటీలలో తాను రాసిన 'అమ్మ కోరిక' అనే కథకు ప్రత్యేక బహుమతి లభించింది. అదేవిధంగా జిల్లాస్థాయిలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కవితల పోటీలలో నేను రాసిన 'నీటి విలువ' అనే కవితకి జిల్లా స్థాయిలో రెండవ బహుమతిని సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

– మహమ్మద్ రీమ్ షా, 8వ తరగతి



బాల చెలిమి గ్రంథాలయం లోని అనేక పుస్తకాలను చదవడం వల్ల కథలను రాయడం, కవితలు రాయడం నేర్చుకున్నాం. అనేక సాహిత్య పోటీలలో పాల్గొని బహుమతులు పొందినాను. చిన్నారి కథలు, చదువు, అమ్మ సరళ వచన శతకాల పుస్తకాలను ఆవిష్కరించాను. అక్షరయాన్ బాలిక పురస్కారం, బాల జ్యోతి పురస్కారం, తానా వారి పురస్కారం అందుకున్నాను.

– పేరుదేగల వైష్ణవి

# మంచి పుస్తకం @20

పిల్లలు పరిపూర్ణులు. వాళ్ల భవిష్యత్తును వాళ్ళు ఎంచుకోవాలి, అందుకు బాధ్యత కూడా వాళ్లే వహించాలి అన్న నమ్మకంతో మంచి పుస్తకం పని చేస్తుంది. అనుకరణ, ఇతరులను ఆరాధించటం ద్వారా పిల్లలు నేర్చుకుంటారన్నది నిజమే. అయితే, ఎవరితో (దేనితో) ప్రభావితం కావాలనేది ఎంచుకునేది పిల్లలే. కాబట్టి, వారికి నీతి కథలు చెప్పాల్సిన పనిలేదు, అందువల్ల ఉపయోగం కూడా లేదు. రోడ్లు మీద పాదాచారులతో సహా ఎవరూ నియమాలు పాటించరు. పుస్తకాలలో ట్రాఫిక్ రూల్స్ గురించి ఎంత చెప్పినా ఏం లాభం?

అందుకే, పిల్లలలో పుస్తకాల పట్ల ప్రేమ, తెలుగులో పఠనా సామర్థ్యం పెంచటం ప్రధాన ఉద్దేశంగా మంచి పుస్తకం సంస్థ పని చేస్తోంది. పిల్లలలో ఆసక్తి కలిగించటం వరకే మన పని. పుస్తకాలు చదవటం వల్ల పిల్లల్లో మనో వికాసం, ఎదుగుదల బాగుండటం వంటి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. వాటిని మళ్లీ, మళ్లీ ఉద్ఘాటించనవసరం లేదు, ఉదాహరణలు ఇవ్వవలసిన అవసరం కూడా లేదు. పుస్తకాలను అందిస్తూ వెళ్లటమే మన పని అని త్రికరణ శుద్ధిగా నమ్మి, నమ్మిన భావాలను ఆచరణలో రాజీలేకుండా నడుస్తూ అప్పుడే 20 ఏళ్లు పూర్తి చేసుకుంది మంచి పుస్తకం. 20 ఏళ్లుగా ఈ రంగంలో పని చేస్తూనే ఉన్నా మంచి పుస్తకం గురించి నలుగురికీ గట్టిగా తెలియదు. అందుకే ఈ సందర్భంగా 2024 ఏప్రిల్ 27న తమ పని గురించి, ప్రయాణం గురించి, తమతో నడిచిన వాళ్ల గురించి, సహాయ సహకారాలు అందించిన వాళ్ల గురించి తెలియ చేస్తూ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తార్నాకాలోని సేంట్ ఆన్స్ జనరలేట్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగే ఈ కార్యక్రమంలో మంచి పుస్తకం ప్రచురణలు అమ్మకానికి కూడా ఉంటాయి. (ఈ కార్యక్రమానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం పి. భాగ్యలక్ష్మిని 9490746614లో సంప్రదించ వచ్చు.)

20 సంవత్సరాల మంచి పుస్తకం

పిల్లలు అభం శుభం తెలియని వాళ్లు. వాళ్ల మనసుల నిండా ఎన్నో ప్రశ్నలు, తెలుసుకోవాలనే తపన, వెల్లువెత్తే సృజన ఉంటాయి. కించిత్తు స్వార్థం ఉన్నా నిజాయితీ నిండుగా ఉంటుంది. చెప్పటమే తప్పు ఆచరించని పెద్దలు చిన్నప్పటి నుంచే పిల్లలను తీర్చి దిద్దాలని అనుకుంటారు. పిల్లల్లో ప్రోత్సహించాలి అనుకుంటున్న సృజనాత్మకతకు పెద్దవాళ్లు అడ్డుపడకుండా ఉంటే చాలు. నేటి బాలలే రేపటి పౌరులు అంటారు కానీ ఆ బాల్యాన్ని గతానికి, పెద్దల మౌఢ్యానికి బలి చేస్తున్నారు. జీవితమే ఒక పాఠశాల అనే వాళ్లు నేర్చుకోవటం ఎప్పుడో మానేశారు. అందుకే చిన్నప్పుడే పిల్లల బుర్రలలో అంతా కూరెయ్యాలని పెద్దవాళ్లు అనుకుంటారు. దీనివల్ల హిపోక్రసీ, కపటత్వం తప్పించి పిల్లలు వేరేమీ నేర్చుకోరు. అలాగే, సృజనాత్మకతను ప్రదర్శించే పిల్లలను ప్రేమించినట్లే సాధారణ పిల్లలను కూడా ప్రేమించాలి. ఇవీ మంచి పుస్తకానికి ఒక రకంగా తాత్విక పునాదులు.

ఒకప్పుడు మధ్య తరగతి ప్రజలలో చదివే సంస్కృతి ఉండేది. ఎన్నో వార, మాస పత్రికలు వచ్చేవి. గ్రంథాలయాలు ఉండేవి, అద్దెకు పుస్తకాలు దొరికేవి. చందమామ వంటి పత్రికలు పిల్లలనే కాక పెద్దవాళ్లను కూడా అలరించేవి. వీటన్నిటి మధ్య చదవటం ఎలా నేర్చుకున్నారో తెలియకుండా నేర్చేసుకున్నారు. పదవ తరగతికి వచ్చేసరికి ధారాళంగా చదవటం వచ్చి పల్ప్ నవలల నుంచి ప్రగతిశీల పుస్తకాల వరకు చదివేసేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. టెలివిజన్, సెల్ ఫోన్, కంప్యూటర్‌లు రావటంతో చదివే సంస్కృతి కొన్ని వర్గాలలో తగ్గింది. దీనికి తోడు ఇంగ్లీషు భాషకి ప్రాధాన్యత, ఆ మాధ్యమంలో బోధన. వెరసి తెలుగు చదవగలగటం సమస్యగా మారింది. ఈ తరం పిల్లలకు చందమామ తరహా కథలు నచ్చకపోవచ్చు.

ఈ నేపథ్యంలో మంచి పుస్తకం తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుంది. తెలుగు నేర్చుకోవాలి, తమ పిల్లలకి తెలుగు నేర్పాలి అనుకుంటున్న వాళ్లకి సహాయపడటానికి రకరకాల పుస్తకాలు తీసుకుని వస్తోంది. పిల్లలకు పుస్తకం పట్ల ప్రేమ, తెలుగులో చదివే ఆసక్తి కలిగించాలి అనే సూత్రం చుట్టూ మంచి పుస్తకం కృషి చేస్తూ ఉంది. ఈనాటి పిల్లలకు తగిన కథలు, అర్థమయ్యే రీతిలో చెప్పవలసిన అవసరం ఉందని గమనించారు. ఆ వైపు పని చేస్తూ బాల సాహిత్యంలో కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. బాలల్లో వచ్చిన మార్పులు అర్థం చేసుకుని ముందుకు సాగాలి అన్నది ఈ 20 ఏళ్ల అనుభవంలో తెలుసుకున్నామని మంచి పుస్తకం




*2003లో* హైదరాబాద్ బుక్ ఫెయిర్ *2004లో*

నిర్వాహకులు అంటారు.

మంచి పుస్తకం ప్రయాణం ఒక విధంగా చెప్పాలంటే సుదీర్ఘమయినది. అడుగులో అడుగేసుకుంటూ, హడావిడి, ఆర్భాటాలు లేకుండా స్థిరంగా లక్ష్యం దిశగా సాగుతూ వచ్చింది. ఈ రోజు మంచి పుస్తకం ఒక ట్రస్ట్‌గా, పుస్తకాలు అనువదిస్తూ, ప్రచురిస్తూ, ఇతర సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటూ ముందుకు సాగుతూ ఉంది.

2002లో హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో పుస్తకాలతో స్నేహం పేరుతో పాల్గొనటంతో మొదటి అడుగు పడింది. అప్పట్లో అందుబాటులో ఉన్న పలు సంస్థలు ప్రచురించిన బాల సాహిత్యం అంతా ప్రదర్శనకు పెట్టారు. తల్లిదండ్రులు, పిల్లలతో మాట్లాడటం ప్రధాన పనిగా నిర్వాహకులు, వాలంటీర్లు ఎంతో కృషి చేశారు. అదే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. 600కి పైగా ఉండిన ఆ పుస్తకాల రెండు సెట్లను ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ వేద కుమార్ కొనుగోలు చేయటంతో వాటి ఆధారంగా పుస్తకాల జాబితాను రఘుబాబు తయారు చేశారు. వయస్సు, విషయం వారీగానే కాకుండా ప్రచురణకర్తల వారీగా కూడా సమాచారం ఇచ్చే ప్రయత్నం చేశారు. పుస్తకాలను పిల్లలకు చేరవేయటంలో ఇలాంటి జాబితా, కేటలాగుల సంప్రదాయాన్ని మంచి పుస్తకం ఇప్పటికీ కొనసాగిస్తోంది.

మంచి పుస్తకం 2004 ఏప్రిల్‌లో పబ్లిక్ ట్రస్ట్‌గా నమోదయింది. దీని మూలాలు మాత్రం 1989లో పురుడు పోసుకుని పదేళ్ల పాటు పిల్లల సాహిత్యం, పుస్తకాలు కోసం తపించి, పరితపించి 40 పుస్తకాల దాకా ప్రచురించిన బాల సాహితి బుక్ ట్రస్ట్‌లో ఉన్నాయి. పిల్లల పుస్తకాల కోసం ఏర్పడిన పేగు బంధం అని చెప్పవచ్చు కూడా.

వివిధ పుస్తక ప్రదర్శనలలో పాల్గొంటూ, సొంతంగా, ఇతరులతో కలిసి పుస్తకాల ప్రచురణలు పెంచుకుంటూ కేరాఫ్ వానన్‌గా ఉన్న చిరునామా 2007లో మారి స్వతంత్ర కార్యాలయంలో పని చేస్తూ ఉంది మంచి పుస్తకం.

మంచి పుస్తకం చేసిన మరో మంచి ప్రయత్నం ఏమిటంటే... గిరి గీసుకుని కూర్చోకుండా వారి లక్ష్యాలకు భంగం కలిగించని రీతిలో పని చేసే సంస్థలతో చేయి చేయి కలిపింది. ఉదాహరణకు మొదట్లో జన విజ్ఞాన వేదిక (ఇప్పుడు విజ్ఞాన ప్రచురణలు) ద్వారా పలు అంశాలపై వివిధ పుస్తకాలు అందుబాటులోకి తెచ్చారు. ఇన్నేళ్లుగా ఈ అనుబంధం కొనసాగుతూ ఉంది. వందకి పైగా పుస్తకాలు ఈ రెండు సంస్థలూ కలిసి ప్రచురించాయంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ప్రచురణలు ద్వారా ఎక్కువ మందికి చేరువ కావాలనే మౌలిక ఆశయాన్ని మంచి పుస్తకం సాధించింది అని చెప్పవచ్చు. ఈ క్రమంలో పాలపిట్ట ప్రచురణలు, వికాస విద్యా వనం, జాబిల్లి ట్రస్ట్, వాహిని బుక్ ట్రస్ట్, శాంతివనం, అలరు, దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ వంటి వాటితో కలిసి ఉమ్మడిగా ప్రచురణలు తీసుకు వచ్చారు. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను అంది పుచ్చుకుంటూ పిల్లల్లో పుస్తకాల పట్ల ప్రేమ, అభిమానం, ఆప్యాయత, అనురాగం పెంచేందుకు చేసిన ప్రయత్నం చిన్నదేమీ కాదు. చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్, అమర చిత్ర కథ వంటి సంస్థలతో సోల్ డిస్ట్రిబ్యూషన్ ప్రాతిపదికన తెలుగు పుస్తకాలు (20 దాకా) తీసుకుని రావటం అభినందించ దగ్గ మరొక విషయం.

పుస్తకాలను పిల్లలకు చేర్చటంలో అనేక ఫౌండేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్.ఆర్.ఐ. సంస్థలు, వ్యక్తుల పాత్ర ఎంతైనా ఉంది. ఇందులో ప్రముఖంగా చెప్పుకోవలసింది ఎం. వి. ఫౌండేషన్. నల్గొండ జిల్లాలో మొదటి దశలో 96 పాఠశాలలు, రెండవ దశలో 212 పాఠశాలల్లో ఆరేళ్ల పాటు సాగిన క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టులో గ్రంథాలయాల భాగస్వామిగా పని చెయ్యటానికి మంచి పుస్తకం సంస్థకి అవకాశం దొరికింది. ఇది దీనికి బలమైన పునాదిగా మారింది.

డా. రెడ్డీస్ ఫౌండేషన్, బ్రెడ్ సొసైటీ, వందేమాతరం ఫౌండేషన్, ఆర్.డి.ఎఫ్., డి.ఎస్. ఫౌండేషన్, సాధన, మహిత, యునిసెఫ్, పాఠశాల గ్రంథాలయం, కీట్స్, రూం టు రీడ్, శిక్షణా ఫౌండేషన్, పిజిఎన్ఎఫ్, లర్న్ ఎండ్ హెల్ప్, బాల చెలిమి గ్రంథాలయాలు, పుస్తక మిత్ర – రీడ్ టు లీడ్, భారత్ దేఖో, మంత్ర ఫర్ ఛేంజ్– ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంస్థలు మంచి పుస్తకం ప్రచురించిన పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల వద్దకు చేర్చాయి.

మంచి పుస్తకం... బాల సాహిత్యం గురించి చెప్పుకుంటూ సోవియట్ సాహిత్య ప్రభావం మాట్లాడక పోతే పాఠకులు అన్యథా భావించే అవకాశం ఉంది. ఇప్పుడు రాస్తున్న అనేకమంది కవులు, రచయితలపై సోవియట్ సాహిత్య ప్రభావం చాలా ఉంది. మనకు రష్యన్ రచయితలు తెలిసినంత బాగా ఇతర ప్రపంచ దేశాల రచయితల గురించి తెలియదు. సోవియట్ పుస్తకాల వల్ల అసంఖ్యాకమైన తెలుగు పాఠకులకు టాల్‌స్టాయ్, గోర్కీ వంటి మహా రచయితలు చిన్నతనంలోనే పరిచయమయ్యారు. ఆ రచయితలు పిల్లల కోసం రాసిన కథలను సోవియట్ ప్రచురణ సంస్థ ప్రపంచ భాషలలోకి అనువదించి, ప్రపంచ వ్యాప్తంగా అందరికీ అందుబాటులో తెచ్చింది.

మొదట్లో అనువాదాలపై ప్రధానంగా ఆధారపడిన మంచి పుస్తకం తెలుగులో మూల రచనలు తీసుకు రావటానికి కృషి మొదలు పెట్టింది. ఈ కృషిలో 2017లో తానా సంస్థతో భాగస్వామ్యం అందుకోవటం ముఖ్యమయిన మలుపుగా చెప్పుకోవాలి. ఇందులో భాగంగా పది సంవత్సరాలు పైబడిన పిల్లలకు సాహసం, సైన్స్ ఫిక్షన్‌లలో నవలలు, పది సంవత్సరాల లోపు పిల్లల కోసం బొమ్మల కథ పుస్తకాలు ప్రచురించటానికి పూనుకుంది. ఈ ప్రయత్నానికి మంచి గుర్తింపు లభించింది. ఈ పుస్తకాలు పాఠకుల మన్ననలు పొందాయి. మొత్తం 4 దఫాలలో 28 బొమ్మల కథ పుస్తకాలు, 21 నవలలు ప్రచురితం అయ్యాయి.




ఒకటా, రెండా... ఇలా ఎన్నో, ఎన్నెన్నో చెప్పుకోదగిన ప్రయత్నాలు ఈ 20 ఏళ్లుగా చేస్తూ వచ్చారు, వస్తున్నారు. భవిష్యత్తులో కూడా చేస్తారు. తక్కువ ఖర్చుతో పుస్తకాలతో స్నేహం అన్న పేరుతో గ్రేడెడ్ పఠన సామాగ్రి అందించే ప్రయత్నం ప్రారంభించి ఇప్పటివరకు ఐదు స్థాయిలలో, 85 పుస్తకాలతో 1760 పేజీల గ్రేడెడ్ రీడింగ్ మెటీరియల్ అందించిన మంచి పుస్తకం గురించి ఏమనాలి మనం? జేజేలు పలకాల్సిందే.


తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సాధారణంగా నీతి కథలు, వ్యక్తిత్వ వికాసం, వివిధ రంగాల ప్రముఖుల జీవిత చరిత్రలు ఎక్కువగా కోరుకుంటారు. వీటితోపాటు జీవన నైపుణ్యాలు, స్ఫూర్తిదాయక పుస్తకాలు కావాలని అడుగుతూ ఉంటారు. చదవటమే బాగా రాని పరిస్థితులలో పిల్లల పఠన స్థాయికి మించిన పుస్తకాలను ఎక్కువగా గ్రంథాలయాలకు కొంటున్నారు. మంచి పుస్తకం సంస్థకు ఒక మార్గం ఉంది. కష్టం అయినా ఆ తోవలోనే నడుద్దాం అనుకున్నారు. అందువల్ల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులకు అర్థమయ్యేలా చెప్పి వారిలో కొత్త ఆలోచనలకు ప్రేరణ కలిగించారు. పిల్లలు చదవటానికి ఇష్టపడే బొమ్మల కథలు, గ్రేడెడ్ మెటీరియల్ కొన్న తల్లిదండ్రులు, టీచర్లు వాటి వల్ల తమ పిల్లలు ఎలా లాభపడ్డారో తెలియ చేస్తుంటే తమ కృషికి తగిన ఫలితం లభించిందని మంచి పుస్తకం నిర్వాహకులు సంతోష పడుతుంటారు. ఈ ప్రయత్నంలో వందేమాతరం మాధవరెడ్డి ఎంతో సహకరించారు. ఈ రకంగా మంచి పుస్తకం ప్రచురించే విభిన్నమయిన పుస్తకాలుకు ఉన్న ప్రత్యేకతలను ఆ రంగంలో ఉన్న అందరూ గుర్తించేలా చేయగలిగారు. వారికంటూ ఒక బ్రాండ్ ఇమేజ్‌ని సృష్టించు కోవటం ద్వారానే 20 ఏళ్ల కాలంలో దాదాపు 500 పుస్తకాలు తేగలిగారు. ఇది ఆషామాషి వ్యవహారం కాదు.

బాల సాహిత్యానికి ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. కాకుంటే మనం ఎంత మెరుగైన సాహిత్యాన్ని, బొమ్మల పుస్తకాల్ని వారికి అందిస్తున్నాం అన్నది ముఖ్యం. ఈ విషయంలో 'మంచి పుస్తకం' లాంటి ప్రచురణ సంస్థలు చాలా ముందడుగు వేశాయి అని చెప్పటంలో సంశయం అక్కర్లేదు. వారి ప్రచురణలో ఇప్పటికీ నుతయేవ్ రాసిన పడవ ప్రయాణం, బాల సాహితీ ప్రచురించిన టాల్‌స్టాయ్ బాలల కథలు నిరంతరం ముద్రణకు వస్తూ పిల్లలను అలరిస్తూనే ఉన్నాయి.

తన ఇరవై ఏళ్ల ప్రయాణంలో మంచి పుస్తకం సంస్థకి అనేక మంది అనువాదకులు, రచయితలు, చిత్రకారులు సహకరించారు. మరో వైపు కొంతమంది రచయితలు, చిత్ర కారులను మంచి పుస్తకం పరిచయం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అంశాలున్నాయి... చదవడమే తగ్గింది. అందులోనూ తెలుగు పుస్తకాలు మరీనూ... పిల్లల పుస్తకాలు... తెలుగులో అయితే ఇంకా చెప్పవలిసింది ఏమీ లేదు అంటున్న సమయంలో కూడా గుండె మీద చెయ్యి వేసుకుని మా పుస్తకాల ద్వారా పిల్లలు తెలుగు నేర్చుకోవటం, వాళ్ళలో పుస్తకాల పట్ల ప్రేమ కలగటం మాకు సంతృప్తిని ఇచ్చే విషయం, అది ఎంత తక్కువ సంఖ్య అయినప్పటికీ మేం సగర్వంగా, సంతోషంగా ఉన్నాం, ఈ తోవలోనే ముందుకు వెళ్తాం అంటున్న మంచి పుస్తకం సంస్థకు శుభాకాంక్షలు.

– వలేటి గోపీచంద్
m : 9441276770

# నానమ్మ చెప్పిన కథ




పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు.,కథల పుస్తకాలే. పాఠ్య పుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. భాషకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేవి కథలే. కొత్త కొత్త పదాలను పరిచయం చేసేది కథల పుస్తకాలే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి.

పిల్లలలో నైతికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను ఉమ్మడి కుటుంబాల్లో నాయనమ్మలు, అమ్మమ్మలు చెప్పే కథలు నెరవేర్చేవి. మారిన పరిస్థితులలో ఆ బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

ఈ మే నెలలో బాలచెలిమి పర్యావరణ కథల పోటీలు – 2023 నిర్వహించింది. తక్కువ సమయంలోనే, వేసవి సెలవులు అయినప్పటికీ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 51 కథలు వచ్చాయి. కథలన్నీ చాలా బావున్నాయి. బాల సాహిత్య నిపుణులు ఈ కథలను చదివి, చర్చించి ప్రచురణకు 24 కథలు ఎంపిక చేశారు. ఈ కథల పోటీలు నిర్వహించి మరియు పుస్తక రూపాన్నిచ్చింది బాలచెలిమి. **– వేదకుమార్ మణికొండ**

అనగనగా ఒక గ్రామం. ఆ గ్రామం పేరు రామనాథపురం. ఆ ఊరిలో ఇద్దరు దంపతులు ఉండేవారు. వారికి ఒక కొడుకు. ఆ కొడుకు పేరు రాము. రాము బాగా చదువుకొని మంచి స్థాయిలో ఉన్నాడు. కొంతకాలం తర్వాత రాముకి తల్లిదండ్రులు పెళ్లి చేసారు. రాముకి ఇద్దరు పిల్లలు. వారి పేర్లు ప్రతిభ, శ్రీధర్. ప్రతిభ 10వ తరగతి, శ్రీధర్ 9వ తరగతి చదువుతున్నారు. ప్రతిభ వాళ్ళ నాన్నమ్మ చిన్నప్పటి నుండి కథలు చెప్తూ పెంచింది. నాన్నమ్మ చెప్పే కథలు చాలా నీతివంతంగా ఉంటాయి. అలాగే విలువలతో కూడినవిగా ఉంటాయి.



ఒక రోజు ప్రతిభ వాళ్ళ నాన్నమ్మ పర్యావరణం గురించి కథ చెప్తుంది. అప్పుడు ప్రతిభకు ఒక అనుమానం వచ్చింది. "నాన్నమ్మ మీ కాలంలో ఉండే పర్యావరణానికి, ఇప్పటి పర్యావరణానికి ఏమైనా తేడా ఉందా?" అప్పుడు వాళ్ళ నాన్నమ్మ ఇప్పటి పర్యావరణానికి అప్పటి పర్యావరణానికి చాలా తేడా ఉందని చెప్తుంది.

"ఎలాగా నాన్నమ్మా" అని ప్రతిభ అడిగింది. "మా కాలంలో చాలా అడవులు, చాలా పక్షులు, జంతువులు, చెరువులు, బావులు, మంచి గాలి ఉండేవి. కాని ఇప్పటి కాలంలో అవన్నీ తగ్గిపోయాయి. నానమ్మ ఇప్పుడెందుకు అవన్నీ తక్కువగా ఉన్నాయని" అడిగింది ప్రతిభ.

"ఈనాటి కాలంలో ఎక్కడ చూసినా పెద్ద పెద్ద అంతస్థులు, భవనాలు ఉన్నాయి. ఆనాటి కాలంలో పూరి గుడిసెలు, మట్టి ఇళ్లు ఉండేవి. ఇప్పుడు చెట్లను నరికి వేసి భవనాలు కడుతున్నారు. అటవీ సంపద కోసం, ఖనిజాల కోసం అడవులను నరి కేస్తున్నారు. దీనివల్ల అడవుల్లో నివసించే జంతువులు కూడా కనుమరుగవుతున్నాయి. ఆనాటి కాలం చాలా ప్రశాంతంగా ఉండేది. ఆ అడవులలో ఆ ఉండే చెట్ల నుంచి వచ్చే గాలి చాలా స్వచ్ఛంగా ఉండేది. ఇప్పుడు గాలి కాలుష్యం అవ్వడం వల్ల, ఆ గాలిని పీల్చుకోవడంతో చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారు" అని చెప్పింది నాన్నమ్మ.

"నాన్నమ్మ మన ఊరి చివర్లో ఉన్న చెరువులో నీరెందుకు చాలా మురికిగా ఉన్నాయి" అని అడిగాడు శ్రీధర్. "ఈ కాలంలో ప్లాస్టిక్ వినియోగం చాలా ఎక్కువైపోయింది. 'ప్లాస్టిక్ వినియోగం మంచిది కాదు' అని చెప్పిన కూడా ఎవ్వరూ దాన్ని వినియోగించడం ఆపలేదు. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలు మొత్తం ఒక కుప్పలాగా వేస్తారు. వర్షం వచ్చినప్పుడు లేదా బాగా గాలి వీచినప్పుడు ఆ వ్యర్థ పదార్థాలు మన ఊరి చివర వున్న చెరువులో కలిసి పోతాయి. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు కలుస్తాయి. అప్పుడు నీరు కాలుష్యం అయిపోతుంది. నీటి కాలుష్యం వ్యర్థ పదార్థాల ద్వారా జరుగుతుంది. నీటి కాలుష్యం జరగకుండా ఉండాలంటే నీటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి అని చెప్పింది నాన్నమ్మ.

ఇలా చెప్తుండగా శ్రీధర్ వాళ్ళ నాన్న వచ్చి వీటిపై ఇంకా అవగాహనను పెంచాడు. ప్రతిభ, శ్రీధర్లు చాలా సంతోషించారు. 'ఎలా ఉంది? కథ?' అని నాన్నమ్మ అడిగింది. "నాన్నమ్మ కథ చాలా బావుంది" అని ప్రతిభ, శ్రీధర్లు సమాధాన మిచ్చారు. కథ చెప్పిన తర్వాత అందరూ వెళ్లి నిద్రపోయారు.

**– కొట్ల శిరీష,** ఫోన్ : 8790325502

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 26th - March 2024,
ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month
RNI Regn. No. APTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

Oxford Grammar High School

OGS JUNIORS grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



# We make school time the **best time** for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- **Loving atmosphere & play ground**
- **CCTV surveillance**
- **Certified teachers & caring staff**
- **Kids zone & play area**
- **Interactive & Value based Learning**

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar